www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 292 | మంగళవారం | 22 -09-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలకు నోటీసులు

స్పీకర్‌ను దూషించారన్న ఆరోపణలతో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ కుమార్‌రెడ్డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఈ నెల 8న కింది కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఎసిపి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ మధుసూదన్ రావు విచారించారు. పిపి వాది స్తూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలను రిమాండ్‌కు పంపేందుకు మేజిస్ట్రేట్ నిరాకరించడం చట్ట వ్యతిరేకమన్నారు. కాగా హైకోర్టు తదుపరి విచారణను 23కి వాయిదా వేసింది.



## అయోధ్య విరాళాల చోరీ... 3 రోజుల్లో సిట్ తొలి ఛార్జిషీట్

**న్యూఢిల్లీ:** అయోధ్య రామాలయంలో విరాళాల దొంగతనం కేసులో సెప్టెంబరు 25వ తేదీ లోపు ఛార్జిషీటు నమోదు చేస్తామని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది.ఈ విరాళాల దొంగతనం కేసులో సిట్ దాఖలు చేయబోయే మొట్టమొదటి ఛార్జిషీటు ఇదే. ఈ కేసులో మొదటి అరెస్టు చేసిన రోజు నుండి 90 రోజులు గడువు లోపు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ పూర్తిచేసి ఛార్జిషీటు నమోదు చేయాల్సి ఉంది. లేకపోతే ఈ కేసులో నిందితులకు ఎవరిప్రమేయం లేకుండా సహజంగా బెయిలు లభిస్తుంది. ఈ గడువు మరో మూడు రోజుల్లో అంటే శుక్రవారంనాటితో ముగియనున్నది. దీంతో సిట్ తొందర పడుతోంది. ఈ విషయాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియజేశారు.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్,జస్టిస్ జోమాల్య బాగ్చి, తరువాయి 12లో




## మళ్లీ బ్యాంకుల సమ్మె

- ఈనెల 26 నుంచి 30 వరకు నిలిచిపోనున్న బ్యాంకింగ్ సేవలు
- ఐదు రోజుల పనిదినాలను తక్షణమే అమలు చేయాలని యూనియన్ల డిమాండ్

**న్యూఢిల్లీ :** బ్యాంకింగ్ రంగం మరోసారి సమ్మెలోకి వెళ్లనుంది. ఈ వారంతం తర్వాత జరగనున్న మూడు రోజుల దేశవ్యాప్త బ్యాంకు సమ్మె కారణంగా, ఈనెల 26 నుండి 30 వరకు వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలు నిలిచిపోనున్నాయి. దాదాపు 90% బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడు యూనియన్లకు ఉమ్మడి ఐక్య వేదిక అయిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. 2024 వేతన ఒప్పందం నుండి పెండింగ్‌లో ఉన్న ఐదు రోజుల పనివారాన్ని తక్షణమే అమలు చేయాలని తరువాయి 8లో



### 58 పంచాయతీలకు

## రూ.33.62 కోట్ల నిధులు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

కోర్టు కేసులు,ఇతర అనివార్య కారణాలతో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగని 58 గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను విడుదల చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చొరవతో ఎన్నికలు జరగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధుల స్థానంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మొత్తం రూ.33,62, 9000 నిధులను సోమవారం విడుదల చేసింది.ఈ నిధులు ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. ఎన్నికలు జరగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు అందక పోయినప్పటికీ గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఈ నిధులను తరువాయి 8లో

## భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే రూ.813 కోట్లు చెల్లించాలి

- కలెక్టర్లు, అధికారులకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలి
- భూసేకరణ, పునరావాస చెల్లింపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్


ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల పట్ల అధికారులు న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, అధికారులకు సూచించారు. భూసేకరణ, పునరావాసం, పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను తక్షణమే భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. నిధులు విడుదలైన తర్వాత కూడా ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం, భూసేకరణ పూర్తికాక సాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం కావడం సహించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిండి, అచ్చంపేట సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర సమీక్షించారు. ప్రాజెక్టుల పనులు, భూసేకరణ, పునరావాస ప్రక్రియ, పెండింగ్ పనులు, క్షేత్రస్థాయి సమస్యల ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న అడ్డంకులు, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపై సైతం సమీక్షించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యేక ఆహ్వానితుడిగా ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ హాజరు కాగా, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఇ.శ్రీధర్, పునరావాసం, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు , జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఇంజినీర్‌ఇన్‌చీఫ్ రమేష్‌బాబు, సంబంధిత చీఫ్ ఇంజినీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం–పునర్వ్యవస్థీకరణ, పరిహారం తరువాయి 8లో

## మా డిమాండ్లపై స్పష్టతనివ్వండి

- ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి
- రెండవ దఫా చర్చలు నేటికి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాల రెండవ దఫా జరగాల్సిన చర్చలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఉద్యోగ సంఘాల డిమాండ్‌లలో కొన్ని అంశాలపైన ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉండగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అందుబాటులో లేకపోవడంతో ఈ చర్చలను మరుసటి రోజుకు వాయిదా పడినట్టు ఉద్యోగ సంఘాలు సోమవారం వెల్లడించాయి. తొలుత ఉద్యోగ సంఘాలతో హైదరాబాద్‌లోని డాక్టర్‌బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజుతో సోమవారం చర్చలు జరిగాయి. అయితే ఈ చర్చలలో ఉద్యోగ సంఘాలకు చెందిన ఆరోగ్య పథకం అమలుపైన చర్చించారు. అనంతరం ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్లపైన ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరింది. పిఆర్‌సిని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలను మంజూరు చేయాలని, సిపిఎస్‌ణు రద్దు చేయాలని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపుల నిమ్మితం సుమారు రూ 2వేల కోట్ల బకాయిలను నెలవారీగా చెల్లించాలని ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో వర్కింగ్ ఎంప్లాయిస్‌కు 50 శాతం, రిటైర్డ్ ఎంప్లాయిస్‌కు 50 శాతం చొ ప్పున చెల్లించే విధానంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ అంశాలపైన ముఖ్యమంత్రి, ఉపముఖ్యంత్రితో చర్చించిన అనంతరం మరోసారి సాయంత్రం 7:30గంటలకు సమావేశం కావాలని నిర్ణయించారు. కానీ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తిరుపతిలో ఉన్నందున ఈ చర్చలను మరుసటి రోజు మంగళవారం సాయంత్రానికి వాయిదా వేసినట్టు ఉద్యోగ సంఘాల తరువాయి 8లో



### సోనియా పౌరసత్వ వివాదంలో

## మెజిస్ట్రేట్ ఉత్తర్వును తోసిపుచ్చిన ఢిల్లీ కోర్టు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు సోనియాగాంధీ పౌరసత్వానికి సంబంధించి ఓటర్ల జాబితాలో ముందుగానే పేరు నమోదు చేశారన్న ఆరోపణలపై విచారణను తిరస్కరిస్తూ మెజిస్ట్రేట్ గత ఏడాది సెప్టెంబరు 11వ తేదీన ఇచ్చిన ఉత్తర్వును ఢిల్లీ కోర్టు తోసిపుచ్చింది. మెజిస్ట్రేట్ ఉత్తర్వులో లోపాలు ఉన్నాయని పేర్కొంటూ రివిజన్ పిటిషన్ విచారణకు అనుమతి ఇచ్చింది.అన్ని కోణాలలోనూ ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పౌరసత్వం అనే అంశంపై మాత్రమే దృష్టిసారించారని పేర్కొంటూ ఢిల్లీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే మెజిస్టీరియల్ కోర్టు ఉత్తర్వును పక్కకు నెట్టేసింది. సోనియాగాంధీ 1983లో భారత పౌరసత్వం తీసుకోవడాని మూడు సంవత్సరాలు ముందుగానే ఆమె పేరును ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రయత్నం తరువాయి 12లో



## బిఆర్‌ఎస్‌దే ఫామ్‌హౌస్ కల్చర్

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఎన్నికల అఫిడవిట్‌లో రూ.12 లక్షల ఆస్తులు
- కోట్ల రూపాయల విలువైన భూములు, ఫామ్‌హౌస్ ఎలా వచ్చాయి
- సమాధానం చెప్పాల్సిందేనని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు డిమాండ్
- రంగారెడ్డి జిల్లా మద్దూరులో కాంగ్రెస్ నేతల క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాపక్షం/రంగారెడ్డి

రాష్ట్రంలో ఫామ్‌హౌస్ సంస్కృతిని తీసుకొచ్చింది బిఆర్‌ఎస్ పార్టీయేనని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు విమర్శించారు. 2009 ఎన్నికల అఫిడవిట్‌లో రూ.12లక్షల ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్న మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నేత జి.జగదీశ్‌రెడ్డికి ప్రస్తుతం కోట్ల రూపాయల విలువైన భూములు, ఫామ్‌హౌస్ ఎలా సమకూరాయో ప్రజలకు సమాధానం చెప్పాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మద్దూరులోని జగదీశ్‌రెడ్డి భూములు, ఫామ్‌హౌస్‌పై భూ హక్కులు, రికార్డులు, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరు గ్రామంలోని సర్వే నంబర్లు 162, 223లో ఉన్నట్లు పేర్కొంటున్న సుమారు 50 ఎకరాల భూములు, ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్ ఎంపిలు, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలు, ప్రభుత్వ విప్‌లు, ఇతర ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంతో సంబంధం లేని శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇంత పెద్ద మొత్తంలో భూములు ఎలా సమకూరాయో జగదీశ్‌రెడ్డి వివరించాలని ప్రశ్నించారు. కెసిఆర్‌ను చూసి హరీశ్‌రావు, కెటిఆర్, వారిని చూసి జగదీశ్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి తదితరులు ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని తరువాయి 8లో

## పెరుగుతున్న భూ కమతాలు

### సంపన్నుల పరమవుతున్న సాగు భూమి.. వ్యాపార వస్తువుగా మారిన వైనం

ప్రజాపక్షం/ ఖమ్మం



ఒకప్పుడు పశువుల సంఖ్యను బట్టి సంపన్నులుగా లెక్కించే వారు. ఆ తర్వాత భూమి ఎంత ఎక్కువ ఉంటే అంత ధనవంతుడిగా చెప్పుకునే వారు. ఆ తర్వాత కాలంలో పంటలు సరిగ్గా పండక పోవడం, సాగు నష్టాల బాట పట్టడంతో పట్టణాలలో ఆస్తులు, భవనాలు ఉన్న వారిని సంపన్నులుగా గుర్తించే వారు. కానీ రెండు దశాబ్దాలుగా భూమి ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. ఎంత భూమి ఉంటే సంపన్నుడిగా అంత గుర్తింపు వస్తుందన్న భావనతో వ్యాపారులు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు సైతం భూమిపై కన్నెశారు. ఎంత దొరికితే అంత కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మిగిలిన రాష్ట్రాలకు భి న్నంగా పెద్ద పెద్ద భూ కమతాలు వెలిశాయి. వందల ఎకరాలు కొనుగోలు చేసి చుట్టు ఫెన్సింగ్‌లు వేస్తున్నారు. ఇది కేవలం హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు సమీపంలోనే కాదు ఎక్కడ భూమి దొరికితే అక్కడ కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు ఖమ్మం నగరానికి 100 నుంచి 150 కిలో మీటర్ల దూరంలోనూ భూములు కొనుగోలు చేస్తున్నారు. ఈ దశలో ఇప్పుడు రాజకీయ నాయకులు ముందు వరుసలో ఉండడంతో తెలంగాణలో భూ పంచాయతీ తరువాయి 8లో

## ‘సర్’ భారతీయుల ఓటు హక్కు హరించే పద్ధతి

### ఫ్రాంకెన్‌స్టీన్ రాక్షసుడిగా మారింది : ఖర్గే



**న్యూఢిల్లీ :** ఓటర్ల గణన పత్రాలలోని వివరాలలో తేడాలు ఉన్నాయన్న కారణంతో దేశ రాజధాని ఢిల్లీలో 33.13 లక్షల నోటీసులు జారీ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ భారతీయుల ఓటు హక్కును హరించే ఒక పద్ధతి అని, అది ఒక ఫ్రాంకెన్‌స్టీన్ రాక్షసుడిగా మారిందని కాంగ్రెస్ పేర్కొంది. 2002లో జరిగిన ఓటర్ల జాబితాల చివరి ప్రత్యేక విస్తృత సవరణ (సర్)లోని సమాచారంతో ఓటర్ల వివరాలు సరిపోలకపోవడం వల్లే చాలా నోటీసులు జారీ అయ్యాయి. సర్ లోపభూయిష్టమైనదని పేర్కొంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేయగా, పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ కూడా దీనిపై స్పందించారు. తేడాల కారణంగా నోటీసులు జారీ తరువాయి 8లో



## ఎసిబి వలలో మునిసిపల్ ఉద్యోగులు

- పెన్షన్ వివరాల నమోదుకు లంచం డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్

నిజామాబాద్‌లో ఇద్దరు ఉద్యోగులు ఎసిబి వలలో చిక్కారు.నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆఫీసులో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ (ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ ) పాల్దా అశోక్ , అవుట్ సోర్సింగ్ ఉద్యోగి (ఆడిట్ సెక్షన్) కలకుంట్ల కిరణ్ కుమార్‌లు ఒక వ్యక్తి తన తల్లి సర్వీస్ బుక్‌లో ఇంక్రిమెంట్, పెన్షన్‌కి సంబంధించిన వివరాలు నమోదు చేయడానికి రూ.15 వేలు లంచం అడిగారు. బాధితుడు ఎసిబికి ఫిర్యాదు చేసాడు. ఈ నేపథ్యంలో అతని వద్ద నుంచి సోమవారం ఉదయం అశోక్, కిరణ్ కుమార్ లంచం తీసుకుంటుండగా నిజామాబాద్‌లోని పద్మశాలి సంఘం, సీతారాంనగర్ తరువాయి 8లో



## ఏటుకూరికి అంతిమ వీడ్కోలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుడు ఏటుకూరి కృష్ణమూర్తి (104)కి పలువురు సిపిఐ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, బంధు మిత్రులు ఆయనకు కడసారి ఘనంగా నివాళులు అర్పించారు. ఏటుకూరి కృష్ణమూర్తి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆయన తన నిండు నూరేళ్ల జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన అమరజీవి అని పలువురు వారు కొనియాడారు.104 ఏళ్ల సుదీర్ఘ జీవితాన్ని ప్రజాసేవ, ఉద్యమాలు, హక్కుల కోసం పోరాటానికి అంకితం చేసిన ఆయన సేవలను నాయకులు స్మరించుకున్నారు. కృష్ణమూర్తి భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏటుకూరి కృష్ణమూర్తి భౌతికకాయాన్ని పార్టీ నాయకులు, ప్రజల సందర్శనా ర్థం సోమవారం ఉదయం 11 గంటల నుంచి మ ధ్యాహ్నం 1.30 గంటలవరకు మగ్దూంభవన్‌లో ఉంచారు. అక్కడ సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ తరువాయి 12లో

## డ్యూమా ఎన్నికల్లో ‘యునైటెడ్ రష్యా’కు మెజారిటీ



**మాస్కో:** రష్యా పార్లమెంటు డ్యూ మాకు తొమ్మిదోసారి జరిగిన ఎన్నికల్లో అధికార ‘యునైటెడ్ రష్యా’ పార్టీ ఆధిక్యంలో కొనసాగుతోంది. మెజార్టీ సీట్లను గెలుచుకుంది. దాని వెంటే మరో నాలుగు పార్టీలు కూడా విజయాలు సాధించాయి. మొత్తం 450 స్థానాలు ఉన్న రష్యా దిగువసభ డ్యూమాకు జరిగిన ఎన్నికల్లో 95 శాతం పోలింగ్ కేంద్రాల నుండి ఫలితాలు అధికార యునైటెడ్ రష్యాకు అనుకూలంగా వచ్చాయి. గతంలో ఉన్న ఐదు పార్టీలే ఈసారి కూడా డ్యూమాలో కొనసాగుతాయి. కొత్త గవర్నర్లను,ప్రాంతీయ చట్టసభ సభ్యులను కూడా ఈ ఎన్నికల్లో ప్రజలు ఎన్నుకున్నారు.యునైటెడ్ రష్యా పార్టీ తర్వాత రెండోస్థానంలో రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టుపార్టీ,మూడో స్థానంలో రష్యన్ ఫెడరేషన్ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ,నాలుగోస్థానంలో న్యూ పీపుల్, ఎ జస్ట్ రష్యా–ఫర్ ట్రూత్ పార్టీలు వరుస స్థానాల్లో నిలిచాయి.ఈనెల 18 నుండి 20వ తేదీ వరకూ జరిగిన ఎన్నికల్లో 56.66 శాతం పోలింగ్ జరిగింది. అదేవిధంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ వేదికపై పోలింగ్ 90 శాతం దాటింది.ఒకవైపు ఉక్రేన్ డ్రోన్ దాడులు,అమెరికా కొత్త ఆంక్షలు,ఇంధన సమస్యలు వంటి ఒత్తిడుల మధ్య ఈ డ్యూమా ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం విజయం సాధించిందని సివిల్ సొసైటీ డవలప్‌మెంట్ ఫౌండేషన్ అధిపతి కాన్‌స్టాంటిన్ కోస్టిన్ చెప్పారు.ఇదిలా ఉండగా ఈ ఎన్నికల్లో మొదటిసారి తరువాయి 12లో

## హెల్త్ ఇన్నోవేషన్స్‌కు కేంద్రంగా తెలంగాణ

‘హోమ సిఎంఇ 2026’ జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు 03

### మంత్రులుగా ఉన్న సమయంలో కెటిఆర్, హరీశ్‌రావు అడ్డగోలుగా దోచుకున్నారు

కోదండరెడ్డి

# 'సర్' సిత్రాలు చూడర నరుడో నరుడ!

ఓటర్ల జాబితాల 'శుద్ధి' పేరుతో భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నిర్వహిస్తున్న 'ప్రత్యేక ముమ్మర సవరణ' కేంద్రంలోని పాలకపార్టీపట్ల పక్షపాతంతో సాగుతోందన్న రాజకీయ ఆరోపణలతోపాటు, వివిధ పేర్లతో పెద్దసంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించటం, 'వ్యత్యాసాల' పేరుతో నోటీసులిస్తున్న ఓటర్లలో అత్యంత ప్రముఖులు ఎందరో ఉండటం ప్రహసనంగా తయారైంది. 2002 లో గత ప్రత్యేక సవరణ జరిగింది. అప్పటినుంచి ప్రతిఏటా 'సమ్మరీ రివిజన్' పేరుతో చేర్పులు – తొలగింపులు జరుగుతున్నాయి. అర్హులైన వయోజనులందర్నీ (18సంవత్సరాలు వయస్సు నిండినవారు) ఓటర్లుగా చేర్చుకోవటం ఇసిఐ విధి. అదే సమయంలో అర్హులైన ఓటరులెవ్వరూ తొలగించబడకుండా చూడటం కూడా దాని విధి. అయితే ఆచరణాత్మక దృష్టితో కాకుండా, యాంత్రికంగా ముమ్మర రివిజన్ నిర్వహిస్తున్న తీరుతో – ఓటర్లను తొలగించటం దీని ప్రయోజనంగా ఆరోపణలు ముసురుకున్నాయి. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ల నియామకం తీరు, ప్రధాన కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు పక్షపాతం ఆరోపణలకు హేతువైంది. ఓటర్ల జాబితాల ప్రక్షాళనను తీరుబడిగా ఎప్పుడైనా చేబట్టవచ్చు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందే ఉత్తర్వు చేయటం లోనే ఇసిఐ పక్షపాత దృష్టి ప్రశ్నార్థకమైంది. మహారాష్ట్ర, కర్నాటకల్లో కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల చేర్పులు – తొలగింపులు బిజెపికి అనుకూలంగా జరిగినట్లు ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధి ఆధారాలతో ఎండగట్టినా ఇసిఐ నుంచి సమర్థవంతమైన స్పందనలేదు. ఆ వ్యవహారం నడిపిన తీరును బయటకు తీసేందుకు దర్యాప్తు ఆదేశించలేదు. ఇక పశ్చిమ బెంగాల్, అసోంలలో ఓటరు జాబితాల సవరణ దానికదే పెద్ద ప్రహసనం. అక్రమ వలసదారులనే అనుమానంతో సరిహద్దు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనారిటీల ఓట్లు తొలగించటమే పనిగా రివిజన్ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీన్ని ఒక రకంగా పౌరసత్వం తనిఖీలాగా నిర్వహించారు. ముఖ్యంగా ప.బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ తీవ్రమైన న్యాయపోరాటం చేసినా ఫలితం లేకపోయింది– సుప్రీంకోర్టు ఆదేశించిన జ్యుడీషియల్ ట్రిబ్యునళ్ల ముందు దాఖలైన 38 లక్షలకుపైగా 'సర్' అప్పీళ్లలో ఒక లక్ష చిల్లర మాత్రమే ఇప్పటికి పరిష్కారమైనట్లు ఇసిఐ కొద్దిరోజుల క్రితం సుప్రీంకోర్టుకు చెప్పింది. ఇందులో మరో విచిత్రం వెలుగులోకి వచ్చింది. తమ ఓటు పునరుద్ధరించాలని అప్పీలు చేసుకున్నవారు 7లక్షలు మాత్రమే. మిగతా 31లక్షలు ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించాలని ఎన్నికల సంఘం, ఇతరులు దాఖలు చేసిన విజ్ఞప్తులు. తమ ప్రత్యర్థుల ఓట్లు తొలగించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా 'తొలగింపు ఫారాలు' గుండుగుత్తగా సమర్పించే కార్యక్రమం 'సర్' కొనసాగుతున్న రాష్ట్రాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న దాఖలాలున్నాయి. మరణాలు, శాశ్వతంగా నివాసం మార్పు వంటి కేటగిరీల కింద ఎన్నికల అధికారులు చేసే తొలగింపులు సరేసరి.

మొత్తం 16 రాష్ట్రాలు, 3కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేబట్టిన 'సర్'లో అంతకుముందు 29.93 కోట్ల ఓటర్లుండగా, 6.15 కోట్లు (17.04 శాతం) తొలగింపునకు గురైనారు. అత్యధిక తొలగింపుల్లో ఢిల్లీ టాప్‌లో ఉంది – 47.56 లక్షలమంది (32.78 శాతం) ఓటర్ల పేర్లు – ప్రతి ముగ్గురిలో ఒకరు – తొలగించబడినాయి. తర్వాత స్థానం మహారాష్ట్రది. ఓటర్ల సంఖ్య 9.78 కోట్ల నుంచి 7.71 కోట్లకు (21.1శాతం) తగ్గింది. కర్నాటకలో 1.07కోట్లు, తెలంగాణలో 73.40లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 44.89లక్షలు తొలగింపునకు గురైనారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో మ్యాపింగ్ కాని, 2002 జాబితాతో సరిచూసినపుడు స్వల్ప వ్యత్యాసాలున్న ఓటర్లకు నోటీసులిచ్చి ఆధారాలతో తమ నిజాయితీని నిరూపించుకోవాలని పరీక్ష పెట్టారు. ముసాయిదా జాబితాల ప్రకటన, అభ్యంతరాలు – ఫిర్యాదుల పరిశీలనకు గడువులు పెంచుకుంటూ పోతున్నారు. కోట్ల సంఖ్యలో ఉన్న తొలగింపుల పరిశీలనకు సంవత్సరాలు సరిపోవు. అందువల్ల కొత్త ఓటర్లుగా ఫారం – 6 దాఖలు చేసుకోండని అధికారులు సలహాయిస్తున్నారు.

ఆదివారం ప్రకటించిన ఢిల్లీ ఓటర్ల జాబితా ముసాయిదా ప్రకారం – పేర్లలో వ్యత్యాసాలు, వయోపరిమితుల వంటి కారణాలతో నోటీసులు జారీచేసే 33 లక్షల జాబితాలో విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్, ఆయన భార్య, బిజెపి వృద్ధనేత, మాజీ ఉప ప్రధాని ఎల్.కె.అద్వానీ, ఆయన కూతురు, కోడలు ఎన్నికల కమిషనర్ ఎస్.ఎస్.సంధు, 2024 నవంబర్‌లో మరణించిన ఆర్థిక వేత్త, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి మాజీ చైర్మన్ వివేక్ డెబ్రాయి, మాజీ ఉపరాష్ట్రపతి జగదీష్ ధంకర్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, సిబిఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ఆయన కుటుంబం, సుప్రీంకోర్టు మాజీ జడ్జి రంజన దేశాయ్, ఆమె కుటుంబ సభ్యులు, మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ తదితరులు ఎందరో ప్రముఖుల పేర్లు ఉన్నాయి. ఈ తరహా ప్రహసనం అన్ని రాష్ట్రాల్లో జరుగుతున్నది. ఇందుకు 2002 ఓటర్ల జాబితా ముద్రణలో తప్పులు, పాత నివాసాల్లో లేకపోవటం, అనేక నివాసాలకు ఎన్యూమరేటర్లు వెళ్లకపోవటం, సాఫ్ట్‌వేర్ లోపాలు వగైరా ఇలా ఏదో ఒకటి కారణం కావచ్చు.

ఒక ప్రశ్న : 'సర్' పేరుతో వివిధ కారణాలతో తొలగించబడుతున్న కోట్లమంది ఓటర్లలో మరణాలు, డూప్లికేట్ ఓట్లను మినహాయిస్తే మ్యాపింగ్ కాని, శాశ్వతంగా నివాసం మారినట్లు చెప్పబడుతున్న కోట్లాదిమంది మరోచోట, మరో రాష్ట్రంలో ఓటర్లుగా నమోదు కావాలి కదా? అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల తొలగింపులే భారీగా ఉండగా, వారేమైనట్లు? ఇసిఐ సమాధానం చెప్పాలి. ●



## అది కులతత్వవాదులకు అవకాశం ఇచ్చింది

**ఐఐటి బాంబే విద్యార్థి సాహిల్ వకోడే ఆత్మహత్యకు సంబంధించి ఐఐటి -బాంబే సెప్టెంబర్ 19న ఇచ్చిన ప్రకటనపై ఇవాళ అధికారికంగా క్షమాపణ చెప్పడం ఒక కీలకమైన అడుగు. పరీక్షలో మొబైల్ ఫోన్ల వినియోగం, ఇతర అంశాలపై ఆరోపణలకు సంబంధించి, ఆ సంస్థ జారీ చేసిన ప్రకటన తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ఆ ప్రకటన విషాదకరమైన సమయాల్లో కూడా దళితులను కించపరచడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే కులతత్వవాదులకు ఒక అవకాశాన్ని కల్పించింది. ఐఐటి బాంబే క్షమాపణ చెప్పడంతో, విచారణ పూర్తికాకముందే ఘటనకు సంబంధించిన వాస్తవాలను ఖచ్చితమైన నిర్ధారణతో చెప్పడం సరికాదని స్పష్టమైంది. ఇలాంటి సున్నితమైన సందర్భాల్లో సంస్థాగత బాధ్యత మరింత తీవ్రంగా ఉండాలి.**

– చంద్రశేఖర్ ఆజాద్,
ఆజాద్ సమాజ్ పార్టీ ఎంపి




## 'ఇన్షా అల్లా' అన్నందుకే బదిలీనా?

### ఐపిఎస్ బుష్రా బానో వీడియోపై వివాదం

ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఒక మహిళా ఐపిఎస్ అధికారి చేసిన మోటివేషనల్ వీడియో ఇప్పుడు మతపరమైన తటస్థత అనే ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా ప్రమాణాల పై కొత్త చర్చను తెరలేపింది. పశ్చిమ బెంగాల్‌లో ఖరగ్‌పూర్ అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న 2021 బ్యాచ్ ఐపిఎస్ అధికారి డాక్టర్ బుష్రా బానో యుపిఎస్‌సి అభ్యర్థులను ఉద్దేశించి విడుదల చేసిన వీడియోలో 'అస్సలాము అలైకుం', 'ఇన్షా అల్లా', 'జజాకల్లా' వంటి పదాలను ఉపయోగించడం వివాదానికి దారితీసింది. ఈ వివాదం నడుమ ఆమెను ఖరగ్‌పూర్ అదనపు ఎస్పీ బాధ్యతల నుంచి రాష్ట్ర సాయుధ పోలీసు దళంలోని నాలుగో బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్‌గా బదిలీ చేశారు. బదిలీకి ఈ వీడియోనే కారణమని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. యుపిఎస్‌సి అభ్యర్థులకు ప్రేరణ కల్పించే ఉద్దేశంతో సెప్టెంబర్ 13న బుష్రా బానో ఈ వీడియోను విడుదల చేశారు.

అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ తన సివిల్స్ ప్రయాణం లో అందించిన సహకారాన్ని ఆమె వీడియోలో వివరించారు. అక్కడ లభించిన పుస్తకాలు, గ్రంథాలయ సదుపాయాలు, మాక్ టెస్టులు, కోచింగ్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ యుపిఎస్‌సి అభ్యర్థులకు ఉపయోగకరమైన సూచనలు చేశారు. అయితే వీడియో ప్రారంభంలో 'అస్సలాము అలైకుం', మధ్యలో 'ఇన్షా అల్లా', చివరలో 'జజాకల్లా' వంటి ఇస్లామిక్ అభివాదాలు, పదాలను ఉపయోగించడంపై సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. 'హిందూ లీగల్ ఫండ్' అనే సంస్థ ఈ వీడియో పై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ పదవిలో ఉన్న అధికారి ప్రజలతో అధికారికంగా మాట్లాడేటప్పుడు మతపరంగా తటస్థంగా ఉండాలని, 'జైహింద్', 'వందేమాతరం' వంటి జాతీయ అభివ్యక్తులను ఉపయోగించాల్సిందిగా ఆ సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదే సమయంలో, ఒక అధికారి తన వ్యక్తిగత మతపరమైన అభివాద పదాలను ఉపయోగించడం ప్రభుత్వ ఉద్యోగిగా ఆమె తటస్థతకు భంగం కలిగించిందా? లేక అది సాధారణ సామాజిక, సాంస్కృతిక అభివ్యక్తంగానే చూడాలా? అనే ప్రశ్నలు చర్చకు వచ్చాయి. పోలీసు శాఖలో ఆయుధ పూజలు, మతపరమైన పండుగల సందర్భంగా అధికారులు పాల్గొనడం,కన్వర్ యాత్రలకు పోలీసుల సహకార ం, గణేశ్ ఉత్సవాల సందర్భంగా అధికారుల హాజరు వంటి ఉదాహరణలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో మతపరమైన వ్యక్తీకరణలకు ఒకే రకమైన ప్రమాణాలు ఉండాలా? అన్న అంశంపై చర్చ జరుగుతుంది. .


# జీవితాలను మెరుగుపరచని జిడిపి పెరిగితేనేం, తగ్గితేనేం!



ఎం.కోటేశ్వరరావు

ప్రధాని నరేంద్రమోదీకి 76 సంవత్సరాలు, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా పదవిలో పాతిక సంవత్సరాలు గడిపారు. పార్టీలో అడ్డుతొలిగించుకొనే ఇతర నేతలకు 75 సంవత్సరా లు నిండాయనే సాకుతో మార్గదర్శక్ మండల్ పేరుతో పాతసామాన్ల కొట్లో పడేసినట్లు చేశారు. తనకు మాత్రం అదేమీ వర్తించనట్లు ఉన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నెలరోజుల పాటు బిజెపి సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17వరకు సేవాసంకల్ప అభియాన్ పేరుతో అనేక కార్యక్రమాలు జరపాలని పిలుపునిచ్చింది. అది ఊహించిందే, కానీ మరొక ఉదంతం జరిగింది. నరేంద్రమోదీ ఢిల్లీలో ఉంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారణాసి వెళ్లి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక విమానంలో అంతదూరం వెళ్లారు, ఏదో ఒకటి చెప్పుకోవాలి గనుక పూజలు, ఇతర కార్యక్రమా లు పెట్టుకున్నారు. చిత్రం ఏమిటంటే అదే రాష్ట్రానికి చెందిన కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్‌కు తప్పదు, ఇతర ఏ బిజెపి ముఖ్యమంత్రి కూడా అటు ఢిల్లీ ఇటు వారణాసి వెళ్లలేదు, ఎవరికి వారు తమ రాష్ట్రాల్లో పాల్గొన్నారు. కానీ రాజును మించిన రాజభక్తుడిలా చంద్రబాబు మాత్రం వారణాసి వెళ్లారు. ఈ సందర్భంగా పాతికేండ్లు పదవిలో ఉండి మోదీ ఏమి సాధించారన్నది పెద్ద ప్రశ్న. తన స్వంత రాష్ట్రం గుజరాత్ రక్తహీనతకు ప్రస్తుతం రాజధానిగా ఉంది. మహిళలు, పిల్లల్లో ఆ సమస్య ఉంటే ఎంత నష్టమో తెలిసిందే, పౌష్టికాహారం అందించటం ద్వారా మాత్రమే రక్తహీనతను పొగొట్టవచ్చు. పాతికేండ్లలో మోదీ ఆ పని చేయలేకపోయారు. దేశాన్ని ఏమి ఉద్దరిస్తారు, ఇక తన ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని చూడండి అంటూ వర్తమాన సంవత్సర తొలి మూడు మాసాల జిడిపి అంకెల గురించి కొద్ది రోజుల క్రితం తన భుజాలను తానే చరుచుకున్నారు. జిడిపి గురించి గతంలో ఏ ప్రధానీ చేయనంత హడావుడి మోదీ చేశారు. తాను అధికారానికి వచ్చే నాటికి ప్రపంచంలో పదవ స్థానంలో(నామినల్) ఉన్న దానిని కష్టపడి ఐదవ స్థానానికి చేర్చానని చెప్పారు. పన్నెండు సంవత్సరాల తరువాత ఏ మూడో, నాలుగో స్థానానికో చేరాల్సింది కాస్తా 2026లో ఆరవ స్థానానికి ఎందుకు దిగజారిందో ఎప్పుడైనా చెప్పారా? నిజానికి జిడిపి పద్ధతిలో అప్పుడూ ఇప్పుడూ మూడవ స్థానంలో ఉంది. రూపాయి విలువ పతనం వంటి కారణాలతో మనం ఆరవ స్థానానికి పడిపోయాం. కానీ బిజెపి పెద్దలు మన రూపాయి విలువ పతనం కాలేదని పిట్టకతలు చెబుతూనే ఉంటారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏప్రిల్–జూన్ తొలి త్రైమాసిక జిడిపి వృద్ధి రేటు 7.8శాతం అంకెలు వివాదాస్పదమయ్యాయి. అది అంకెల గారడీ అంటూ చర్చ జరుగుతున్నది. ''వినాశకశక్తులు నాశనమయ్యాయి భారత్ వికసించింది'' ఇదీ మన ప్రధాని నరేంద్రమోదీ వృద్ధి రేటు గురించి ఎక్స్‌లో చేసిన వ్యాఖ్య. ప్రాసకోసం తప్ప ఏమైనా అర్ధం ఉందా? నాశనమైన ఆశక్తులేవో, దేశం ఎలా వికసించిందో చెప్పి ఉంటే ఆ మాటలకు విశ్వసనీయత ఉండేది. జెన్ జీ ఆందోళనతో దిమ్మదిరిగిన స్థితిలో ఈ అంకెలను చూపి జనం దృష్టిని మళ్లించాలని చూసినట్లు కొందరు చెప్పారు. దేశం వెలిగిపోతోంది అని చెప్పటం బిజెపి నేతలకు కొత్తేమీ కాదు, 2004 ఎన్నికల్లో వాజ్‌పేయి నాయకత్వంలో అలాంటి ప్రచారంతోనే జనాలను మభ్యపెట్టాలని చూసి బొక్కబోర్లా పడిన సంగతి తెలిసిందే. బిజెపిలో ఉన్నంతలో నిజాయితీ పరుడని పేరున్న వాజ్‌పేయి పరువు పోయింది. మోదీ ఏలుబడిలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసిన సుభాష్ చంద్ర గార్గ్ ప్రభుత్వం ప్రకటించిన వృద్ధి రేటు 7.8శాతం నిజం కాదని 2.6 శాతానికి మించి లేదని వ్యాఖ్యానించటంతో వివాదం చెలరేగింది. అమెరికా, చైనా, జపాన్ వంటి మనకంటే ముందున్న దేశాల మీదనే ప్రతికూల ప్రభావాలతో జిడిపి తగ్గినపుడు మనం ఎలా పెరిగామన్నది అనుమానం. ఇటీవలి వరకు 2011–12 సంవత్సరాన్ని ప్రాతిపదిక గా చేసుకొని గణాంకాలను తయారు చేస్తున్నారు. తాజాగా ప్రకటించిన జిడిపి అంకెలకు 2022–23 సంవత్సరం ప్రాతిపదికగా చెప్పారు. ఈ విధాన మార్పును గమనించకుండా పాతకొత్త అంకెలను యాపిల్ పండ్లతో బత్తాయిలను పోల్చినట్లుగా ఉందని ప్రభుత్వం తిప్పికొట్టింది. పోలికను పక్కన పెడితే కొత్త అంకెలు వాస్తవాన్ని ప్రతిబింబించటం లేదన్నదే సమస్య. అదే సమయం లో రద్దయిన విధానం అంకెలతో నూతన సమాచారాన్ని ప్రభుత్వ పెద్దలు, మోదీ ఎలా పోల్చారు? అయితే నూతన విధానం గురించి ఒక స్పష్టత వచ్చేంత వరకు రెండు పద్ధతుల ప్రాతిపదికన అంకెలను ప్రకటిస్తే జనాలకు స్పష్టత వస్తుందన్నది ఒక అభిప్రాయం. ప్రభుత్వం ఎంచుకున్న విధానం సరైనదే కావచ్చు గానీ గతంలో ప్రకటించిన ఆర్థిక సమాచారం సరైనదిగా రుజువు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని కొందరు చెబుతున్నారు. ప్రభుత్వం 2016–17లో పెద్ద నోట్ల రద్దుతో మార్కెట్ నుంచి 86 శాతం నగదు ఉపసంహరణ, తదితర ఇబ్బందులతో ఆర్థిక రంగం కుదేలైందని చెప్పినప్పటికీ ఆ ఏడాది జిడిపి వృద్ధి రేటు 8.2శాతం ఎలా సాధ్యమైందన్న ప్రశ్నకు జవాబు లేదు. ఆ ఏడాది జిడిపి అంకెలను ఆలస్యంగా ప్రకటించారు, 2017 సంవత్సర వినిమయ సర్వేను వెనక్కు తీసుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేసిన నోట్ల రద్దు చర్యతో ఎలాంటి ప్రతికూల ఫలితాలు రాలేదని జనాన్ని నమ్మించేందుకు ఇలా చేశారని విమర్శలు వచ్చాయి. గత సంవత్సర జిడిపిని తగ్గించి చూపి ఆ ప్రాతిపదికన ఈ ఏడాది తొలి మూడునెలల్లో ఎక్కువగా ఉందని గొప్పలు చెప్పుకున్నారన్నది ఒక అభిప్రాయం. గత సంవత్సరానికి కూడా నూతన పద్ధతిని అనుసరించి లెక్కించి దాని ప్రాతిపదికన 7.8 శాతం




వృద్ధి అంటే నమ్మవచ్చు. కానీ అలా చేయలేదే! గొర్రెల గోత్రాలు కాపరులకే తెలుసన్నట్లుగా ఆర్థికశాఖ కార్యదర్శిగా తాను ఉన్నపుడు జరిగిన అంకెల గారడీ తెలుసు గనుక సుభాష్ చంద్ర గార్గ్ చెప్పిన మాటలను అనేక మంది నమ్ముతున్నారు.

దేశ పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల ఐదేండ్ల కనిష్టానికి పడిపోయింది. ఆగస్టు నెలలో వరుసగా మూడవ నెలలో కూడా పతనమైంది. దేశ పారిశ్రామికోత్పత్తి పిఎంఐ దీర్ఘకాల సగటు 54.2 కాగా జులైలో 53.5 నుంచి ఆగస్టు లో 52.8కి పతనమైంది. కొనుగోలు గిరాకీ పడిపోయింది. ఉపాధి గడచిన రెండున్నర సంవత్సరాల్లో తొలిసారిగా తగ్గింది. ఏప్రిల్–జూన్ మూడు మాసా ల కరెంట్ ఖాతా లోటు 4.2 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో 3.4 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంది. అయినా జిడిపి వృద్ధి రేటు 7.8శాతమని కేంద్రం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న జిడిపి లెక్కలకు విశ్వసనీయత సమస్య ఉంది. సంఘటిత రంగంలో ఉన్న పరిశ్రమలు, ఇతర సంస్థలు ఇచ్చే సమాచారం ప్రాతిపదికన వాటిని రూపొందిస్తున్నారు. మన ఆర్థిక రంగంలో అసంఘటిత రంగ వాటా 45శాతం ఉందని ఉజ్జాయింపుగా వాటికి జోడిస్తున్నారు. నిర్దిష్ట సమాచారం లేదు. పీటర్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనమిక్స్(పిఐఐఇ) కోసం రూపొందించి న ఒక పత్రంలో గత దశాబ్దకాలంగా ఈ అంచనాలు వాస్తవం కాదని పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి మూడు మాసాల్లో ఇంధన షాక్ చిన్న సంస్థల మీద ఎక్కువగా ఉన్నందున జిడిపి లెక్కలను నమ్మటానికి వీల్లేదంటున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఇంధనానికి కొరత ఏర్పడటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఇంధన దిగుమతులపై ఆధారపడిన మనం మెరుగైన వృద్ధి సాధించటం ఎలా సాధ్యం అన్నది ప్రశ్న.

అంతేకాదు గత దశాబ్దకాలంలో ఇంధన ధరలు చాలా తక్కువగా ఉన్నపుడు దేశ ఆర్థిక వ్యవస్థకు విపరీతమైన లాభాలు వచ్చి ఉండాలి, కానీ లెక్కల్లో అదెక్కడా కనిపించలేదు. దిగుమతి ధరలు 32శాతం పెరిగాయని, తొలి మూడు మాసాల్లో ఆర్థికం మందగించిందని ఒకవైపు రిజర్వుబ్యాంకు చెప్పగా అంతా బాగుందని జిడిపి లెక్కలను ప్రభుత్వం ప్రకటించింది.

నిజంగా ఆల్ ఈజ్ వెల్ (అంతా సుభిక్షం) అనుకుంటే జిఎస్‌టి రాబడి కేవలం ఐదుశాతమే ఎందుకు పెరిగినట్లు? పోనీ జిఎస్‌టి రేట్లు తగ్గించినందువలన అని సరిపెట్టుకుంటే దిగుమతులు తగ్గాయి, పారిశ్రామిక ఉత్పాదకత ఎందుకు పడిపోయినట్లు? దేనికీ పొంతన కుదరటం లేదు. గతేడాది, 2025 ఏప్రిల్–జూన్ మాసాల్లో జిడిపిని 86లక్షల కోట్ల రూపాయలుగా పేర్కొన్నా రు. గుట్టుచప్పుడు కాకుండా దానిలో ఆరులక్షల కోట్లు తగ్గించారు. ఇప్పుడు ఏప్రిల్–జూన్‌లో 88.27లక్షల కోట్లుగా చూపి దానితో పోల్చి 7.8శాతం పెరిగిందంటున్నారు. ఇదెక్కడి లెక్క! ఇదేంటయ్యా అంటే విమర్శకులు తమకు అవసరమైన అంకెలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారని, తాము 2023 మార్చి మాసాన్ని ప్రాతిపదికగా తీసుకున్నామని మోదీ ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ సమర్ధించుకున్నారు. గతంలో జిడిపి మొత్తాన్ని సవరణలో ఎందుకు తగ్గించినట్లు అంటే తిరిగి లెక్కించినపుడు కొన్ని సార్లు పెరుగుతాయి, కొన్నిసార్లు తగ్గవచ్చు అన్నారు. గత నాలుగు సంవత్సరాల్లో జిడిపిలో తగ్గించిన మొత్తం 43లక్షల కోట్లని కాంగ్రెస్ విమర్శించింది.అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) మన ప్రభుత్వ ఆర్థిక గణాంకాల పట్ల ఆందోళన వెల్లడిస్తూ ఏబిసిడి గ్రేడ్లలో ''సి''లో మనలను ఉంచింది. అంటే నాసిరకం అని అర్థం.

ప్రపంచంలో ప్రతిదేశమూ తన ఆర్థికవృద్ధి, ధరలు, ఇతర సూచికలను నవీకరించుకునేందుకు ప్రాతిపదిక సంవత్సరాలను మార్చుతూ ఉంటుంది. ఆ ఏడాది అన్ని సూచికలనూ వంద అనుకుంటే తరువాత వచ్చే మార్పులు, ద్రవ్యోల్బణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని వాస్తవ పెరుగుదల, తగ్గుదలను ఖరారు చేస్తారు. అయితే ఎన్ని సంవత్సరాలకు ఒకసారి ప్రాతిపదిక ఏడాదిని మార్చాలన్నది సమస్య. దీనికి నిర్దిష్ట మార్గదర్శకాలేమీ లేవు. ఐరాస సూచించినదాని ప్రకారం ప్రతి మూడు లేదా అయిదు సంవత్సరాల కు ఒకసారి మార్చాలి. చైనాలో విధిగా ప్రతి ఐదు సంవత్సరాలకు మారుస్తున్నారు. అమెరికాలో ఒక్కో అంశానికి ఒకో సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. జిడిపికి 2017, ధరలకు 1982–84ను, ఉత్పత్తి ధరలకు 1982ను తీసుకుంటున్నారు. జిడిపి అంకెల గారడీ ఎలా ఉంటుందో ఒక ఉదాహరణ చూద్దాం. ఒక ఏడాదిలో ఒక దేశం పది మిలియన్ పీపాల చమురు ఉత్పత్తి చేసిందనుకుందాం. ఒక్కో పీపాను పది డాలర్లకు అమ్మితే జిడిపి విలువ 100 మిలియన్ డాలర్లు. అదే మరోఏడాది కేవలం ఐదు మిలియన్ల పీపాలు మాత్రమే ఉత్పత్తి చేసింది, ధర మాత్రం 30 డాలర్లు ఉంటే జిడిపి 150 మిలియన్ డాలర్లకు పెరిగింది. ఉత్పత్తి తగ్గినా జిడిపి పెరిగింది. నిజంగా జిడిపి పెరిగినట్లా తరిగినట్లా? అందువలన ధరల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే అసలు పెరుగుదల తెలుస్తుంది. దాన్ని లెక్కించటం ఎలా? ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొన్నపుడు ఆ ఏడాది ఉన్న ధరలను బట్టి తరువాత సంవత్సరాల్లో పెరిగిన వాటిని ఆ ధరలకు అనుగుణంగా సరి చేస్తారు. పైన చెప్పుకున్న తొలి ఏడాదిని ప్రాదిపదికగా తీసుకుంటే రెండో ఏడాది ఉత్పత్తి జరిగింది ఐదు మిలియన్లే గనుక స్థిర ధరల్లో జిడిపి వందమిలియన్ల నుంచి 50కి తగ్గింది. మన ప్రభుత్వం గతేడాది వరకు 2011–12 సంవత్సరాల ధరలను ప్రాతిపదికగా తీసుకొని జిడిపిని లెక్కించింది. తాజా లెక్కలు 2022–23నాటి ధరల ప్రాతిపదికన చెప్పినవి. పదకొండు సంవత్సరాల కాలంలో ధరలు ఎంతగానో పెరిగాయి గనుక పాతవాటిని తీసుకుంటే వాస్తవ పరిస్థితి తెలియదు గనుక కొత్త సంవత్సరాన్ని తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే ఇంత దీర్ఘకాలం పాటు ప్రాతిపదిక సంవత్సరాన్ని ఎందుకు కొనసాగించినట్లు? కొత్త పద్ధతిలో జిడిపిని తొలిసారిగా ప్రకటించారు, తదుపరి నెలల్లో వాస్తవ వృద్ధి రేటు తెలుస్తుంది, అప్పటి వరకు మనల్ని అంకెలతో ఆడుకుంటూనే ఉంటారు, గణాంకాలు కడుపు నింపవని వేరే చెప్పనవసరం లేదు!

# ఆధిపత్య ఆరాటంతో ఆందోళనలు... పక్కదారి పడుతున్న ప్రజాసమస్యలు

రాష్ట్రం గడిచిన కొన్ని రోజులుగా రాజకీయ పక్షాల మధ్య ఆరోపణలు, దూషణలు, ప్రత్యారోపణలు, పరుష పదజాలంతో అట్టుడుకుతుంది. రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న రభసతో ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయి. వామపక్షాలు మినహాయిస్తే రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు అధికారంపై యావ తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ మధ్య ముప్పిరి ఆందోళనలతో రాష్ట్రంలో ఇబ్బందికర వాతావరణం ఏర్పడింది. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై వారం రోజుల పాటు ఆందోళనకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ పిలుపునిచ్చింది. పిలుపు సరైనదే ఆందోళనలు వాంఛితమే అయినా బిఆర్ఎస్ లక్ష్యం ప్రజా సమస్యల పరిష్కారం కంటే కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో అభాసుపాలు చేయడం ద్వారా తమకు అధికారం అన్న లక్ష్యాన్ని నెరవేర్చుకునే దిశగా సాగుతుంది. ఈ క్రమంలోనే ఇటీవలి ఆందోళనలు తమ రూపాన్ని మార్చుకున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమం, అభివృద్ధి పేరుతో ప్రజల్లోకి వెళ్లాలి. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాలి. ఆర్థిక సంక్షోభం రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమయంలోనూ అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమం గురించి వివరించాలి. అంతే కానీ ఓ ప్రతిపక్ష నేత శాసనసభకు రావడం లేదు కాబట్టి ఆయన రాజీనామా కోసం ఆందోళనకు పిలుపునివ్వడం ఏవిధంగా చూసినా సహేతుకమైంది కాదు. ప్రజాధనం వృధా అవుతుంది అన్న మాట వాస్తవమే కానీ ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పక్షాల ద్వారా అధికారంలోకి రావడం తప్ప మరో మార్గంలేని అనివార్యమైన పరిస్థితుల్లో శాసనసభకు రాని విపక్షనేతను చూపి ఆ పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేయాలి తప్ప ఆందోళనకు పిలుపునివ్వడం అన్నది అధికార పార్టీ చేయాల్సిన పని కాదు. వారు ఏదో చేస్తున్నారు కాబట్టి మనం కూడా ఏదో ఒకటి చేయాలనే ఆలోచన ఒక్కోసారి రాజకీయ తప్పిదాలకు దారితీస్తుంది.

బిఆర్ఎస్ ఆందోళనకు సంబంధించి కొన్ని అంశాలను పరిశీలిస్తే సహేతుకమైనటువంటి ఆందోళనగా భావించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చింది. ఏ పార్టీ అయినా ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను సంపూర్ణంగా అమలు చేయలేదు. విడతల వారీగా ఆయా ప్రాధాన్యత క్రమాలను బట్టి అమలుచేసే అవకాశం ఉంటుంది. అంతే కాదు ఆర్థిక పరమైన విషయాలు కూడా అమలులో ఇమిడి ఉంటాయి. కానీ ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయాన్ని తీసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఈ విషయంలో ప్రభుత్వ జాప్యం పట్ల అధికార పార్టీలోనే కొందరు పెదవి విరుస్తున్నారు అన్నది వాస్తవం. బిఆర్ఎస్, బిజెపి లేదా వామపక్షాలను విమర్శించే కాంగ్రెస్ అభిమానులు సైతం ఫీజు రీయంబర్స్‌మెంట్ పట్ల ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతుండటం గమనార్హం. అనేక వాగ్దానాలు నెరవేర్చడంలో వైఫల్యాన్ని బిఆర్ఎస్ ఎత్తిచూపుతున్నప్పుడు అమలు చేసిన కార్యక్రమాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గతంలో బిఆర్ఎస్ చేసిన తప్పిదా లు, కాంగ్రెస్ ప్రభుత్వ వ్యూహం, ప్రజల అవసరాలు నెరవేర్చే క్రమం వీటిని విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. అలా కాకుండా బిఆర్ఎస్‌ను అడ్డుకోవడమే తమ లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుంది. ఇక బిజెపి ఫీజు రీయంబర్స్‌మెంట్ పై ఆందోళన చేస్తుంది. ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది. కానీ బిజెపి ఇచ్చిన యేటా రెండు కోట్ల ఉద్యోగాలు, ఖాతాల్లో రూ.15వేలు జమ, విదేశాల నుంచి నల్లధనం తీసుకు రావడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ఇటువంటి హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చ లేదు. ఒకరిని ప్రశ్నించే ముందు మనం ఇచ్చిన హామీ సంగతి ఏమిటన్న కనీస ఆలోచన బిజెపి చేయడం లేదు. దేశవ్యాప్తంగా యువత లో బిజెపి పట్ల వ్యతిరేకత పెరుగుతుందని ముఖ్యంగా జన్‌జీ పిలుపులకు విశేషమైన స్పందన లభిస్తుందని భావించిన బిజెపి విద్యార్థుల పక్షాన తెలంగాణలో ఏదో చేయాలని జన్‌జీ ని ఆకట్టుకోవాలని చేసే ప్రయత్నం తప్ప బిజెపి వ్యూహం మరొకటి కాదు. ఒక వేలు కాంగ్రెస్ వైపు చూపితే బిజెపి వైపు మిగిలిన నాలుగు వేళ్లు చూపుతున్నాయన్న వాస్తవాన్ని బిజెపి గుర్తెరిగితే మంచిది.

బిఆర్ఎస్ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై ప్రజల్లోకి వెళ్లడం ద్వారా తిరిగి బలపడే అవకాశం ఉంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవచ్చు. ఆందోళనలను ఉధృతం చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగించడం తప్ప మరో ఉపయోగం ఉండక పోవచ్చు. శాసనసభలో సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు వ్యక్తం చేసిన ఆవేదన అందరిని ఆలోచింపజేస్తుంది. ఆయన మీడియాను , రాజకీయ నాయకులను ప్రత్యక్షంగానే తప్పుబట్టారు. ఎవరైతే బూతులు మాట్లాడుతున్నారో ఎవరైతే దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారో వారికి మాత్రమే మీడియా ప్రాధాన్యతనిచ్చి విస్తృత ప్రచారం కల్పిస్తుందని ఆయన శాసనసభ సాక్షిగా తెలిపారు. ఈ విస్తృత ప్రచారం నేపథ్యంలో తాము కూడా విస్తృత ప్రచారం పొందాలంటే అలా బూతులు మాట్లాడాలేమోనన్న భావన కలిగేందుకు పరోక్షంగా మీడియా దోహదపడుతుందన్న ఆయన మాటలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

తెలంగాణకు ఒక ప్రత్యేక సంస్కృతి ఉంది. ఆ సంస్కృతిలో మాటలు మొరటు కావచ్చునేమో కానీ గౌరవించడంలో తెలంగాణ యాస మరి ఏ భాషకు ఏ యాస కు తీసిపోదు. పరస్పర విమర్శల నేపథ్యంలో వ్యక్తిగత విమర్శల నుంచి బూతు పర్వం ప్రారంభమైంది. ఇప్పుడు అది రాజకీయ చర్చనీయాంశంగా మారింది. ఇంత దూరం ఈ బూతు పురాణాన్ని తీసుకు వచ్చిన తర్వాత మళ్లీ వెనక్కి తీసుకుపోవాల్సిన బాధ్యత తెలంగాణ రాజకీయ నాయకుల మీద ముఖ్యం గా తరచూ ఈ పదజాలాన్ని ప్రయోగిస్తున్న వారిపైన ఉన్నది.

మొత్తంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలు ప్రజల పక్షాన కాకుండా ఆధిపత్యం కోసం జరుగుతున్నాయి. అందుకే ఇవి పక్కదారి పడుతున్నాయి. ఒక పక్క ఎల్‌నినో ప్రభావం మరో పక్క పెరిగిన ధరలు, విద్యార్థులకు చేరువ కానీ ఫీజు రీయంబర్స్‌మెంట్, పెరుగుతున్న నిరుద్యోగం, హామీల అమలు, వ్యవసాయరంగ పరిరక్షణ వీటికోసం ఆందోళనలు జరిగితే స్వాగతించాల్సిందే. ఇప్పుడు ఎల్‌నినో రాష్ట్రాన్ని వణికిస్తుంది. దీని ప్రభావం అన్ని వర్గాల ప్రజల మీద రాష్ట్ర భవితవ్యం మీద కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఎల్‌నినో ద్వారా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు ఇతరత్రా అంశాలపైన ప్రధానంగా చర్చ జరగాల్సి ఉంది. అటువంటి ఆందోళనలకు ప్రజలు మద్దతుగా నిలవాల్సిందే. కానీ రాజకీయ ఆధిపత్యం కోసం ఆందోళనలు చేపడితే ప్రజా సమస్యల పరిష్కారం పక్కదారి పడుతుంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విపక్షం, అధికారపక్షం పనిచేస్తే రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుంది.

ఏనుగు వెంకటేశ్వరరావు,
ఖమ్మం

# హెల్త్ ఇన్నోవేషన్స్‌కు కేంద్రంగా తెలంగాణ

'హోమా సిఎంఇ 2026'
జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వైద్యం సాంకేతికతను అనుసంధానిస్తూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటి, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్టార్టప్ రంగాల సామర్థ్యాలను హెల్త్‌కేర్‌తో అనుసంధానం చేస్తూ సమగ్ర ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని టిహబ్‌లో 'బియాండ్ నంబర్స్‌ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర్' అంశంపై నిర్వహిస్తున్న 'హోమా సిఎంఇ 2026' జాతీయ సదస్సును మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా మధుమేహం, ఇతర మెటబాలిక్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి దీర్ఘకాలిక వ్యాధులను కేవలం సంప్రదాయ వైద్య విధానాలతోనే కాకుండా, వ్యక్తుల జీవనశైలి, ఆరోగ్యానికి సంబంధించిన డేటాను విశ్లేషించడం ద్వారా ముందుగానే గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, తగిన చికిత్స అందించేందుకు మరిన్ని సాంకేతిక ఆవిష్కరణలు అవసరమని శ్రీధర్‌బాబు అన్నారు. రాబోయే రోజుల్లో హెల్త్‌కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారాలు చూపే కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అలాగే ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్‌గా పేర్కొన్న 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్'ను ప్రారంభించారు. అదే విధంగా 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ (పిఒసి)' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మెటబాలిక్ వ్యాధుల నియంత్రణ, ముందస్తు గుర్తింపు, ఆధునిక వైద్య సాంకేతికత వినియోగంపై సదస్సులో నిపుణులు చర్చలు నిర్వహించారు.

## తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీచేసిన..

# త్యాగాలు, పోరాటాలు సదా స్మరణీయం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం నిరంతరం శ్రమించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ మంత్రి ఘన నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీ.. స్వాతంత్ర్యానంతరం కూడా ప్రజా సమస్యల పరిష్కారం, తెలంగాణ ప్రాంత ప్రయోజనాల సాధన కోసం తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను తన రాజకీయ ప్రస్థానానికి కేంద్రబిందువుగా చేసుకుని, ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తన సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగారని తెలిపారు. తెలంగాణ సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో బాపూజీ చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తించదగినదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి, వారి హక్కుల కోసం వివిధ సందర్భాల్లో బలమైన స్వరం వినిపించారని పేర్కొన్నారు.

**కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు**

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, బిసి హక్కుల కోసం కృషి చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బిసి కమిషన్ కార్యాలయంలో సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారని, స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రంథాలయాల స్థాపనకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవికి తొలిసారిగా రాజీనామా చేసిన గొప్ప వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.సునీత, సెక్షన్ ఆఫీసర్ సతీష్‌కుమార్, ఇర్ఫాన్ బిన్ ఖలీద్, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీ నారాయణతో పాటు కమిషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రులుగా ఉన్న సమయంలో కెటిఆర్, హరీశ్‌రావు

# అడ్డగోలుగా దోచుకున్నారు : కోదండరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్‌రావులు మంత్రులుగా ఉన్న సమయంలో చట్టాలను అతిక్రమించి అడ్డగోలుగా దోచుకున్నారని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి విమర్శించారు. వారు అధికార దుర్వినియోగానికి పాల్పడి భూ నిబంధనలను ఉల్లంఘిస్తూ హిమాయత్ సాగర్ బఫర్‌జోన్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌస్, కెటిఆర్ మంత్రిగా ఉన్న సమయంలో పుల్కాపూర్ నాల నుంచి గండిపేటకు వెళ్లే వర్షపు నీటి నాలను కుదించి ఫామ్‌హౌస్ నిర్మించారని ఆయన ఆరోపించారు. సోమవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతు వ్యవసాయ కమిషన్ సభ్యులు భవాని రెడ్డి, అధికార ప్రతినిధి రవళి రెడ్డి, కోట్ల శ్రీనివాస్, భాస్కర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ జన్వాడ ఫామ్‌హౌస్ విషయంలోనూ పలు అనుమానాలు ఉన్నాయని, ప్రదీప్‌రెడ్డి అనే వ్యక్తి కెటిఆర్ మిత్రుడని చెబుతూ ఫామ్‌హౌస్‌ను తనకు ఇచ్చినట్లు పేర్కొంటున్నారని అన్నారు. పేదలకు ఒక రకమైన చట్టాలు, కెటిఆర్, హరీశ్‌రావులకు మరో రకమైన చట్టాలు ఉంటాయా? అని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని గతంలో భారీగా దోపిడీ జరిగిందని ఆరోపించారు. అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ భూములతో పాటు ధరణి వ్యవస్థను ఉపయోగించుకుని అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. ధరణి దోపిడీని అడ్డుకుంటామని అప్పట్లో పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ఇప్పుడు భూ భారతి ద్వారా పేదలకు న్యాయం చేస్తూ అక్రమాలను అడ్డుకుంటున్నామని తెలిపారు. భూ భారతి చట్టాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు కెటిఆర్, హరీశ్‌రావులు ప్రయత్నిస్తున్నారన్నారు. భూ సమస్యలపై అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ విషయంలో గతంలో రేవంత్‌రెడ్డి పరిశీలనకు వెళ్తే కేసు పెట్టి జైలుకు పంపారని, ఇప్పుడు అదే ఫామ్‌హౌస్ యాజమాన్యంపై వస్తున్న వివరాలపై కెటిఆర్‌ఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# డిజిటల్ చెల్లింపులపై రుసుముల భారం మోపొద్దు

యుపిఐపై కొత్త వ్యాపారి రుసుము విధానాన్ని వెనక్కి తీసుకోవాలి: ఇ.టి.నర్సింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిజిటల్ ఇండియా పేరుతో సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు, యువతపై డిజిటల్ చెల్లింపుల రుసుముల భారాన్ని మోపడం సరికాదని, యుపిఐపై కొత్త వ్యాపారి రుసుము విధానాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నర్సింహ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుపిఐ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇటి.నర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.2వేలకు మించి వ్యక్తి – వ్యాపారి యుపిఐ లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, రూ.75వేలకు పైగా లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.300 వరకు రుసుము విధించే విధానాన్ని ప్రజా ప్రయోజనాల కోణంలో సమీక్షించాలని కోరారు. ఈ రుసుముల ప్రభావం చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై పడకుండా ప్రభుత్వం స్పష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. యుపిఐ ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటైన డిజిటల్ ప్రజా మౌలిక వసతిగా ఉండాలి తప్ప రుసుముల విస్తరణకు మార్గంగా మారకూడదని నర్సింహ అన్నారు. వ్యాపారులపై పడే రుసుమును వినియోగదారులపై అదనపు భారంగా బదిలీ చేయకుండా పటిష్ఠమైన పర్యవేక్షణ ఉండాలని డిమాండ్ చేశారు. యుపిఐ రుసుముల విధానం, వాటి పంపిణీ, భవిష్యత్ మార్పులపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. రుసుముల భారానికి కాదు అనే నినాదంతో పారదర్శకమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపు వ్యవస్థ కోసం ప్రజా చర్చను ముందుకు తీసుకెళ్లాలని సిపిఐ పిలుపునిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి షేక్ మహమూద్, రాష్ట్ర సమితి సభ్యులు కాంపల్లి కళ్యాణ్, రాజ్ కుమార్, మాజీద్ అలీ ఖాన్,నాగరాజు, రాజు, ఆంజనేయులు, నాయకులు అనీల్ కుమార్, రవళి, కిరణ్మయి, ప్రణవి, ఫాతిమా, రంజిత్, ప్రభాస్‌లతో పాటు 50మంది పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం ఓటర్ల హక్కులను కాపాడాలి.. అవమానించొద్దు

సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న చర్యలు ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నాయని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. సాంకేతిక తప్పులు ఉంటే వాటిని సరిచేయాల్సింది పోయి, సహజమైన మార్పులను కూడా అనుమానాస్పదంగా చూపడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం వ్యవహార శైలి ఎద్దు ఈనిందంటే మన ఘాట్‌లో కట్టేయండి అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో స్పెల్లింగ్ తేడాలు, వివాహం అనంతరం మహిళల ఇంటిపేరు మారడం వంటి సహజమైన మార్పులను కూడా సమస్యలుగా చూపడం సరికాదన్నారు. మాజీ ఉపప్రధాని ఎల్.కె.అద్వానీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వంటి ప్రముఖులకు సైతం నోటీసులు ఇవ్వడం ఎలాంటి ఓటర్ల జాబితా ప్రక్షాళనకు నిదర్శనమని ఆయన ప్రశ్నించారు. తాతముత్తాతల పుట్టిన తేదీల వంటి వివరాలను వెతకడం మరింత విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఓటర్ల హక్కులను పరిరక్షించే విధంగా ఉండాలే తప్ప, వారి ఓటు హక్కును అవమానించే విధంగా ఉండకూడదని నారాయణ స్పష్టం చేశారు. కోట్లాది ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సంఘం ప్రధానమంత్రి కార్యాలయం ప్రభావానికి లోనై రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడే సంస్థగా కాకుండ స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.




## ఈనెల 28,30 మధ్య హన్మకొండలో

# ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) 90వ వార్షికోత్సవాలను ఈనెల 28,29,30 తేదీల్లో హన్మకొండలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన వార్షికోత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ 'చదువు–పోరాటం, చదువు! పోరాడు!!' అనే నినాదంతో విద్యార్థుల సమస్యలపై ఎఐఎస్‌ఎఫ్ 90 ఏళ్లుగా పోరాడుతోందన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో ఎఐఎస్‌ఎఫ్ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. వార్షికోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, మేధావులు, మాజీ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రభుత్వ విద్యారంగం బలహీనపడుతోందని లక్ష్మణ్ విమర్శించారు. విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం, మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి చైతన్యయాదవ్, జిల్లా ఆఫీస్ బేరర్లు జోసెఫ్ భాను, అరుణ్‌కుమార్, సిద్ధార్థ్, నాయకులు రామ్‌చరణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఐ టెక్నాలజీని జర్నలిస్టులు అందిపుచ్చుకోవాలి

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు కృత్రిమ మేధ (ఎఐ) సహా ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎఐ పరిజ్ఞానాన్ని వృత్తిలో భాగంగా వినియోగించుకోవడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని పాఠకులు, వీక్షకులకు అందించవచ్చని తెలిపారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీలో మీడియా అకాడమీ, డాటా లీడ్స్, గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'కృత్రిమ మేధ (ఎఐ) – టూల్స్ అండ్ టెక్నిక్స్' వర్క్‌షాప్ నిర్వహించారు.
ఈవర్క్‌షాప్‌లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు చెందిన వివిధ దినపత్రికలు, టీవీ ఛానళ్ల జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డిజిటల్, సోషల్ మీడియా జర్నలిజంలో ఎఐ వినియోగం ద్వారా రిపోర్టింగ్‌ను మరింత సులభతరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదే సమయంలో ఎఐ ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున జర్నలిస్టులు బాధ్యతాయుతంగా సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు.
రిసోర్స్ పర్సన్ ఉడుముల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు నిత్య విద్యార్థిలా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని అన్నారు. ఎఐ టూల్స్ ఉపయోగాలు, పరిమితులు, ప్రమాదాలు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాలను వివరించారు. చాట్ జిపిటి, పెర్ప్లెక్సిటీ, నోట్ బుక్ ఎల్‌ఎం, గూగుల్, జమినై, మిడ్‌జర్నీ, సోరా, విఇఒ3, తదితర టూల్స్‌ని పరిచయం చేసి జర్నలిస్టులకు వాటి వినియోగంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణలతో అవగాహన కల్పించారు.
ఎఐ డేటా శిక్షణలో లోపాలు, సరైన ప్రాంప్టింగ్ లేకపోవడం వల్ల తప్పుడు సమాచారం, వివక్ష వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఎఐ నైతిక ప్రమాణాలకు లోబడి జర్నలిస్టులు కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో యాక్షన్ ప్లాన్'పై గ్రామ స్థాయిలో తీర్మానాలు

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో నేపథ్యంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామ సభల్లో 'ఎల్‌నినో యాక్షన్ ప్లాన్'పై చర్చించి, గ్రామ స్థాయిలో అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సీతక్క సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రత్యేక ప్రధానకార్యదర్శి దానకిషోర్, అదనపు కమిషనర్ పి.రవీందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామానికి అవసరమైన పనులు, అందుబాటులో ఉన్న నిధులు, వచ్చే ఏడాది కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామపంచాయతీలకు అందే నిధులు తదితర అంశాలపైన గ్రామసభల్లో సమగ్రంగా చర్చించి, గ్రామ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను ఆమోదించాలని సూచించారు.ఆయా గ్రామాల అవసరాలు, అందుబాటులో ఉన్న నిధుల ఆధారంగా పనులను ఎంపిక చేయాలన్నారు. ప్రజలకు అత్యవసరమైన పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తర్వాత ఇతర అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత సామాజిక ఆస్తులు సృష్టించే విధంగా ఆలోచించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది రాష్ట్రంలో సుమారు రూ.6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని మంత్రి సీతక్క వివరించారు. ఉపాధి హామీ పనులు కోరిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**'జలసిరి'ని వేగవంతం చేయండి...**

గ్రామీణ ప్రాంతాల్లో నీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సీతక్క తెలిపారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, గ్రామాల్లో నీటి సంరక్షణ, నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులను ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారులుగా నియమించామని, వచ్చే రెండు రోజులపాటు ఈ అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించాలని, కింది స్థాయి సిబ్బందికి గ్రామ సభలు, ఎల్‌నినో యాక్షన్ ప్లాన్, ఉపాధి హామీ పనులు, జలసిరి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.




# ప్రజాస్వామ్యం నిర్వీర్యంతో ప్రజలకు హాని

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ అధ్యక్షుడు ఆర్.ఎస్.చీమా

**కోయంబత్తూరు :** రాజ్యాంగబద్ధ వ్యవస్థలను తమ ఆధీనంలో ఉంచుకొని ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే ఎలాంటి చర్య అయినా ప్రజలకు హాని కలగజేస్తోందని, తద్వారా ప్రజాస్వామ్యం మనుగడ కోల్పోతుందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) అధ్యక్షుడు ఆర్.ఎస్.చీమా అన్నారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఆదివారం ఐఎఎల్ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చీమా అధ్యక్షోపన్యాసం చేస్తూ దేశంలో న్యాయవాదుల చైతన్యం పెరిగేందుకు ఐఎఎల్ తమ వంతు కృషి చేస్తుందని, అందుకు న్యాయవాదులు సహకరించాలని పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులు వృత్తి సంబంధిత, వారి జీవన భద్రతకు కావాల్సిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చాలని, పటిష్టవంతమైన న్యాయవ్యవస్థ ఉంటేనే దేశానికి రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మరో జాతీయ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మురదలీధర ఐఎఎల్ కార్యకలాపాలపై సమీక్ష నివేదికను ప్రవేశపెట్టారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సీనియర్ న్యాయవాది లోహిత్, ఛండీగఢ్ నుంచి అశ్వని భక్ష్, కేరళ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ జయచంద్రన్, పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్‌వీర్, రాజస్థాన్ నుంచి ద్వారకేశ్ యాదవ్, ఒడిషాకు చెందిన సాహూ, మహారాష్ట్ర కు చెందిన అభయ్ తక్సాల్, తెలంగాణ నుంచి కె.రామ్మూర్తి, తమిళనాడుకు చెందిన అరుణాచలం, భారతి తదితరులు నివేదికపై మాటాడుతూ, తమ తమ రాష్ట్రాలలో కార్యకలాపాలను వివరించారు.

## సిఎం సిరిసిల్ల సభ ప్రకటించగానే...

# కెటిఆర్‌లో మొదలైన భయం : ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభ ప్రకటించగానే కెటిఆర్‌లో భయం మొదలైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ సోమవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ 30వ తేదీన సిరిసిల్లలో రేవంత్‌రెడ్డి సభ ప్రభంజనం సృష్టించబోతోందన్నారు. ఈ సభతో సిరిసిల్లలో కెటిఆర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని, కల్వకుంట్ల కుటుంబానికి ఓటమి రుచి చూపించబోతున్నామన్నారు. సిరిసిల్ల ప్రజలు కెటిఆర్‌ను తిరస్కరించబోతున్నారనే భయం ఆయనలో మొదలైందని, అందుకే రేవంత్‌రెడ్డి సభపై కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. ఈ నెల 30న సిరిసిల్లలో ఏం జరుగుతుందో వేచి చూడాలని ఆయన కెటిఆర్‌కు సూచించారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

NIT No. 10/CTO/MKJ ZONE/MMC/2026-27, పని పేరు: నిర్వహణ పనులు, ఇతరాలు-1, అంచనా విలువ: రూ.13.10లక్షలు, బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం: 21.09.2026 ఉ.11:30గం.ల నుండి 22.09.2026 ఉ.11:30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి - సెల్ నెం. 9154796465, ఎఇ (ట్రాన్స్‌పోర్ట్) - సెల్ నెం. 8106977609. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 10344-PP/CL/ADVT/2026-27, Date: 21-09-2026

**CHANGE OF NAME**

I, **VUTNOORI VENKAT NARASAIAH, S/o. VUTNOORI RAJAM,** (old Name) Plot No.22, Harika Nilayam, Gandimaisamma Mandal, Medchal - Malkajgiri Dist., Telangana State - 500100, has changed as **VUTNOORI VENKATANARSAIAH** (New Name) for all purposes



## జూరాల నీటి కోసం జలదీక్ష

అదనపు కలెక్టర్ కాళ్లపై పడి కన్నీరుమున్నీరైన మహిళా రైతులు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి, తాగునీటి గోస తీర్చడానికి జూరాల ప్రాజెక్ట్ నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గద్వాల జిల్లాలో రైతులు తీవ్ర స్థాయిలో ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారిపై నాలుగు గంటలకు పైగా బైఠాయించి నిరసన తెలపడంతో దాదాపు 10 కిలోమీటర్ల మైర ట్రాఫిక్ స్తంభించిపోయింది. కన్నీటిపర్వంతమైన మహిళా రైతులు పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో ఘటనా స్థలానికి చేరుకున్న గద్వాల అదనపు కలెక్టర్‌ను చూసి మహిళా రైతులు ఆవేదనతో కాళ్లపై పడ్డారు. పంటలు ఎండిపోతున్నాయి. అప్పులపాలైపోయి పరిస్థితి వచ్చింది. మాపై దయ ఉంచి జూరాల నీళ్లు విడుదల చేయించండి సాబ్ అంటూ కన్నీరుమున్నీరయ్యారు. అధికారుల వద్ద మహిళా రైతులు రోదిస్తూ వేడుకున్న దృశ్యాలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ తీవ్రంగా చలించిపోయేలా చేశాయి. స్తంభించిన రవాణా వ్యవస్థ రైతుల అకస్మాత్తు ధర్నాతో రహదారికి వైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, బస్సులు, లారీలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు రంగంలోకి దిగి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ, నీటి విడుదలపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని రైతులు భీష్మించుకూర్చున్నారు. అధికారుల హామీ రైతుల పరిస్థిని, ఆందోళన తీవ్రతను గమనించిన అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడుతానని, జూరాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై తక్షణమే చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు తమ ఆందోళనను విరమించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



## అలంపూర్ ఆలయాలను దర్శించుకున్న ఉత్తరాఖండ్ సిఎస్ దంపతులు

ఘనంగా స్వాగతం పలికిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆలయ అధికారులు


**ప్రజాపక్షం/అలంపూర్ :** ప్రముఖ శక్తిపీఠం, నవబ్రహ్మ ఆలయాలకు ప్రసిద్ధి చెందిన జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆనంద్ బర్ధన్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అలంపూర్‌కు విచ్చేసిన సీఎస్ దంపతులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆలయ కార్యనిర్వాహణాధికారి దీప్తిరెడ్డి మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, మేళతాళాలతో వారిని బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలోకి తీసుకెళ్లారు. ముందుగా సీఎస్ దంపతులు విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అలంపూర్ క్షేత్ర చరిత్ర, ఆలయాల విశిష్టత, జోగులాంబ అమ్మవారి శక్తిపీఠ ప్రాశస్త్యాన్ని సీఎస్ దంపతులకు వివరించారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి స్వామి వారి, అమ్మవారి ప్రసాదాలను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్, అలంపూర్ తాహసీల్దార్ ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు యువకుడు మృతి

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం ఎర్సన్ రెడ్డి గ్రామానికి చెందిన కురువ మల్లయ్య(21) పంట పొలాం నుండి ఇంటికి తిరిగి వెళుతుండగా మార్గమధ్యంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో తల దాచుకోవడానికి చెట్టు క్రిందకు వెళ్లడంతో పిడుగుపాటుకు ఒకరే వ్యక్తి మృతి, ఆయనతోపాటు రెండు మూగజారాలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబంలో ఒక్కడే కుమారుడు కావడంతో కాలనీతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## తండ్రిపై కుమారుల దాడి

చికిత్స పొందుతూ తండ్రి మృతి



**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు తిరుమలాపూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో తండ్రిపై కుమారులు ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన తండ్రి చికిత్సకు తరలిస్తుండగా మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం కొంత కాలంగా తండ్రి కోల్పూర్ రాములు (60), కుమారులు క్రిష్ణ , వెంకట్రాములు మధ్య కుటుంబ విషయాలపై గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం కుమారులు ఇద్దరూ తండ్రి రాములుపై ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు రాములును చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రాములు మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మక్తల్ ఎస్సై రాజు యాదవ్ తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.

## డ్రగ్స్‌పై యువతకు అవగాహన కల్పించాలి

**ప్రజాపక్షం/కొత్తకోట :** మదనపురం మండలంలో కేంద్రంలో పోలీస్ శాఖ పనితీరు మెరుగుపరచాలి బీసీ పొలిటికల్ జేఏసీ వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేందర్ నాయుడు పోలీసు శాఖ పనితీరు మెరుగుపరచడం, గ్రామాల్లో నిఘా పెంచడం, యువత డ్రగ్స్ కు బానిస కాకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మదనాపూర్ ఎంపీడీవో వినతి పత్రం అందజేశారు. అనంతరం మహేందర్ నాయుడు మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన పోలీస్ సిబ్బంది రోజూ గ్రామాల్లో తిరిగే విధంగా చూడాలని, గ్రామంలో ఏ సమస్య ఉంది, ఏం జరుగుతుంది అనే సమాచారాన్ని సేకరించి సంబంధిత అధికారులను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

మంత్రి వాకిటి శ్రీహరి

ఘనంగా స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ





**ప్రజాపక్షం/మక్తల్ :** భారతదేశ యువతకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడు, ప్రపంచానికి భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటి చెప్పిన స్వామి వివేకానంద విగ్రహాన్ని మక్తల్ గడ్డపై ఆవిష్కరించుకోవడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్‌లో నిర్వహించిన స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వామి వివేకానంద విగ్రహాన్ని కేవలం ఒక విగ్రహంగా చూడకూడదని, ఇది యువతకు దిక్సూచి, విద్యార్థులకు స్ఫూర్తి, సమాజానికి సందేశం, భవిష్యత్ తరాలకు బాధ్యత అని అన్నారు. లేవండి... మేల్కొండి... లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి అనే స్వామి వివేకానంద సందేశం ప్రతి యువకుడి జీవితానికి మార్గదర్శకమని మంత్రి పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. . ఈ ఏడాది ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ తెలంగాణకు ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు. వివేకానందుడు దేశ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పారని, యువత దేశభక్తిని, క్రమశిక్షణను అలవర్చుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను ఆమె అభినందించారు.

**స్వయంభు బండ తిరుమలయ్య స్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు**

మక్తల్ పట్టణంలోని ప్రసిద్ధి చెందిన స్వయంభు బండ తిరుమలయ్య స్వామి ఆలయంలో రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం దర్శించుకున్నారు. ఆలయాన్ని మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి పునర్నిర్మించగా, పునర్నిర్మాణం అనంతరం ఆలయానికి చేరుకున్న మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణంతో భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడిందన్నారు. స్వయంభు బండ తిరుమలయ్య స్వామి ఆశీస్సులు మక్తల్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయానికి వచ్చిన మంత్రికి అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 8 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు సమస్యలను కలెక్టర్‌కు వివరించి అర్జీలు సమర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని సూచించారు. శాఖల వారీగా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతల అరెస్ట్ సరికాదు


మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ నేతలను హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని తిరుమల హిల్స్ వద్ద ఉన్న ఆయన నివాసంలో ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం పట్ల ఆయన తీవ్రంగా మండిపడ్డారు. జూరాల వద్ద ధర్నా చేసేందుకు వెళ్తున్న టిఆర్ఎస్ పార్టీ నేతలను ఎక్కడికక్కడే అరెస్టులు చేసి ధర్నాను జరగకుండా ఆపాలని చూడడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు నీళ్లు వదలకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి కేవలం కాలువల మీద ఆధాపడి ఎంతో మంది రైతులు పంటలు పండిస్తున్నారని వారందరికీ మొండి చేయి చూడడం సరైనది కాదని ఆయన ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. లక్ష్మారెడ్డిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న జడ్చర్ల నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తిరుమల హిల్స్‌కి తరలివచ్చారు. పోలీసులు మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని ధర్నాకు వెళ్లకుండా ఆపేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జడ్పీ చైర్ పర్సన్ ప్రభాకర్ రెడ్డి, పిట్టల మురళి చందర్, పర్వత్‌రెడ్డి,దేవా నరసింహ, శ్రీనివాస్ యాదవ్, ఇంతియాజ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారం రుణాలపై ఆర్బీఐ నిబంధనలు సడలించాలి

**పాత విధానాన్నే కొనసాగించాలని సిపిఐ వినతి**



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** బంగారం రుణాలపై ఆర్బీఐ ఇటీవల తీసుకొచ్చిన నిబంధనలను సడలించి, పాత విధానాన్ని కొనసాగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకులు కోరారు. చారకొండ యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.రమేష్ కు సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతులు బంగారం రుణాలు పొందే సమయంలో సర్పంచు, పంచాయితీ కార్యదర్శుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని నిబంధనలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతులు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనలను సడలించి పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని బ్యాంక్ మేనేజర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు డా.చిలువేరు శ్రీనివాసులు, ఎఐటియుసి మండల కార్యదర్శి మొగిళ్ల శ్రీను, సిపిఐ మండల కార్యదర్శి ఎ.సారపు అశోక్ గౌడ్, మండల నాయకులు డా.చిలువేరు సత్యం, గజ్జె కొండలయ్య గౌడ్, పాలకూర యాదయ్య గౌడ్, చింతపల్లి సత్తయ్య గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుల నివాళి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. సిపిఐ పార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి కోళ్ల యేసయ్య , సిపిఐ యువ నాయకులు నక్కలపల్లి కొత్త సుదర్శన్ రెడ్డి బీరం హర్షవర్ధన్ రెడ్డి ఇంటికి వెళ్లి, లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించారు.



## జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటికై ఉద్రికత్త

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అరెస్ట్



**ప్రజాపక్షం/అమరచింత :** జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ నుంచి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించి పాహార నిర్వహించారు. ఆరోజు ముందస్తుగానే పోలీసులు ఆత్మకూరు అమరచింత మండలాలలోని బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. జూరాల ప్రాజెక్టు దగ్గరికి రైతులు, టిఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలి వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాగా పోలీసులు నందిమల్ల ప్రాజెక్టు క్యాంపు దగ్గర పోలీసు బలగాలతో పెద్ద ఎత్తున మోహరించి ఎక్కడికక్కడే రైతులు ప్రాజెక్టు వైపు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశరా. జూరాల ప్రాజెక్టు వద్దకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిటెకటం రామ్మోహన్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిలు ప్రాజెక్టుకు వస్తున్నారని విషయము తెలుసుకొని పోలీసులు ఎక్కడికక్కడే గృహ నిర్బంధం చేశారు . మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పిజెపి క్యాంపు దగ్గరకు రావడంతో అక్కడనే చిట్టెం ను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. రైతులు తీవ్ర ఆగ్రహానికి గురై పోలీసులతో వాగ్వాదానికి దిగి తక్షణమే ప్రాజెక్టు ఎడమ కాలవ నుంచి సాగునీటిని విడుదల చేయాలని లేనిపక్షంలో రైతుల ఆత్మహత్యలకు గురై అవకాశాలు ఉన్నావని పోలీసులకు హెచ్చరించారు. ఏది ఏమైనా జూరాల ప్రాజెక్టుపై సాగునీటిని విడుదల చేసేందుకు రైతులు, బిఆర్ఎస్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేసిన అట్టి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రైతులు జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వవైపు పెల్లి కాలువలో దిగి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల ఆందోళనను అదుపు చేసేందుకు గాను జిల్లా ఎస్పీ, సీఐలు, ఎస్సైలు, సి ఆర్ పి పోలీసులు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించి ప్రాజెక్టు దగ్గర మోహరించారు.

## ఎఫ్ఆర్ఎస్‌లో అన్ని శాఖల సిబ్బంది నమోదు తప్పనిసరి

వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ హాజరుకే వేతనాలు

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఈ నెలలోపు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) లో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయంతో కలిసి ఎఫ్ఆర్ఎస్ హాజరుపై సమీక్ష నిర్వహించారు. మండల, డివిజన్, క్లస్టర్, గ్రామ స్థాయిల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగిని ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. శాఖల వారీగా సిబ్బంది సంఖ్య, ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన ఉద్యోగుల వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. నమోదు కాని సిబ్బందిని వెంటనే ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు చేయాలని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే ఈడిఎంతో సమన్వయం చేసుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు కలెక్టర్**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను అధికారులు సత్వరం పరిష్కరించి, తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 58 దరఖాస్తులు అందగా, కలెక్టర్ అదనపు కలెక్టర్లు, బి.చెన్నయ్య, దేవ సహాయంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖకు పంపించి, పరిష్కార ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతగా స్పందించాలని కలెక్టర తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## షేక్‌పల్లి పెద్దవాగుపై అసంపూర్తి బ్రిడ్జి

ఆరు గ్రామాల ప్రజలకు నరకం

రెండేళ్లుగా నిలిచిన ఆర్అండ్‌బీ పనులు



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా ఎర్రవల్లి మండలం షేక్‌పల్లి గ్రామ శివారులోని పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎర్రవల్లి నుంచి గార్లపాడు మీదుగా జల్లాపురం వరకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఈ బ్రిడ్జి ద్వారా సాసనూలు, షేక్‌పల్లి, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతిరోజు రాకపోకలుఉ సాగిస్తున్నారు. వందలాది మంది రైతులు, విద్యార్థులు, వాహనదారులు ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కోట్ల రూపాయలతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనుల్లో స్లాబ్ వేసిన అనంతరం సైడ గోడలు, మిగిలిన పనులు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్లాబ్ నుంచి ఇనుప చువ్వలు బయటకు పొడుచుకువచ్చి తుప్పు పడుతున్నాయి. దీంతో బ్రిడ్జి పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా బురదమయమైంది. దీంతో ఏకశిల, శ్రీసరస్వతి పాఠశాలలకు చెందిన బస్సులు విద్యార్థులతో కలిసి బురదలో కూరుకుపోయి గంటల తరబడి నిలిచిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. పాల వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ, డీఈఈ స్పందించి బ్రిడ్జి పనులను పూర్తి చేసి ఆరు ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## కల్వకుర్తిలో ఖేతి ఆదర్శ రైతు సమ్మేళనం

**నెట్‌హౌస్ సాగులో విజయవంతమైన నలుగురు రైతులను సన్మానం**

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఖేతి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి, ఉద్యానవన శాఖల సంయుక్త సహకారంతో సోమవారం కల్వకుర్తి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదర్శ రైతు సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తితో పాటు సమీప మండలాల నుంచి 40 మంది పైగా రైతులు, సెర్ప్ సిబ్బంది హాజరయ్యారు. నెట్‌హౌస్ సాగులో విజయవంతమైన నలుగురు రైతులను జ్ఞాపికలు, శాలువాలతో సన్మానించారు. ఖేతి టీమ్ లీడర్ విష్ణువర్ధన్ తుంకుంట్ల మాట్లాడుతూ సెర్ప్ రుణాలు, ఉద్యానవన శాఖ సబ్సిడీతో నెట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన తీరును వివరించారు. ఇప్పటివరకు 12పంటలు సాగు చేయగా, 8 పంటలు విజయవంతమై సగటున రూ.16 వేల లాభం వచ్చిందన్నారు. రైతులను మార్కెట్ అనుసంధానం కల్పించేందుకు కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తామని ఖేతీ తెలంగాణ స్టేట్ హెడ్ విట్టల్ తెలిపారు. ఉద్యానవన శాఖ హెచ్ఓ మహేశ్వరి నెట్‌హౌస్‌లతో పంటలకు వర్షం, ఎండ, పురుగుల బెడద నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శివలీల, సెర్ప్ ఏపీఎం చంద్రయ్య, సీసీలు, ఖేతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## గాడ్స్ ఆన్ వారియర్స్‌కు ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్

**ప్రజాక్షం/కొత్తకోట :** ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీలు హైదరాబాద్ మహానగరంలోని కాటేదాన్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించిన ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు, ఈ పోటీలకు దాదాపు 2000 మంది విద్యార్థిని పాల్గొన్నారు. ఈ ఛాంపియన్షిప్ పోటీలకు కొత్తకోట పట్టణానికి చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ చెందిన విద్యార్థులు దాదాపు 30 మంది విద్యార్థి విద్యార్థినులు పాల్గొని చక్కటి ప్రతిభా కనపరిచి వరుసగా బంగారు పథకాలు సాధిస్తూ ఓవరాల్ ఛాంపియన్షిప్ కొత్తకోట కైవసం చేసుకున్నది అని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. వీరిలో కథాస్, కుమ్మితే, వెపన్స్ విభాగాలలో విద్యార్థులు విజయకేతనం ఎగురవేశా ఈ సందర్భంగా విద్యార్థిలకు ఆస్మో ప్రెసిడెంట్ సయ్యద్ అంజత్ హుస్సేన్ హస్మి , ఆర్గనైజర్ అమర్ సింగ్ జహీరుద్దీన్, కేశవ్ గౌడ్ విద్యార్థులకు మెడల్స సర్టిఫికెట్స్ అందించి ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్షిప్ ట్రోఫీని ఇచ్చి వారిని అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చినటువంటి మాస్టర్స్ ఎండి ఇంతియాస్ కే మహేష్ అనిత రెడ్డి జే సుమ పరమేష్ అరవింద చారి పృధ్వీరాజ్, సోనూ విద్యార్థులను అభినందించారు.



## 5 స్టార్ హోటల్ కాదు... సామాన్యుడి టీ పాయింట్‌లో ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలో నిర్వహించిన పాదయాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కార్యక్రమం ముగించుకుని తిరుగు ప్రయాణంలో అంగు ఆర్భాటాలకు దూరంగా సామాన్యుడిలా రహదారి పక్కన ఉన్న టీ పాయింట్ వద్ద ఆగి టీ తాగారు. భువనగిరి మండలం చీమలకొండూరు గ్రామంలోని రహదారి పక్కన ఉన్న టీ పాయింట్ వద్ద కార్యకర్తలతో కలిసి కూర్చున్న ఎమ్మెల్సీ సత్యం, టీ తాగుతూ వారితో ఆప్యాయంగా మాట్లాడారు. ప్రజా ప్రతినిధిగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ కార్యకర్తలకు సమయం కేటాయిస్తూ, వారితో కలిసిమెలిసి ఉండటం ఆయన నిరాడంబరతకు నిదర్శనమని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. 5 స్టార్ హోటళ్లలో కాకుండా... సామాన్యుడి టీ పాయింట్లో టీ తాగుతూ కార్యకర్తలతో మమేకమైన ఎమ్మెల్సీ సత్యం అక్కడున్న వారిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ ఎండి ఇమ్రాన్ జిల్లా సమితి సభ్యులు గాదెగాని మాణిక్యం, కల్లేపల్లి మహేందర్, రాజు రవి కృష్ణ మైసయ్య శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ దరఖాస్తులను వారంలో పరిష్కరిస్తాం : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) లో భాగంగా స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో సర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్ పురోగతిని కలెక్టర్ వివరిస్తూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు,విచారణ పూర్తయినవి, విచారించాల్సినవి,డిస్పోజల్ స్టేటస్‌కు సంబంధించిన పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.అంతకుముందు సీఈవో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో సర్ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన డిస్పోజ్ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. కంప్యూటర్‌లో డేటా నమోదు సమయంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వెరిఫికేషన్‌కు బదులుగా అవసరమైన చోట డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు. ఫామ్ 6, ఫామ్7, ఫామ్8లకు సంబంధించిన దరఖాస్తుల విచారణలో అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సర్ పనులన్నీ అక్టోబర్ 2వ తేదీ లోగా పూర్తి చేయాలని, సూపర్‌వైజర్లు,బీఎల్‌ఓలు తమకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ,భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

## ప్రభుత్వం డ్రామాలు మాని రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలి

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా డ్రామాలు మాని రాష్ట్రంలో రైతుల సమస్యలపైన, అభివృద్ధిపైన దృష్టి పెట్టాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి హితవు పలికారు. సోమవారం జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా బిఆర్‌ఎస్ పార్టీ అధినేత కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిల భూముల సర్వేలు, పరిశీలన అంటూ కాంగ్రెస్ ఎంపిలు, ఎమ్మెల్యేలు తిరగడంపై ఆయన మండి పడ్డారు. కొండలెన్ని తొవ్వింద్రు ఎలుకలెన్ని పట్టింద్రో ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతల తెలివి తక్కువ వేశాలను చూసి ప్రజలు నవ్వుతున్నారని యద్దేవా చేశారు. అసెంబ్లీలో రేవంత్ చెప్పిందంతా చెత్తవాగుడని తేటతెల్లమైందని అన్నారు. దారి తప్పిన వాళ్ల వాస్కోడిగామా చెప్పినట్లు విని పోయినోళ్ల పరువు పోయిందన్నారు. కెసిఆర్ భూముల సర్వే అని పోయినోళ్లకు అక్కడి దళితులే చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెపింద్రన్నారు. కెటిఆర్, హరీష్ రావు, మేము మాకున్న ఆస్తులు అఫిడవిట్‌లో చూపినవే అన్నారు. 22ఏ భూ భారతి పేరున మీరు చేస్తున్న అక్రమాలు ప్రజలంతా గమనిస్తున్నారని దానికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

## విద్యార్థుల స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థుల అభివృద్ధికి ప్రతిబంధకంగా మారిన ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజేత డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపక బృందం విజ్ఞప్తి చేసింది. సోమవారం పట్టణంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను నేరుగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడి రీయింబర్స్మెంట్ నిధులు నిలిచిపోవడంతో వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ బకాయిలు విడుదల కాకపోవడం వల్ల ప్రైవేట్ విద్యాసంస్థలు నడవడమే కష్టంగా మారిందని, యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో కూరుకుపోయి అధ్యాపకులు, సిబ్బందికి నెలానెలా జీతాలు ఇవ్వలేకపోతున్నారని వాపోయారు. కనీస వేతనాలు లేక కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నామని విన్నవించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పెండింగ్ బకాయిలన్నీ విడుదలయ్యేలా చూడాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్సీ స్పందిస్తూ ఈ విషయమై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు చారి, యాదయ్య, హరి, దుర్గయ్య, రాజారాం, రాంరెడ్డి, సతీష్, వీరయ్య, బాలాజీ, సంతోష్, ప్రణవ్, సిబ్బంది పాల్గొన్నారు.



# రూ.20.30 కోట్లతో కోదాడ-హుజూర్‌నగర్ బస్‌స్టేషన్లకు మహర్దశ

కోదాడ ఆధునిక బస్‌స్టేషన్‌కు రూ.16.80 కోట్లు

హుజూర్‌నగర్ బస్‌స్టేషన్ పునరుద్దరణకు రూ.3.50 కోట్లు

మంత్రి ఉత్తమ్ కృషితో ప్రజా రవాణాకు కొత్త సొబగులు

ప్రయాణికుల సౌకర్యమే ప్రమాణం... పనులు వేగవంతం చేయాలి

నిర్మాణ నాణ్యతలో రాజీ పడొద్దు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ/హుజూర్‌నగర్:** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక కృషితో కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లో ప్రజా రవాణా వ్యవస్థ సరికొత్త రూపు సంతరించుకోనుంది. కోదాడలో ఆధునాతన బస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.16.80 కోట్లు, హుజూర్‌నగర్ బస్‌స్టేషన్ పునరుద్ధరణ ఆధునికీకరణకు రూ.3.50 కోట్లు కలిపి మొత్తం 20.30 కోట్లతో రెండు ప్రధాన రవాణా కేంద్రాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ రెండు బస్‌స్టేషన్ల నిర్మాణ ప్రణాళికలు, ప్రయాణికులకు కల్పించాల్సిన వసతులు, పనుల పురోగతిపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రతిపాదిత నమూనాలను పరిశీలించిన ఆయన, పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని టిజిఎస్ ఆర్టీసీ అధికారులకు అదేశించారు. కీలక రవాణా కూడలిగా ఉన్న కోదాడలో ఐదు ఎకరాల విస్తీరణంలో ఆధునిక బస్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. సుమారు 65,700 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన రెండు అంతస్తుల ప్రధాన టెర్మినల్ భవనం ఈ ప్రణాళికలో భాగంగా ఉండనుంది. విశాలమైన బస్ బేలు, ప్రయాణికుల నిరీక్షణ ప్రాంగణం, క్రమబద్ధమైన బస్ డ్రైవ్‌వేలు, కార్లు, ద్విచక్ర వాహనాలు, టాక్సీలు ఆటోలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించనున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక చార్జింగ్ పాయింట్లు, వేర్వేరు ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, భద్రత క్యాబిన్లు, సెన్సర్ బారికేడ్లు, పచ్చదనంతో కూడిన ప్రాంగణం ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికుల సౌకర్యాలతో పాటు సిబ్బంది విశ్రాంతిగదులు, పరిపాలన విభాగాలు, శిక్షణ గది వంటి వసతులు కూడా అందుబాటులోకి రానున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వాణిజ్య సముదాయం, రెస్టారెంట్, హోటల్ ఏర్పాటుకు ప్రత్యేక స్థలాలను ప్రతిపాదించారు. హుజూర్‌నగర్ బస్‌స్టేషన్‌ను రూ.3.50 కోట్లతో ఆధునికంగా పునరుద్దరించనున్నారు. ప్రతిపాదిత నమూన ప్రకారం సుమారు రెండు ఎకరాల పరిధిలో 28,392 చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంలో రెండు అంతస్తుల టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నారు. విశాలమైన ప్లాట్‌ఫామ్, ప్రయాణికుల నిరీక్షణ ప్రాంగణం, వాణిజ్య స్థలాలు, పార్కింగ్, బస్సుల రాకపోకలకు అనువైన అంతర్గత మార్గాలతో బస్‌స్టేషన్‌కు కొత్త రూపు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కోదాడహుజూర్‌నగర్ ప్రజలకు సురక్షితమన సౌకర్యవంతమైన, ప్రయాణ వసతులు కల్పించడమే మా లక్ష్యమన్నారు. బస్‌స్టేషన్ అంటే కేవలం బస్సులు వచ్చి వెళ్లే ప్రదేశం కాదు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు సహా ప్రతి ప్రయాణికుడికి భరోసా ఇచ్చే ప్రజా కేంద్రంగా ఉండాలని అన్నారు. నిర్మాణంలో నాణ్యత, పనుల్లో వేగం, రెండింటికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలి, అనవసర జాప్యానికి అవకాశం లేకుండా స్పష్టమైన కార్యచరణతో రెండు బస్‌స్టేషన్ల పనులకు ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు అదేశించారు. కోదాడహుజూర్‌నగర్ బస్‌స్టేషన్ల అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు లభించడంతో పాటు పట్టణాల రూపురేఖలు మారుతాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిర్మాణ సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, టిజిఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్, చీఫ్ ఇంజనీర్ కవితతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని మహిళ మృతి

**ప్రజాపక్షం/నాంపల్లి** : మండల పరిధిలోని బండ తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాటి మీదిగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.వేగంగా వచ్చిన కారు ఢీకొని ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గునబోయిన లక్ష్మమ్మ (52) భర్త చంద్రయ్య గ్రామానికి చెందిన ఆమె రాత్రి రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన బోడాస్ బుగ్గరాజు నడుపుతున్న కారు అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది.ప్రమాద ధాటికి కారు ఆమె తల మీదుగా వెళ్లడంతో మహిళ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.సమాచారం అందుకున్న నాంపల్లి ఎస్ఐ కె.లింగారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతురాలి కూతురు పోగాకు ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## యూరియా యాప్ రైతుల పాలిట శాపం

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : యూరియా యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని ఆమ్‌ఆద్మీ పార్టీ సూర్యాపేట జిల్లా ఇంచార్జీ తన్నీరు వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎరువుల యాప్ ద్వారా రైతులు పడే సమస్యలపై అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడం ద్వారా దూరంగా ఉన్న దుకాణాల్లో స్టాక్ కేటాయించబడటం వల్ల రవాణా ఖర్చులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రభుత్వ రాయితీ ధర కంటే రవాణాకే ఎక్కువ ఖర్చు అవుతుందన్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందడంలేదన్నారు. రైతులు కష్టాలు తొలగించే విధంగా ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మండల కన్వీనర్ పూసపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కరెంట్ కోతలు: పంటలు ఎండిపోతున్నాయ్

రైతులకు వ్యవసాయానికి 16 గంటల కరెంట్ ఇవ్వాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ:** రైతులకు వ్యవసాయానికి రోజుకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ దేవరకొండ నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాపాల లేకుండా రైతుల కరెంట్ కోతల వల్ల రైతుల పంటలు ఎండిపోయి నష్టపోతున్నారని అన్నారు. వచ్చిన కరెంట్ కూడా లోవోల్టే వల్ల మోటార్లు సరిగ్గా నడవడం లేదని, వర్షాలు లేక మెట్ట పంటలు మొత్తం ఎండిపోతున్నాయని రైతులకు ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. దేవరకొండ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు పరిహారం అందించాలని కోరారు. నిత్యావసర సరుకులు, పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కరెంట్ సక్రమంగా అందించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, కనకాచారి, వెంకటయ్య, రామస్వామి, జయరాములు, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన 12 మంది అరెస్టు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్/పెన్‌పహాడ్** : గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన 12 మందిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన పెన్‌పహాడ్ ఎస్ఐ బాలు నాయక్‌తో కలిసి సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల 16న పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనాజీపురంలో ఒక పురాతన, చారిత్రాత్మక దర్గా వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్న విషయంపై పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించారన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళగా ఏపి16 డిఆర్ 5256 నంబర్ గల కారు, 2 బైక్‌లు, 1 స్కూటిలో వచ్చిన కొందరు వ్యక్తులు దర్గా ఆవరణలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించి అక్కడ తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆ సమయంలో 10 మందిని గుర్తించగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ ఘటనపై అనంతారం జిపిఓ పెరుమళ్ల పిచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ బాలు నాయక్ ధర్యాప్తు జరిపి 12 మంది నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. దొంగరి మదన్, షేక్ సైదా, సయ్యద్ అమీర్ అలీ, షేక్ రహమాన్ రఫీ, షేక్ అహమ్మద్, షేక్ మహ్మద్ రఫీ, మైనుద్దీన్, మహ్మద్ సుల్తానా మియా, మహమ్మద యాసిర్, పి. మీనయ్య, సయ్యద్ అక్బర్, రూపాని వెంకన్న, కొమరరాజు నర్సింహలు నింధితులుగా ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. వీరి నుండి 1 కారు, 2 బైక్‌లు, 1 స్కూటి, 2 పారలు, 2 టెంకలు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు గుప్త నిధుల పేరుతో చారిత్రాత్మక కట్టడాలు, ఇతర ప్రాంతాల్లో తొవ్వకాలు జరపడం చట్టవ్యతిరేకమన్నారు. ఇలాంటి కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యం



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజావాణి దరఖాస్తులకు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి, రెవెన్యూకి సంబంధించిన 56 దరఖాస్తులు, డిపిఓ 4, డిడబ్ల్యుఓ 7, మున్సిపల్ 4, ఆర్‌డిఓలు 6, మిగిలిన 21 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవి మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయన్నారు. అనంతరం కోదాడ జాబ్‌మేళాలో పనిచేసిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షిస్తూ ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని,ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కారమైతే ప్రజల సమస్యలు తీరుతాయని అన్నారు. ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 54, ఇతర శాఖలకు 75.. మొత్తం 125 ఫిర్యాదులు వచ్చాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులు తొమ్మిదవ రాష్ట్రీయ పోషణ్ మాహ్ పై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,డీఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డీఆర్‌ఓ దశరథ పాల్గొన్నారు.



## హరీశ్‌రావువి ఫాంహౌస్ సొల్లు కబుర్లు


ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తీవ్ర ధ్వజం



**ప్రజాపక్షం/యాదాద్రి** : పదేళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్ర నలుమూలలా ఫాంహౌస్ నిర్మించుకున్న బిఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్రావుకు తమ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గానికి వచ్చి హరీశ్‌రావు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో కరెంటు కోతలు ఉన్నాయంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అసలు ఆలేరు నియోజకవర్గానికి హరీశ్‌రా ఏం ఎలగబెట్టారని ఇక్కడికి వచ్చారని అయిలయ్య ఘాటుగా ప్రశ్నించారు. గతంలో నియోజకవర్గానికి రావాల్సిన తపాస్పల్లి నీళ్లను తరలించుకుపోయిన చరిత్ర ఆయనదని, గంధమల్ల ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఆలేరుకు రావాల్సిన నీటి విషయంలో తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ పాలన నచ్చకనే ప్రజలు వారిని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని, హరీశ్‌రావు ఎన్ని సమావేశాలు పెట్టినా 'ఆలేరు గడ్డ.. కాంగ్రెస్ అడ్డా' అని స్పష్టం చేశారు. వాతావరణంలో ఎల్నినో ప్రభావం వల్ల ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గి విద్యుత్ కొరత ఏర్పడితే, దాన్ని కూడా రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. మోటకొండూరులో ఎంఆర్‌ఓ, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, డబుల్ రోడ్లు, వంగపల్లి అండర్పాస్ బ్రిడ్జి వంటి పనులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు.

## హరీష్‌రావును విమర్శించే స్థాయి ఐలయ్యకు లేదు

బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి ధ్వజం



**ప్రజాపక్షం/యాదాద్రి** : ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భూ కబ్జాల బకాసురుడిగా పేరుగాంచిన ఐలయ్యకు, రాష్ట్రంలో అపర భగీరథుడిగా పేరుగాంచిన మాజీ మంత్రి హరీశ్రావును విమర్శించే స్థాయి ఎంతమాత్రం లేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే ఐలయ్య చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని కౌంటర్ ఇచ్చారు. ఆలేరు నియోజకవర్గానికి హరీశ్రావు ఏం చేశారో ప్రజలందరికీ తెలుసని, కేసీఆర్, హరీశ్రావుల హయాంలోనే సస్యశ్యామలమైన ప్రాంతాలు రూపుదిద్దుకున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నీటి ఎద్దడితో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఎల్నినో సాకులు చెబుతూ ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆలేరులో భూకబ్జాలు, ఆక్రమణలకే ప్రాధాన్యం ఇస్తున్న ఐలయ్య, నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా పక్కనబెట్టారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫామ్హౌస్ల పేరుతో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించలేరని, ఆలేరు ప్రజలు కాంగ్రెస్ వైఫల్యాలను నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. హరీశ్‌రావుపై చేసిన అసత్య వ్యాఖ్యలను ఐలయ్య వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే ఆలేరు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ప్రజావాణికి అధికారులు గైర్హాజరు

**ప్రజాపక్షం/అర్వపల్లి** : ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి అధికారుల గైర్హాజరు చర్చనీయాంశంగా మారింది. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 11.30 గంటలైనా మండల తహశీల్దార్, ఎంపిడిఓ ఝాన్సీతోపాటు మరో మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణికి వస్తున్నప్పటికి, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎవరికి విన్నవించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి క్రమం తప్పకుండా ప్రజావాణికి హాజరై ప్రజల వినతులను స్వీకరించి పరిష్కరించాలని కోరుతున్నారు.

## లింగారెడ్డిగూడ స్టేజీ వద్ద బస్సులు నిలపాలని వినతి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పాత జాతీయ రహదారికి అనుకొని ఉన్న లింగారెడ్డిగూడ స్టేజీ వద్ద ఆర్టీసి బస్సులను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ కరుణశ్రీని కోరారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ డిపో మేనేజర్ కరుణశ్రీకి లింగారెడ్డిగూడ సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సందుగారి లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు రంగంపల్లి రమేష్ గౌడ్,సందుగారి నరేందర్‌రెడ్డి, రంగంపల్లి సురేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకారం



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ వివరించారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని నిర్థవెళ్ళి గ్రామ రజక సంఘం నేతలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఇప్పించాలని విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో రవీందర్ యాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తోట చెన్నయ్య, నాయకులు ఉమాపతి, రమేష్ నాయక్, పల్లాటి సురేందర్, తోట వెంకటేష్, గుత్తి రంగయ్య, సిలువేరు మల్లయ్య, చాకలి జంగయ్య, బండి నిరంజన్, బోడ రాములు, పట్నం మహేందర్ పాల్గొన్నారు.

## వైద్యచికిత్స కోసం ఎల్‌ఒసి అందజేత



**ప్రజాపక్షం/కొత్తూరు:** ఆపదలో ఉన్న వారికి ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. సోమవారం కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన వడ్ల సుదర్శన్ చారికి మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.3లక్షల ఎల్‌ఇసిని మంజూరు చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అజయ్ నాయక్, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బాల్‌రాజ్, నాయకులు ఇంద్రాసేనారెడ్డి, కె.కుమార్, కె.నర్సింలు, శివాచారి పాల్గొన్నారు.

## ప్రజాపాలనతోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా పాలన ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ బుడ్డ నవకిరణి నరసింహా తెలిపారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలోని మహాల్ ఎలికట్టలో ముదిరాజ్ సంఘం భవన స్లాబ్‌నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అభినవ్, వార్డు సభ్యులు పురుగుల సురేష్, మంగలి శ్రీశైలం, గడ్డమీది శ్రీను, గోనెల రాములు, భవాని మాత దేవాలయ చైర్మెన్ చాకలి చంద్రయ్య, డైరెక్టర్ ముత్యాల రాములు, కుక్కల మహేష్ పాల్గొన్నారు.

## బ్యాటరీ పరిశ్రమ కాలుష్యంతో ఎండుతున్న పంటలు



**ప్రజాపక్షం/కొందుర్గు:** బ్యాటరీ పరిశ్రమ కాలుష్యంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కొందుర్గు మండల కేంద్రం సమీపంలో ఉన్న బ్యాటరీ పరిశ్రమ నుండి వెలువడుతున్న కాలుష్యాన్ని రైతులు చూపించారు. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు మాసారం యాదయ్య, గొల్లపల్లి కృష్ణయ్య, చాకలి గోపాల్, రాయికంటి గోపాల్, యాదయ్యలు కోరారు.

## భూ కబ్జాపై విచారణ చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్ళే దారి కబ్జాపై అధికారులు విచారణ చేసి నక్షరోడ్డును కాపాడాలని సోమవారం గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. యాచారం రెవెన్యూ పరిధిలోని 53,54 లో మధ్యనుంచి సర్వేనంబర్ 63,64నుండి ఆంజనేయ స్వామి అలయంకు వెళ్లే దారిని కాపాడి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అదేశానుసారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గోపలి జోసఫ్‌ను ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా సాయిచరణ్, ఉపాధ్యక్షులుగా జక్కుల రాజు, ప్రధానకార్యదర్శిగా నీలం చక్ర పాణి, కార్యదర్శిగా రమేశ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా రామ కృష్ణ, మండల అధ్యక్షుడిగా పాశం జయప్రకాశ్ పాల్గొన్నారు.

# ఎన్‌డిపిఎల్, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

### ఎక్సైజ్ అధికారులకు కమిషనర్ సి. హరికిరణ్ ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్తగా ఏర్పడిన క్యూర్ పరిధిలో ఎన్‌డిపిఎల్, ఎన్‌డిపిఎస్(డ్రగ్స్) అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ అధికారులను ఆదేశించారు. అబ్కారీ భవన్‌లో సోమవారం క్యూర్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లతో ఆయన సమావేశమై మూడు నెలల్లో నమోదైన నేరాలపై సమీక్ష నిర్వహించారు. క్రైమ్ నియంత్రణతో పాటు బార్లు, మద్యం దుకాణాలకు సంబంధించిన ఎక్సైజ్ ఫీజు ఇన్‌స్టాల్‌మెంట్‌లపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.

**ఉద్యోగులకు అక్టోబర్ నుంచి న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్..**

ఎక్సైజ్ ఉద్యోగులకు ఈ నెల 30 వరకు మాత్రమే ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్య సహాయత కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వం కొత్తగా న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమల్లోకి తీసుకురావడంతో ఆరోగ్య సహాయతపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. అక్టోబర్ నుంచి ఎక్సైజ్ ఉద్యోగులకు న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ అమల్లోకి వస్తుందని వెల్లడించారు. ఇప్పటికే 97 శాతం మంది ఎక్సైజ్ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సమావేశాల్లో అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, డిప్యూటీ కమిషనర్లు ఎ.శ్రీనివాసరెడ్డి, జె.హరికిషన్, పి.ప్రణవి, చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్లు శీలం శ్రీనివాస్, డి. శ్రీనివాస్, జి. శ్రీనివాసరెడ్డి, ప్రదీప్ రావు, టిజిబిసిఎల్ జిఎం శ్రీనివాసరావు, వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ ఆర్‌టిఒ కార్యాలయంలో ముగ్గురిపై వేటు

### కానిస్టేబుల్ నగదు లెక్కింపు వీడియో వైరల్.. విచారణకు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బండ్లగూడ ఆర్‌టిఒ కార్యాలయంలో కానిస్టేబుల్ నగదు లెక్కిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రవాణా శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణకు రవాణా శాఖ కమిషనర్ కె.ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. కానిస్టేబుల్ అరుణ్‌ను సస్పెండ్ చేయడంతో పాటు కార్యాలయంలో ఏజెంట్లను అనుమతించడం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వంటి ఆరోపణల నేపథ్యంలో ఎంవిఐ భీమ్ సింగ్, ఆర్‌టిఓ రామ్ చందర్‌లను సైతం విధుల నుంచి తప్పించి రవాణా శాఖ ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేశారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై విచారణజరిపి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఏజెంట్లకు అనుమతి ఇస్తే కఠిన చర్యలు..** రవాణా శాఖ కార్యాలయాల్లోకి ఏజెంట్లను అనుమతించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు శాఖ స్పష్టం చేసింది. కార్యాలయాల్లో ఏజెంట్లను అనుమతిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇందుకు సంబంధిత ఆర్‌టిఓనే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొంది. కార్యాలయాల నిర్వహణ, పర్యవేక్షణలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని రవాణా శాఖ స్పష్టం చేసింది.

## 28 కిలోల గంజాయి పట్టివేత





**ప్రజాపక్షం/హైదరాబాద్:** విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న సుమారు రూ.10 లక్షల విలువైన 28.163 కిలోల గంజాయిని మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్ బృందాలు రెండు వేర్వేరు కేసుల్లో పట్టుకున్నాయి. ఈ ఘటనలకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మల్కాజిగిరి ఆర్‌కె నగర్ ఆటోస్టాండ్ ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ కోటమ్మ ఆధ్వర్యంలోని సిబ్బంది తనిఖీలు నిర్వహించి 7.163 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బప్పా అనే వ్యక్తిని అరెస్టు చేశారు. మరో ఘటనలో మల్కాజిగిరి డిటిఎఫ్ సిఐ శంకర్ ఆధ్వర్యంలోని బృందం సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి 21 కిలోల గంజాయిని పట్టుకుంది. విశాఖ నుంచి రైలులో హైదరాబాద్‌కు గంజాయి తరలించినట్లు గుర్తించారు. ఈ కేసులో తమిళనాడు మధురైకి చెందిన హిందు రాణి, రాజమ్మల్ పంచగామ్ అనే ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. రెండు కేసుల్లో పట్టుబడిన గంజాయి, నిందితులను మల్కాజిగిరి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు మల్కాజిగిరి అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్ రావు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని నిందితులను పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్ బృందాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ప్రణవి అభినందించారు.

## హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో నీటి నాణ్యతపై పటిష్ట నిఘా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికులు, రైల్వే సిబ్బందికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ రైల్వే స్టేషన్, రైల్వే కాలనీలో నీటి సరఫరా, నిల్వ, క్లోరినేషన్, పంపిణీ వ్యవస్థలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సెప్టెంబర్ 9 నుంచి 15 వరకు హైదరాబాద్ రైల్వే స్టేషన్, రైల్వే కాలనీ నుంచి 188 నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. మిగిలిన క్లోరిన్ స్థాయిలతో పాటు నీటిలో ఇ.కోలి బ్యాక్టీరియా ఉనికిని గుర్తించేందుకు బ్యాక్టీరియాలజీ పరీక్షలు చేపట్టారు. మొత్తం 188 నమూనాల్లో ఏ ఒక్కటి కూడా అనర్హమైనదిగా తేలలేదని, ఎక్కడా ఇ.కోలి పాజిటివ్‌గా గుర్తించలేదని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. నీటి నాణ్యతను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉంచేందుకు ప్రతిరోజూ అవశేష క్లోరిన్ స్థాయిలను పర్యవేక్షించడంతో పాటు, క్రమం తప్పకుండా నీటి నమూనాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ నీటి నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులు, పర్యవేక్షక సిబ్బందిని ఆదేశించారు. ప్రయాణికులు, సిబ్బందికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు స్టేషన్లు, రైల్వే కాలనీల్లో నీటి సరఫరా వ్యవస్థలపై పరీక్షలు, తనిఖీలు, పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.

## బిసిలకు రాజ్యాధికారం లక్ష్యం

### తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీర్మాన్ మల్లన్న



**ప్రజాపక్షం/కొందుర్గు:** బిసిలకు రాజ్యాధికారం కల్పించాలన్నదే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ పని చేస్తుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వివరించారు. సోమవారం తీన్మార్ మల్లన్న చేపట్టిన బిసి రాజ్యాధికారి పాదయాత్ర కొందుర్గు మండల కేంద్రానికి చేరుకుంది. అంతకు ముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొందుర్గు ముఖ్యకూడలిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బిసిలు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో రాజకీయ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రాజకీయ పార్టీల నేతలు బిసిలకు ఓటు బ్యాంకుగానే వినియోగిస్తున్నారే తప్పా అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయడం లేదన్నారు. శాసన సభలో బీసి మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, మహిళల ప్రాతినిద్యంలో బిసిలకు వాటా తక్కువగా ఉందని వివరించారు. ముస్లిం మహిళల ప్రాతినిధ్యం లేదన్నారు. సాంఘీక సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. పాదయాత్రతో బిసిల సమస్య పట్ల ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడం జరుగుతుందని పేర్కొన్నారు.

## జన్వాడ ఫాంహౌస్ అనుమతులు లేకుంటే కూల్చడం ఖాయం : గజ్జెల కాంతం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జన్వాడ ఫాంహౌస్‌కు అనుమతులు లేకుంటే తప్పకుండా కూల్చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు ఆస్తులు అమ్ముకుని తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటే.. బిఆర్‌ఎస్ నేతలు కెఆర్, కెటిఆర్, హరీశ్‌రావుల ఆస్తులు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. టిఆర్‌ఎస్ ఏర్పాటు చేయకముందు కెసిఆర్ ఆస్తులు ఎంత? ప్రస్తుతం ఎంత? కెటిఆర్, హరీశ్‌రావుల ఆస్తులు పార్టీ ఏర్పాటుకు ముందు ఎంత? ఇప్పుడు ఎంత? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. జన్వాడ ఫాంహౌస్ కెటిఆర్‌కు చెందినది కాదని చెబుతున్నప్పుడు అక్కడ వివిఐపిగా ఎవరు ఉన్నారని ప్రశ్నించారు. అది కేటీఆర్ ఫాంహౌస్ కాకపోతే సిఎం రేవంత్‌రెడ్డిని గతంలో ఎందుకు అరెస్టు చేయించారని నిలదీశారు. బిఆర్‌ఎస్ నేతల భూదందాలపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

## అక్టోబర్ 1 నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రానున్న ఖరీఫ్ 2026–27 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోళ్లపై అవగాహన సమావేశం, పిఎసిఎపి అప్లికేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్టోబర్ 1 నాటికి అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిసిఒ, డిఆర్‌డిఓలను ఆదేశించారు. పిఎసిఎపి అప్లికేషన్‌లో అన్ని కొనుగోలు కేంద్రాలు ఎల్ 3 స్థాయికి చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం, గన్నీ కాంట్రాక్టర్ల ద్వారా వినియోగించే అన్ని వాహనాలకు వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ అమలు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల జిల్లా అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, స్వప్న, పిడి డిఆర్డిఏ శ్రీలత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియజోద్దీన్, డిసిసిఓ సుధాకర్, వ్యవసాయశాఖ అధికారి రమాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి


### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన సేవలు మరువలేనివని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యభూమిక పోషించారని గుర్తు చేశారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనాడు తెలంగాణ ఉద్యమం బలపడేందుకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతో కృషి చేశారని, నేడు రాష్ట్రం ఏర్పడేందుకు వారి కృషి సైతం ఎంతో ఉందని వివరించారు. మహనీయుల ఆశయాలను అమలు చేసేందుకు పద్మశాలీలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, జెఏసి చైర్మెన్ జనార్థన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నక్క బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ నరేష్, హాజిపల్లి సర్పంచ్ కుమార్‌తో పాటు పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చెర్కుపల్లి బిక్షపతి, కోశాధికారి పల్లాటి నర్సింలు, మహిళా అధ్యక్షురాలు ఒగ్గు స్వాతి, యువజన సంఘం అధ్యక్షుడు పల్లాటి చరణ్, గౌరవ అధ్యక్షుడు కోట జనార్థన్, పులిపాటి నర్సింలు, పల్లాటి విజయ్, ఒగ్గు కిశోర్, కంది ఆంజనేయులు, పల్లాటి విజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతి పిల్లలకు బడి స్థలం కేటాయించడం అభినందనీయం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సంచార జాతి పిల్లల చదువు కోసం ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మాణం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామ సర్పంచ్ కుమార్ తీర్మాణ కాఫీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ త్వరలోనే పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసి సంచార జాతుల పిల్లలకు విద్యను అంధించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీకి కేటాయించిన స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి కేటాయించిన సర్పంచ్ కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు విష్ణు, సుదర్శన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, రాము, జంగయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, ప్రజావాణి ద్వారా అందే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తుల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. జిల్లాలోని సమస్యలకు సంబంధించి వార్తాపత్రికలు, ఇతర మాధ్యమాల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో విద్య, వైద్య, గృహ నిర్మాణ తదితర శాఖలకు సంబంధించిన పలు సమస్యలు ప్రజల దృష్టికి వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు కారణాలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని,మందులు,వైద్య సిబ్బంది, పారిశుద్ధం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. గృహ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, గృహ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి పరిశీలించి,దాని పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని, బాధ్యతను నిర్ణయించుకుని, నిర్ణీత గడువులో పరిష్కరించే విధంగా వ్యవస్థీకృతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# 'క్యా హువా తేరా వాదా'

**ఆహార పదార్థాల ధరల పెరుగుదలపై మోదీ సర్కార్‌ను ప్రశ్నించిన కాంగ్రెస్**




**న్యూఢిల్లీ:** దేశంలో రోజు రోజుకు ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సోమవారం మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. 1977 నాటి ప్రసిద్ధ బాలీవుడ్ పాట 'క్యా హువా తేరా వాదా' (నీ మాటేమైంది?)ను ప్రస్తావిస్తూ, ద్రవ్యోల్బణంపై ప్రధాని మౌనాన్ని ప్రశ్నించింది. పప్పుధాన్యాలు, వంట నూనెతో సహా వివిధ ఆహార పదార్థాల ధరల పెరుగుదల సామాన్యుల గృహ బడ్జెట్‌లను పూర్తిగా తలకిందులు చేసిందని పేర్కొన్న ఒక మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పంచుకున్నారు. హిందీలో చేసిన తన పోస్ట్‌లో రమేశ్ స్పందిస్తూ దేశంలో ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని తాకడం మధ్యతరగతి, పేద వర్గాల నడ్డి విరిచిందని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుడి జీవితం దుర్భరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. 'గత నెలలో సుగంధ ద్రవ్యాల ధరలు భారీగా 10% నుండి 25% వరకు పెరిగాయి. పచ్చ యాలకుల ధర కిలోకు రూ. 4,000 నుండి రూ. 4,400కు, నల్ల యాలకుల ధర రూ. 2,400 నుండి రూ. 2,800కు, జీలకర్ర ధర రూ. 360 నుండి రూ. 400కు పెరిగాయి. జాపత్రి ధర కిలోకు రూ. 2,500 నుండి నేరుగా రూ. 3,000కు చేరింది. 'కందిపప్పు ధర కిలోకు రూ. 100 నుండి రూ. 130కు, శనగపప్పు రూ. 70 నుండి రూ. 100కు, మినపప్పు రూ. 120 నుండి రూ. 140కు పెరిగాయి. ఆవనూనె ధర లీటరుకు రూ. 190 నుండి రూ. 210కు, సఫోలా నూనె ధర రూ. 240 నుండి రూ. 280కు పెరిగాయి అని రమేశ్ తెలిపారు. జూన్ నుండి సెప్టెంబర్ వరకు ఉల్లిపాయల సగటు రిటైల్ ధర కిలోకు రూ. 29.50 నుండి రూ. 53.78కు పెరిగిందని, అంటే కేవలం మూడున్నర నెలల్లోనే 82.3% భారీ పెరుగుదల నమోదైందని ఆయన చెప్పారు. ద్రవ్యోల్బణం కారణంగా పప్పుధాన్యాలు, నిత్యావసర ఆహార పదార్థాలు పేదల ఇళ్లకు అందుబాటులో లేకుండా పోతున్నాయని రమేశ్ అన్నారు. కానీ ద్రవ్యోల్బణంపై ప్రధానమంత్రి మౌనంగా ఉన్నారన్నారు. 'ప్రధానమంత్రి గారూ, ఆ 'అచ్చే దిన్' (మంచి రోజు లు) ఏమయ్యాయి?' అని దేశం ప్రశ్నిస్తోంది. వీళ్ళు కేవలం ఉపన్యాసాలకే పరిమితమయ్యారా? అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే ప్రభుత్వం మౌనంగా ఉంది, ఇదేనా కొత్త భారతదేశం అని ఆయన ప్రశ్నించారు. 1977లో వచ్చిన 'హమ్ కిసీసే కమ్ నహీ' అనే ప్రముఖ బాలీవుడ్ హిట్ పాటలోని సాహిత్యాన్ని ప్రస్తావిస్తూ, 'క్యా హువా తేరా వాదా? వో కసమ్, వో ఇరాదా?' అని రమేష్ అన్నారు. ఈ అనియంత్రిత ద్రవ్యోల్బణంపై మోదీ ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకుని సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. పెరుగుతున్న ధరల సమస్యను కాంగ్రెస్ లేవనెత్తుతూ, ప్రభుత్వం 'ప్రజా వ్యతిరేక' విధానాలను అనుసరిస్తోందని ఆరోపిస్తోంది. అయితే, ప్రభుత్వం ఈ ఆరోపణలను తోసిపుచ్చి, జిడిపి గణాంకాలను ప్రస్తావించింది.

## టీనేజీ బాలికపై లైంగిక వేధింపులు

# ఘటనపై త్వరగా న్యాయం జరగాలి

- నిందితులను పోక్సో చట్టం కింద విచారించాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ:** బిహార్‌లోని జముయిలో ఒక టీనేజ్ బాలికపై నైతిక వేధింపులు, లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై త్వరితగతిన న్యాయం జరగాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న వారందరినీ పోక్సో చట్టం కింద విచారించాలని, సాయంత్రం 7 గంటలకు బహిరంగ రహదారిపై ఒక బాలిక ఎందుకు సురక్షితంగా లేదో బిహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జముయిలో కోచింగ్ క్లాసుల నుంచి తిరిగి వస్తున్న ఒక టీనేజ్ బాలుడు, బాలికను శనివారం సాయంత్రం కొందరు వ్యక్తులు అడ్డగించి, చుట్టుముట్టి, ప్రశ్నించి, దాడికి, లైంగిక దాడికి గురిచేసి, ఆ తర్వాతే వెళ్లనిచ్చారని మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో అప్పటి నుంచి వైరల్ అయింది. ఎక్స్‌లో రాహుల్ గాంధీ పోస్టు చేస్తూ 'బిహార్‌లోని జముయిలో జరిగిన ఈ వీడియో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పదో తరగతికి చె ందిన ఇద్దరు విద్యార్థులను రోడ్డుపై అడ్డగించారు. వేధించారు. అవమానించారు. లైంగిక దాడికి పాల్పడ్డారు. దుండగులు చేతులు జోడించి వేడుకుంటున్న బాలికను అసభ్యంగా తాకు తూ ఈడ్చుకెళ్లారు. ఇలా ప్రవర్తించే హక్కు ఈ వ్యక్తులకు ఎవ రు ఇచ్చారు?' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. 'ఇది సంస్కృతి కాదు. ఇది పితృస్వా మ్యం: ఏ పురుషుడైనా ఒక అమ్మాయి శరీరాన్ని, ఆమె కదలికలను, ఆమె ఇష్టాన్ని నియంత్రించవచ్చనే నమ్మకం' అని గాంధీ అన్నారు. నియంత్రణను సంస్కృతిగా పొరపాటుగా భావించినప్పుడు, 'అంధభక్తులు' ఇటువంటి వైఖరులను సాధారణీకరించినప్పుడు, గుంపులు తామే చట్టమని నమ్మడం ప్రారంభిస్తాయని గాంధీ అన్నారు. 'ఆ వీడియోలోని ప్రతి ఒక్కరినీ గుర్తించి, పోక్సో చట్టం కింద విచారించాలి, న్యాయం త్వరితగతిన జరగాలి. ఒకవేళ ఈ ఘటన సెప్టెంబర్ 19న జరిగి ఉంటే, నిందితులు ఇంకా ఎందుకు జైలులో లేరు?' అని ఆయన ప్రశ్నించారు. సాయంత్రం 7 గంటలకు బహిరంగ రహదారిపై ఒక అమ్మాయి ఎందుకు సురక్షితంగా లేదో బిహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని రాహుల్‌గాంధీ అడిగారు.

# ఢిల్లీలో దారుణం..

**ఆరో తరగతి బాలికను బంధించి అత్యాచారం చేసిన టైలర్**



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన జరిగింది. ఆరో తరగతి చదివే బాలికను బంధించిన ఒక టైలర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఢిల్లీ, సదర్ బజార్‌లో ఈ నెల 16న రాత్రి 11.00 గంటలకు జరిగింది. ఈ ప్రాంతంలో కుటుంబంతో కలిసి ఉంటున్న ఒక బాలిక ఆరో తరగతి చదువుతోంది. సెప్టెంబర్ 16న రాత్రి 11.00 గంటలకు స్కూల్‌కు అవసరమైన కొన్ని వస్తువులు కొనేందుకు ఆ బాలిక బయటకు వెళ్లింది. బాలిక వెళ్లే దారిలో ఒక టైలరింగ్ షాపు ఉంది. బాలిక ఒంటరిగా ఉండటం గమనించి ఆ షాపు ఓనర్ కం టైలర్ అయిన మక్సూద్.. బాలికకు మాయమాటలు చెప్పాడు. తన షాపులోకి రమ్మన్నాడు. షాపులోకి వచ్చిన బాలికపై మక్సూద్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక షాపు నుంచి ఇంటికి వచ్చిన బాలిక కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. దీంతో వారు సదర్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎఫ్ఐ నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు మక్సూద్‌ను అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ జరుగుతోందని, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని పోలీసులు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (ఎల్ఏ) శాఖ
జిల్లా కలెక్టర్ :: మహబూబ్‌నగర్

**ఫారం-VII**

**డిక్లరేషన్**

(రూల్-25 యొక్క సబ్ రూల్ (1) మరియు 2013 నాటి యాక్ట్-30 యొక్క సెక్షన్ 19 (1) చూడండి)

**No. Rev/G1/LAG/0008/2026-G-Section** **తేదీ: 03.09.2026**

మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 44వ పంపిణీ కాలువ తవ్వకం అనే ప్రజా ప్రయోజనం కోసం, మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, చిల్వేరు గ్రామంలో మొత్తం **ఎకరాలు 8.18 1/2 గుంటల** భూమి అవసరమని కలెక్టర్‌కు తోచింది.

కాబట్టి, మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, చిల్వేరు గ్రామంలో పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం సేకరించబడుతున్న ప్రామాణిక కొలత ప్రకారం దాదాపు **ఎకరాలు 8.18 1/2 గుంటల** భూమి యొక్క పూర్తి వివరాలు ఈ క్రింద విధంగా ఉన్నాయని ప్రకటించడమైనది.

గ్రామం : చిల్వేరు మండల్ : మిడ్జిల్ జిల్లా : మహబూబ్‌నగర్

| క్ర.సం. | సర్వే నం. | మెట్ట/తరి/మాగాణి | భూమి రకం | సేకరించవలసిన విస్తీర్ణం (ఎ.గుంటలు) | ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 809 | మెట్ట | పట్టా | 0.12 | జక్కా చిన్నా మల్లయ్య S/o బీరయ్య | - | - | - | - | - | - |
| 2 | 804 | మెట్ట | పట్టా | 0.16 | 1) యెల్మెటి విజయ కుమార్ S/o లక్ష్మ య్య 2) యెల్మెటి నవీన్ కుమార్ S/o లక్ష్మ య్య | - | - | - | - | - | - |
| 3 | 804 | మెట్ట | పట్టా | 0.20 | జక్కా పెద్ద మల్లయ్య S/o బీరయ్య | - | - | - | - | - | - |
| 4 | 26 | మెట్ట | పట్టా | 0.14 | జక్కా నాగరాజు S/o బాల్ బీరయ్య | - | - | - | - | - | - |
| 5 | 23 | మెట్ట | పట్టా | 0.08 | గంజికంటి కృష్ణయ్య S/o పెద్ద జంగయ్య | - | - | - | - | - | - |
| 6 | 23 | మెట్ట | పట్టా | 0.07 | బెల్లె మల్లేష్ S/o అజి మల్లయ్య | - | - | - | - | - | - |
| 7 | 23 | మెట్ట | పట్టా | 0.06 | 1) గంజికంటి శ్రీను S/o లక్ష్మ య్య 2)గంజికంటి వెంకట స్వామి S/o లక్ష్మ య్య | - | - | - | - | - | - |
| 8 | 23 | మెట్ట | పట్టా | 0.14 | గంజికంటి వెంకట స్వామి S/o లక్ష్మ య్య | - | - | - | - | - | - |
| 9 | 23 | మెట్ట | పట్టా | 0.05 | చీకొందర రాజు S/o బాల కృష్ణయ్య | - | - | - | - | - | - |
| 10 | 23 | మెట్ట | పట్టా | 0.05 | చికోంద్రా మల్లయ్య S/o బాల కృష్ణయ్య | - | - | - | - | - | - |
| 11 | 92 | మెట్ట | పట్టా | 0.00 1/2 | అంబటి ప్రీదీప్ కుమార్ S/o అంబటి రాజిరెడ్డి | - | - | - | - | - | - |
| 12 | 35 | మెట్ట | పట్టా | 0.15 | అంబటి జోజి రెడ్డి S/o అంబటి అర్లరెడ్డి | - | - | - | - | - | - |
| 13 | 35 | మెట్ట | పట్టా | 0.21 | 1) అంబటి రాజు S/o అంబటి అర్లరెడ్డి 2) అంబటి చిన్నపు రెడ్డి S/o అంబటి అర్లరెడ్డి | - | - | - | - | - | - |
| 14 | 35 | మెట్ట | పట్టా | 0.26 | అంబటి చిన్నపు రెడ్డి S/o అంబటి అర్లరెడ్డి | - | - | - | - | - | - |
| 15 | 35 | మెట్ట | పట్టా | 0.35 | అంబటి జోసప్ రెడ్డి S/o అంబటి రాజిరెడ్డి | - | - | - | - | - | - |
| 16 | 36 | మెట్ట | పట్టా | 0.02 | వేకల మెయిలర్ S/o కథల్ | - | - | - | - | - | - |
| 17 | 36 | మెట్ట | పట్టా | 0.02 | వేకల కోమలయ్య S/o కథల్ | - | - | - | - | - | - |
| 18 | 37 | మెట్ట | పట్టా | 0.04 | అంబటి ప్రీదీప్ కుమార్ S/o అంబటి రాజిరెడ్డి | - | - | - | - | - | - |
| 19 | 37 | మెట్ట | పట్టా | 0.26 | అంబటి ప్రవీణ్ కుమార్ రెడ్డి S/o చిన్నపు రెడ్డి | - | - | - | - | - | - |
| 20 | 37 | మెట్ట | పట్టా | 0.21 | వెడ్డె వెంకట గౌడ్ S/o M.శివయ్య | - | - | - | - | - | - |
| 21 | 548 | మెట్ట | పట్టా | 0.10 | బి. మల్లేష్ S/o నర్సింహులు | - | - | - | - | - | - |
| 22 | 533 | మెట్ట | పట్టా | 0.09 | 1) పి. ధయాకర్ S/o శంకరయ్య 2) పి. బాలస్వామి S/o శంకరయ్య 3) పెద్దకురువ శివుడు S/o పెద్ద మల్లయ్య 4) పి.చిన్నా వెంకటయ్య S/o చెనయ్య 5) ఎ. జగదీశ్వర్ S/o లక్ష్మ య్య | - | - | - | - | - | - |
| 23 | 533 | మెట్ట | పట్టా | 0.11 | బైగారి జంగయ్య S/o పెద్ద లక్ష్మయ్య | - | - | - | - | - | - |
| 24 | 500 | మెట్ట | పట్టా | 0.15 | పి. విజయ లక్ష్మి W/o గోవిందు రావు | - | - | - | - | - | - |
| 25 | 470 | మెట్ట | పట్టా | 0.06 | బి. ప్రసాద్ బి. కృష్ణయ్య | - | - | - | - | - | - |
| 26 | 470 | మెట్ట | పట్టా | 0.05 | బి. అలివెల W/o కృష్ణయ్య | - | - | - | - | - | - |
| 27 | 470 | మెట్ట | పట్టా | 0.01 | బి. నాగులయ్య S/o మాసయ్య | - | - | - | - | - | - |
| 28 | 415 | మెట్ట | పట్టా | 0.13 | మాణిక్య రావు S/o గోవిందా రాజు రావు | - | - | - | - | - | - |
| 29 | 414 | మెట్ట | పట్టా | 0.09 | మాణిక్య రావు S/o గోవిందా రాజు రావు | - | - | - | - | - | - |
| | | మొత్తం : 8.18 1/2 | | | | | | | | | |

2013 నాటి చట్టం నెం. 30లోని సెక్షన్ 15 ప్రకారం ఆసక్తిగల వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత, తగిన విచారణ జరిపిన పిమ్మట ఈ ప్రకటన చేయబడింది. భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలకూ పునరావసం కల్పించాల్సిన అవసరం లేదు.

సదరు భూమి కింద లేదా ఆ భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం కింద ఉన్న బొగ్గు, ఇనుప ఖనిజం, స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు, అయితే, ఏ ప్రయోజనం కోసం భూమిని సేకరిస్తున్నారో ఆ ప్రయోజనం కోసం ప్రాజెక్ట్ నిర్మాణ దవలో తొవ్వాల్సిన, తొలగించాల్సిన లేదా ఉపయోగించాల్సిన గనులు లేదా ఖనిజాల భాగాలు లేదా అవసరంలేని భాగాలు మినహాయించబడతాయి.

భూమి యొక్క ప్రణాళికను మహబూబ్‌నగర్‌లోని ఇరిగేషన్ ప్రాజెక్ట్ యూనిట్-II, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R కార్యాలయంలో ఏ పనిదినంలోనైనా పరిశీలించవచ్చు,.

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ ఆర్&ఆర్ యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్టు మహబూబ్‌నగర్

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహబూబ్‌నగర్

సం/- ఖుష్బూ గుప్తా,IAS జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్

DIPR RO NO. 893/LA/PP/Advt/Pub/2026-27

# ధన ప్రభావమే ఎన్నికలను శాసిస్తోంది

- డియుఎస్‌యు ఎన్నికల్లో ఎబివిపి సాధించిన విజయం, ప్రచారకర్తలు విలాసవంతమైన కార్లలో తిరగడమే నిదర్శనం
- 'కాక్రోచ్ జనతా పార్టీ' కన్వీనర్ అభిజీత్ దీప్కే



**ఛత్రపతి సంభాజీనగర్ :** భారత్‌లో ఎన్నికలను డబ్బు ప్రభావమే శాసిస్తుందని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (డియుఎస్‌యు) ఎన్నికల్లో ఎబివిపి సాధించిన విజయాన్ని, ప్రచారకర్తలు విలాసవంతమైన కార్లలో తిరగడాన్ని ఆయన దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. సిజెపి నేతృత్వంలో జెన్ జీ చేపట్టిన నిరసనల అనంతరం జరిగిన డియుఎస్‌యు ఎన్నికల్లో, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనుబంధ సంస్థ ఎబివిపి, కేంద్ర ప్యానెల్‌లోని నాలుగు స్థానాలకు గాను మూడింటిని గెలుచుకుంది. కాగా, డియుఎస్‌యు ఎన్నికలపై ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడిన దీప్కే, 'ఎన్నికల్లో డబ్బు మాత్రమే పనిచేస్తుంది, వేరే ఏదీ కాదు. డియులో ప్రచారం చేసేవారు కోట్ల రూపాయల విలువైన రోల్స్ రాయిస్ కార్లలో వస్తారు. ఆడి, బిఎండబ్ల్యు వంటి కార్లలో వస్తారు. కాబట్టి అక్కడ డబ్బు ప్రభావమే ఉంటుంది' అని అన్నారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం నిర్దిష్ట భావజాలం కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యతనిస్తోందన్న కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో దీప్కే ఏకీభవించారు. 'అమరావతి సమీపంలోని వార్ధాలో ఉన్న 'మహాత్మా గాంధీ అంతర్జాతీయ హిందీ విశ్వవిద్యాలయం' వైస్ ఛాన్సలర్ కుముద్ శర్మ ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగినవారని నేను గమనించాను. ఆమె విసిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి 50 మందికి పైగా విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి' అని ఆయన ఆరోపించారు. 'విద్యార్థులు ఏదైనా విషయంపై నిరసన తెలిపితే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. కానీ ఎబివిపి ఏదైనా విషయాన్ని వ్యతిరేకించినా లేదా గేటుకు తాళం వేసినా వారిపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయరు. ఆ భావజాలాన్ని వ్యతిరేకించే దళిత, ఆదివాసీ విద్యార్థులపై మాత్రమే కేసులు పెడతారు. విద్యాసంస్థలను (యూనివర్సిటీలను) ఆర్ఎస్ఎస్ శాఖలుగా మార్చడానికి ఇది ఒక ప్రణాళిక' అని దీప్కే విమర్శించారు.
విద్యా వ్యవస్థపై విద్యార్థులకు నమ్మకం సన్నగిల్లుతోందని కూడా సిజెపి వ్యవస్థాపకుడు పేర్కొన్నారు. 'అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఎంపిఎస్‌సి చైర్మన్ వివేక్ భిమాన్వార్ రాజీనామా చేయాలని మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపిఎస్‌సి ) అభ్యర్థులు చాలా రోజులుగా డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారు. పరీక్షా విధానంపై విద్యార్థులకు నమ్మకం పోయింది. భిమాన్వార్ రాజీనామా చేసే వరకు పరీక్షలు పారదర్శకంగా జరుగుతాయని విద్యార్థులు ఎలా నమ్మగలరు? అని ఆయన ప్రశ్నించారు. ఎంపిఎస్‌సి అభ్యర్థులతో కలిసి సిజెపి త్వరలో 'భీమాన్వార్ రాజీనామా చేయాలి' అనే ఆన్‌లైన్ ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు దీప్కే తెలిపారు. గత వారం ఐఐటి బాంబే విద్యార్థి ఆత్మహత్య ఘటనపై స్పందిస్తూ, పరీక్షలో కాపీ కొడుతూ పట్టుబడ్డాడన్న కారణంతో ఆత్మహత్యను సమర్థించలేమని దీప్కే అన్నారు. ఐఐటి బాంబేలో జరిగిన ఆత్మహత్య ఘటన బాధాకరమని, విద్యా వ్యవస్థపై విద్యార్థులకు నమ్మకం పోవడమే దీనికి కారణమన్నారు. వెనుకబడిన ప్రాంతాలతో పాటు పెద్ద నగరాల్లోనూ పిల్లలు చనిపోతున్నారని, తమకు అండగా ఎవరూ లేరని భావించడం వల్లే వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని దీప్కే పేర్కొన్నారు. 'కాపీ కొడుతూ పట్టుబడినంత మాత్రాన ఆత్మహత్యను సమర్థించలేం. అవినీతిలో పట్టుబడిన మంత్రి గానీ, బ్యాంకును దోచుకుని పారిపోయిన వ్యాపారవేత్త గానీ ఆత్మహత్య చేసుకోవడం ఎప్పుడైనా విన్నామా? ఇక్కడ మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ చాలా ముఖ్యం. ఆత్మహత్య చేసుకునేంత పెద్ద తప్పేమీ అది కాదు' అని ఆయన అన్నారు.

# అక్టోబరు 20 నుండి అమలులోకి భారత్–న్యూజిలాండ్ వాణిజ్య ఒప్పందం



**న్యూఢిల్లీ:** భారత్–న్యూజిలాండ్ మధ్య వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) దసరా పర్వదినం సందర్భంగా అక్టోబరు 20వ తేదీ నుండి అమలులోకి వస్తుందని కేంద్ర వాణిజ్య–పరిశ్రమల శాఖామంత్రి పీయూశ్ గోయ ల్ చెప్పారు. ఏప్రిల్ 27వ తేదీన రెండు దేశాల మధ్యా ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయని, భారత్ నుండి న్యూజిలాండ్‌కు నూటికి నూరుశాతం సుంకాలు లేకుండా వస్తువులను ఎగుమతి చేయడానికి ఈ ఒప్పందంలో వీలు కల్పించామని న్యూఢిల్లీలో సోమవారం పాత్రికేయులకు గోయల్ చెప్పారు.
న్యూజిలాండ్ నుండి భారత్‌కు రాబోయే 15 సంవత్సరాలలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు సమకూరేందుకు కూడా ఈ ఒప్పందంలో నిబంధనలు ఉన్నాయని చెప్పారు. ప్రపంచదేశాలతో భారతదేశం చేసుకున్న ద్వైపాక్షిక ఆర్థిక ఒప్పందాలలో ఒక ముఖ్యమైన మైలురాయిగా ఈ ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళుతున్నట్లు చెప్పారు.
ఇరుదేశాలమధ్యా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలలో ఉమ్మడి నిబద్ధతకు ఈ ఒప్పందం ఒక చిహ్నమని చెప్పారు. రెండు దేశాలమధ్యా వ్యవసాయ ఉత్పాదకత భాగస్వామ్యం కూడా ఈ ఒప్పందం ద్వారా ఏర్పడిందని, దీనివల్ల భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూ జిలాండ్ సాంకేతికత ద్వారా ఎదుర్కోగలుగుతామని చెప్పారు.
ప్రస్తుతం భారత్ నుండి ఎగుమతయ్యే కీలకమైన వస్తువులపై న్యూజిలాండ్ గరిష్ఠస్థాయిలో 10 శాతం సుంకాలను వసూలు చేస్తోంది. సిరామిక్స్, కార్పెట్లు ,ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలపై కూడా పదిశాతం సుంకాలు వసూలు చేస్తోంది.ఐతే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందంలోని నిబంధనల ప్రకారం భారతదేశ ప్రజలకు,దేశీయ వ్యాపారుకు తక్షణ ప్రయోజనాలు చేకూర్చడమే ప్రాధాన్యత కావాలని గోయల్ చెప్పారు. ఈ రెండు దేశాల పరస్పర ప్రయోజనాలకు ఈ ఎఫ్‌టిఏ బలమైన పునాదులు వేయాలని,లోతైన,క్రియాశీల సంబంధాలు,ఆర్థికభాగస్వామ్యం బలపడాలని అన్నారు. కాగా పాడి పరిశ్రమ,ఉల్లిపాయలు, శనగలు, బఠానీ,మొక్కజొన్న,బాదం,కృత్రిమ తేనె,చక్కెర వంటి ఆహార వస్తువులను వాణిజ్య ఒప్పందం నుండి మినహాయించినట్లు గోయల్ చెప్పారు. సుంకాలు లేకుండా భారతదేశ ఉత్పత్తులు తమ దేశంలోకి ప్రవేశించడంవల్ల వెల్లింగ్టన్ మార్కెట్‌లో పోటీ దేశాల నుండి ప్రయోజనం చేకూరుతుందన్నారు.20 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐ లభిస్తుందన్న నిబద్ధతవల్ల మనదేశంలో అనేక తయారీరంగ సంస్థలకు,మూలధనం,సాంకేతికత సమకూరుతుందన్నారు. న్యూజిలాండ్ కంపెనీలు కూడా భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆకర్షితులవుతాయన్నారు. ఈ రెండు దేశాలమధ్యా భాగస్వామ్యాన్ని పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామన్నారు.
న్యూజిలాండ్ వాణిజ్యశాఖామంత్రి టాడ్ మెక్‌క్లే మాట్లాడుతూ, ఈ ఎఫ్‌టిఏ ఒక అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడుకున్నదని ప్రశంసిస్తూ,రెండు దేశాల పౌరులకు గణనీయమైన ప్రయోజనాలు చేకూరుస్తుందని చెప్పారు.ప్రపంచంలో పరిస్థితులు అనిశ్చితంగా ఉన్న సమయంలో ఈ ఒప్పందం రెండు దేశాల వ్యాపార వర్గాలలో విశ్వాసం నింపుతుందన్నారు.

# మమత పార్టీ కొత్త ఎన్నికల చిహ్నం ఆవిష్కరణ




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తరువాత తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) లో చీలక ఏర్పడింది. దీంతో ఎన్నికల సంఘం ఆ పార్టీ గుర్తును స్తంభింప చేసింది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గం సోమవారం తమ తాత్కాలిక ఎన్నికల చిహ్నమైన ఫుట్‌బాల్ ఆటగాడితో కూడిన కొత్త లోగోను ఆవిష్కరించి, దానిని ప్రచారం చేయాలని తమ నాయకులను, ఎన్నికైన ప్రతినిధులను కోరింది. ఈ లోగోలో మధ్యలో ఫుట్‌బాల్ ఆటగాడు ఉండగా, నీలి రంగు నేపథ్యంపై తెల్ల రంగులో 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పదాలు దాని చుట్టూ ఉన్నాయి. ఈ డిజైన్‌లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులను కూడా పొందుపరిచారు. పార్టీ నియంత్రణపై అంతర్గత వివాదం తీవ్రమవుతున్న నేపథ్యంలో, 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరును, దానికి కేటాయించిన పూలుగడ్డి చిహ్నం వాడకాన్ని ఎన్నికల సంఘం నిలిపివేసిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటు చేసుకుంది. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం తదనంతరం రెండు వర్గాలకు వేర్వేరు తాత్కాలిక గుర్తింపు చిహ్నాలను కేటాయించింది. మమతా వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్', ఫుట్‌బాల్ ఆటగాడి గుర్తును కేటాయించగా, అరూప్ రాయ్ నేతృత్వంలోని ప్రత్యర్థి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్', 'ఎన్వలప్' గుర్తును కేటాయించింది. నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికలకు కేవలం పక్షం రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున, ఓటర్లు సాంప్రదాయకంగా తృణమూల్ కాంగ్రెస్‌తో ముడిపెట్టిన రాజకీయ గుర్తింపుతో ఈ కొత్త గుర్తును అనుసంధానించుకునేలా చూడాలని మమతా శిబిరం ప్రయత్నిస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, పార్టీ కార్యకర్తలు, నాయకులు, కార్మికులు, ఎన్నికైన ప్రతినిధులు అందరూ తమ తమ వేదికలను ఉపయోగించి లోగోను ప్రచారం చేయాలని, ఓటర్లకు కొత్త గుర్తును పరిచయం చేయాలని కోరారు. మమతా శిబిరానికి చెందిన నాయకులు సోమవారం మధ్యాహ్నం నుంచి సోషల్ మీడియాలో లోగోను పోస్ట్ చేయడం ప్రారంభించారు. సెప్టెంబర్ 17న, తృణమూల్ కాంగ్రెస్‌పై పరస్పర వాదనలను విచారిస్తున్నప్పుడు, వివాదంపై సవివరమైన తీర్పు వెలువడే వరకు ఏ వర్గమూ పార్టీ ప్రస్తుత పేరు, గుర్తును ఉపయోగించడానికి అనుమతించబోమని ఎన్నికల సంఘం ఆదేశించింది.

# 'వందేమాతరం'పై కర్ణాటక అసెంబ్లీలో మళ్లీ రగడ

**బెంగళూరు:** వందేమాతరంపై కర్ణాటక అసెంబ్లీ, విధానసభలో సోమవారం కాసేపు రచ్చ జరిగింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, పశ్చిమ కనుమలకు సంబంధించి కస్తూరిరంగన్ రిపోర్టుపై చర్చించడానికి కర్ణాటక ప్రభుత్వం మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోంది. సోమవారం అసెంబ్లీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందు నాయకులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అయితే, రెండు చరణాల తర్వాత కాంగ్రెస్ నేతలు పాడడం ఆపేశారు. కానీ, బిజెపి నేతలు మాత్రం మొత్తం చరణాలు పాడారు. కాంగ్రెస్ నాయకులు రెండు చరణాలే పాడడంతో బిజెపి నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తర్వాత వివిధ ప్రముఖులకు స్పీకర్ జిఎస్ పాటిల్ సంతాపం తెలిపారు. గత నెల 27న కన్నుమూసిన ఎమ్మెల్యే ఆర్‌బి శిరియణ్ణవర్‌కు ముఖ్యమంత్రి డికె శివకుమార్ నివాళి అర్పించారు. విధానసభలోనూ వందేమాతరంపై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇక్కడ కూడా అధికార పార్టీ నేతలు వందేమాతరంలోని రెండు చరణాలే పాడగా.. ప్రతిపక్ష బిజెపి నేతలు మొత్తం చరణాలు ఆలపించారు. అధికార పార్టీ నేతలు రెండు చరణాలే పాడడంపై బిజెపి నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండలి చైర్మన్ సలీం అహ్మద్.. రాజ్యాంగ పీఠికను చదువుతుండగానే బిజెపి నేతలు మిగతా చరణాలను పూర్తిగా పాడారు. పూర్తి గేయాన్ని ప్లే చేయనందుకు ప్రభుత్వంపై బిజెపినేతలు విమర్శలు చేశారు. కాగా.. తన అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని మొదటి రెండు చరణాలనే పాడాలని కర్ణాటక ప్రభుత్వం ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది.

# వీధి పశువుల నిర్వహణా బాధ్యత ఎవరిది?

- నిగ్గు తేల్చేందుకు సుప్రీం ప్రత్యేక ధర్మాసనం
- మేం చెయ్యలేమని తేల్చి చెప్పిన ఎన్‌హెచ్ఎఐ



**న్యూఢిల్లీ:** భారత జాతీయ రహదారులసంస్థ(ఎన్‌హెచ్ఎఐ) దాఖలు చేసిన ఒక పిటిషన్ విచారణ నిమిత్తం ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఎవరి అలనాపాలనా లేకుండా దేశవ్యాప్తంగా వీధుల్లో తిరిగే పశువులకు ఆశ్రయ కేంద్రాలను ఎన్‌హెచ్ఎఐ ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను సవాలు చేస్తూ ఆ సంస్థ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్,జస్టిస్ జోమాల్య బాగ్చి,జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట ఎన్‌హెచ్ఎఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనకు హాజరై, స్థానిక,జిల్లాస్థాయి యంత్రాంగాలు ఏర్పాటు చేయాల్సిన ఆశ్రయ కేంద్రాలను జాతీయ రహదారుల సంస్థ ఏ విధంగా ఏర్పాటు చేస్తుందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా తాము వీటిని ఏర్పాటు చేయాలంటే రూ.7000 కోట్లు ఖర్చుకాగలదని, ఈ ఖర్చు తాము భరించలేమని తెలియజేశారు. అందువల్ల ఈకేసు విచారణకు ఒక ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని మెహతా కోరారు. ఆయన చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది.
దేశవ్యాప్తంగా వీధుల్లో తిరిగే పశువులకు ఆశ్రయ కేంద్రాలు నిర్మించాలని జస్టిస్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా,జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం గతంలో ఎన్‌హెచ్ఎఐకి మార్గదర్శకాలు జారీ చేసింది.ఈ ఆదేశాలను ఆ సంస్థ సవాలు చేసింది. వీధి కుక్కలకు సంబంధించి కూడా ఒక అంశం ఉందని,దానిపై కూడా ఎన్‌హెచ్ఎఐ తరపున తాను ఒక అభ్యర్థన దాఖలు చేస్తున్నానని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు.భారత ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు జారీచేస్తే తప్ప ఈ విషయంలో విచారణకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం లేదని తుషార్ మెహతా చెప్పడంతో, ''మేం ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేస్తున్నాం'' అని ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారు. వీధి కుక్కలు,పశువులు,వాటి నిర్వహణకు సంబంధించిన చర్యలు,వివిధ ప్రభుత్వ సంస్థలకు ఉన్న బాధ్యతలు అనే విషయంపై విచారణ జరుగుతున్న సమయంలో తుషార్ మెహతా విజ్ఞప్తితో ఈ ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు నిర్ణయాన్ని సిజెఐ ప్రకటించారు.

# రేపటి నుంచి ఐరాస జనరల్ అసెంబ్లీ మీట్

- నేడు అమెరికాకు పెజెష్కియన్
- రేపు జనరల్ అసెంబ్లీలో ప్రసంగం
- ఊపిరిసలపని షెడ్యూలులో ట్రంప్



**టెహ్రాన్:** ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రపంచ ముఖ్య నాయకుల ప్రసంగాలు,క్రియాశీల కార్యకలాపాలు సెప్టెంబరు 22 నుండి వారం రోజులు కొనసాగుతాయి. ప్రపంచ దేశాల అధినేతలు న్యూయార్క్ చేరుకుంటున్నారు. 130కి పైగా దేశాల అధిపతులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. డోనాల్డ్ ట్రంప్ కూడా రాబోయే వారం రోజులపాటు అనేకమంది ప్రముఖులతో సమావేశాలు,ప్రసంగాలతో చాలా బిజీ షెడ్యూలుతో గడుపుతారు.సోమవారం సాయంత్రానికే ట్రంప్ న్యూయార్క్‌కు చేరుకున్నారు. ట్రంప్ టవర్‌లో బసచేసి అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.మంగళవారంనాడు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఆయన సమావేశమవుతున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా ఈ సమావేశాల్లో పాల్గొంటారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మంగళవారం న్యూయార్క్ నగరానికి బయలుదేరుతున్నారు. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతల తరుణంలో పెజెష్కియన్ జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా అమెరికా ప్రభుత్వం వీసా మంజూరు చేసింది. జనరల్ అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబరు 8వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ 81వ సెషన్‌లో కీలక సమావేశాల్లో ముఖ్యదేశాల నాయకులు సెప్టెంబరు 22 నుండి 28వ తేదీ వరకూ ప్రధాన ప్రసంగాలు చేస్తారు. ఉన్నతస్థాయి చర్చలు వచ్చే సోమవారంతో ముగుస్తాయి. ప్రతిదేశానికి ఈ సమావేశాల్లో ప్రసంగాలు చేసేందుకు,కీలకమైన సమస్యలు ప్రస్తావించేందుకు అవకాశం ఇస్తారు. పెజెష్కియన్ ఈ సమావేశంలో నిర్ణీత ప్రకారం సెప్టెంబరు 23న ప్రసంగిస్తారని ఇరాన్ అధ్యక్ష భవనం ప్రజాసంబంధాల అధికారి హబీబుల్లా అబ్బాసీ చెప్పారు. అనేక దేశాల నాయకులతో పాటు ఇరాన్ జాతీయ ప్రముఖులు,అమెరికా బుద్ధిజీవులతో కూడా ఆయన సమావేశాలు నిర్వహిస్తారు.

# కొత్త ఆయుధాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తాం: ఇరాన్

- హోర్ముజ్‌లో అమెరికా ఎంక్యూ–1 డ్రోన్ కూల్చివేత
- మా లక్ష్యం అమెరికా కాదు, సౌదీ: హౌతీల ప్రకటన



**దుబాయ్:** ఇరాన్‌పై మళ్ళీ దాడి చేస్తే కొత్త లక్ష్యాలను దెబ్బతీస్తామని,సరికొత్త ఆయుధాలతో దాడులు చేస్తామని ఐఆర్‌జిసి అమెరికాకు,పశ్చిమాసియాలో దాని ప్రాంతీయ మిత్రదేశాలకు హెచ్చరించింది.సుదీర్ఘ యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది.ఇరాన్‌పై కొత్త చర్యలకు అమెరికా సిద్ధపడుతోందని దేశ సైనిక కేంద్ర కమాండ్ చెప్పిందని టెహ్రాన్‌లో ప్రభుత్వ టెలివిజన్ ప్రకటించింది. తమ సామర్థ్యంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తామని ప్రకటించింది.మా లక్ష్యాలు మునుపటిలాగా ఉండబోవని,ఇప్పటివరకూ దాడి చేయని కొత్త లక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొంది.ఖచ్చితంగా తమ వ్యూహంలో కొత్త వ్యూహాలు అమలు చేస్తామని తెలియజేసింది.గత నెల చివరిలో ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ ఇటీవల రెండు దేశాలమధ్యా యుద్ధం సద్దుమణిగింది.ఐనప్పటికీ అడపాదడపా హోర్ముజ్ జలసంధిలో దాడులు జరుగుతున్నాయి. ఆధిపత్యంకోసం హోర్ముజ్ జలసంధిలో పరస్పర దిగ్బంధనాలు కొనసాగుతున్నాయి. ఈ దశలో ఏడు షరతులు నెరవేర్చేవరకూ జలసంధిని తెరిచేదిలేదని ఇరాన్ మరోసారి ఉద్ఘాటించింది. అమెరికాకు చెందిన ఎంక్యూ–1 డ్రోన్‌ను హోర్ముజ్ జలసంధిలో కూల్చివేసినట్లు ఐఆర్‌జిసి సోమవారం ప్రకటించింది.అడ్వాన్స్‌డ్ ఏరోస్పేస్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ద్వారా కూల్చివేసినట్లు పేర్కొంది.ఆఫ్ఘనిస్థాన్ యుద్ధంలో 20,000 గంటలపాటు సేవలు అందించిన అత్యుత్తమైన ఎంక్యూ–9 రిటైరైన తర్వాత దానిస్థానంలో అంతకంటే ఉత్తమమైనదిగా ప్రకటించిన ఎంక్యూ–1 డ్రోన్లను సెంట్‌కామ్ రంగంలోకి దించింది. కానీ ఇప్పుడు ఆ డ్రోన్ నేల కూలింది. సెంట్‌కామ్ కూడా ప్రతీకార దాడులకు సిద్ధం అవుతోంది.ఒకవేళ అమెరికా గనుక తమ దేశంపై దాడులు ప్రారంభిస్తే కొత్త లక్ష్యాలపై దాడులతో ఊహించని దెబ్బతీస్తామని, మా రక్షణ విషయంలో గణనీయమైన మార్పులు చూస్తారని ఐఆర్‌జిసి దళాలు హెచ్చరించాయి. ఏడు నెలలుగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, రెండు దేశాల మధ్యా ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.ఐతే పూర్తిస్థాయి యుద్ధానికి వెళ్ళేందుకు రెండు దేశాలు ఇష్టపడటం లేదు. కాగా,పశ్చిమాసియాలో హౌతీలు పెద్దశక్తిగా ముందుకు రావడంతో శత్రువును దెబ్బతీసే విషయంలో ఐఆర్‌జిసి మరింత బలం పుంజుకుంది. యెమెన్‌లోని హౌతీలు సౌదీఅరేబియాను తీవ్ర నష్టం కలిగిస్తూ ఉండటం డోనాల్డ్ ట్రంప్‌కు సమస్యగా మారింది.ఐఆర్‌జిసి హెచ్చరికతోపాటు ఇరాన్ పాలకులు చర్చల పునరుద్ధరణకు ఏడు షరతులు తెరమీదకు తెచ్చారు.మరోవైపు ఈనెలాఖరున ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం,రెండు రోజుల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా పర్యటన వంటి ఊపిరి సలపని షెడ్యూలు మధ్య హౌతీల గురించి ట్రంప్ ఆలోచించలేని పరిస్థితి వచ్చింది. ఐతే అమెరికా వ్యవస్థలపై దాడులు చేయడం తమ లక్ష్యం కాదని,సౌదీ అరేబియాను దెబ్బతీయడం,యెమెన్‌లో దిగ్బంధనం తొలగించడం తమ ఉద్దేశమని అన్సరుల్లా హౌతీలు ఇప్పటికే ప్రకటించారు. కానీ సౌదీ చమురు ఎగుమతులను దెబ్బతీస్తూ, ఆ దేశ రాజధాని రియాద్ పైనే దెబ్బతీసేస్థాయికి రావడంతో పరిమితస్థాయిలో దాడులు చేసే విషయంపై ట్రంప్ యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది.ఐఆర్‌జిసి–హౌతీల మధ్య సన్నిహిత సమన్వయ సంబంధాలు ఉన్నాయి. దీంతో ట్రంప్ ఆందోళన చెందుతున్నారు. ఈ దశలో మళ్ళీ హోర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడులు జరుగుతున్నాయి.

# ఐసిసిపై ట్రంప్ ఆంక్షలు సిద్ధం!



**వాషింగ్టన్:** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి)పై ఆంక్షలు అమలు చేసేందుకు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసిందని సంబంధిత వర్గాలు చెప్పాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ నేరాలపైన,జాతి నిర్మూలన దాడులపైన ఐసిసి విచారణలు చేస్తుంది.ఇందులో భాగంగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ,రష్యా అధ్యక్షుడు పుతిన్‌లపై కూడా అరెస్టు వారెంట్లు గతంలో ఐసిసి జారీ చేసింది.ఇలాంటి వ్యవస్థపై ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలను సిద్ధం చేసిందని ఈ విషయంలో భాగస్వాములుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం మొదటి నుండీ ఐసిసి పట్ల ధిక్కార భావంతో ఉంది.ఐసిసిని బలహీనపరచేందుకు కృషి చేస్తోంది.ఇజ్రాయెల్ నాయకులపై అరెస్టు వారెంట్లను,గతంలో అఫ్గానిస్థాన్‌లో దాడులు చేసిన అమెరికా సైనికులపై విచారణల కేసులను ఉపసంహరించుకోవాలని ట్రంప్ యంత్రాంగం ఐసిసిపై ఒత్తిడి తీసుకువస్తోంది. ఐసిసిని ఏకాకిని చేయాలని అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఐసిసి నుండి వైదొలగాలని ఇతర దేశాలకు గతంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో పిలుపు ఇచ్చారు.పలువురు ఐసిసి న్యాయమూర్తులు,ప్రాసిక్యూటర్లపై కూడా అమెరికా ఆంక్షలు విధించింది.ఇప్పుడు ఏకమొత్తంగా ఐసిసిని లక్ష్యంగా చేసుకుని ఆంక్షలు విధించాలన్న ట్రంప్ యంత్రాంగం తీరు వల్ల ఐసిసి ఉనికికి,పని విధానానికి తీవ్ర హాని కలుగుతుంది.ట్రంప్ మొదటిసారి అధ్యక్షపదవి చేపట్టినప్పటినుండీ ఆయన ఐసిసిపై తీవ్ర వ్యతిరేకత కనబరుస్తూనే ఉన్నారు.ట్రంప్ మళ్ళీ అధికారంలోకి వచ్చాక ఆ ఆంక్షలు తెరమీదకు వచ్చాయి. గాజాలో ఘర్షణలు,మానవతా ఉల్లంఘనలకు సంబంధించిన నేరాలు,కేసులతోపాటు నెతన్యాహూపై అరెస్టు వారెంటు వంటి ఘటనలతో 2024లో ఐసిసిపై పూర్తి ఆంక్షలు విధించాలన్న ఆలోచనలు రూపుదిద్దుకున్నాయి.యుద్ధ నేరాలు,జాతి నిర్మూలన,మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు సంబంధించి విచారణలు చేయడానికి వీలుగా 2002లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఉనికిలోకి వచ్చింది.

## వాణిజ్యం,ఎఐ భద్రతపై
# చైనా–యుఎస్ ఉన్నతాధికారుల చర్చ



**న్యూయార్క్:** ప్రభుత్వ వ్యవస్థలను ప్రభావితం చేయగల కృత్రిమ మేధ భద్రతపై అమెరికా–చైనా ఉన్నతాధికారులు చర్చించారు. న్యూయార్క్‌లో ఈ సమావేశం జరిగింది.ఈ ఎఐ వ్యవస్థలకోసం ఒక కొత్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ సోమవారం పాత్రికేయులకు చెప్పారు. నిరంతర అనుసంధానానికి ఒక కమ్యూనికేషన్ వ్యవస్థను రెండు దేశాలు ఏర్పాటు చేసుకుంటాయి. చైనా ఉప ప్రధానమంత్రి హే లీఫెంగ్‌తో చర్చల అనంతరం బెస్సెంట్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎఐ సాంకేతికతలను నిరంతరాయంగా విస్తరించుకుంటూ పోవడం, కొత్త ఏరియాలలో నూతన ఆవిష్కరణలు,అనుసంధానాలతో వ్యాప్తి చెందడంపై నిపుణులు ప్రపంచవ్యాప్తంగా ఇటీవలికాలంలో తీవ్ర హెచ్చరికలు చేసిన తరుణంలో ఈ సంభాషణలు జరిగాయి. బుధవారం నుండి జిన్‌పింగ్ అమెరికా పర్యటన సమయంలో కూడా ఎఐ సాంకేతికత ప్రమాదాలు,భద్రతపై ప్రధానంగా చర్చలు జరుగుతాయి.కృత్రిమ మేధ నూతన సాంకేతికతలో అమెరికా–చైనా రెండు దేశాలు ఆధిపత్యస్థానంలో ఉన్నాయని, ఈ దశలో రహస్యాలు లేకుండా, వాస్తవాలను ఉన్నవి ఉన్నట్టుగా బాహాటంగా మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందని స్కాట్ బెస్సెంట్ వ్యాఖ్యానించారు.దీంతోపాటు బోర్డ్ ఆఫ్ ట్రేడ్ అని పిలిచే పటగికీ వస్తువులకు సంబంధించిన సుంకాలపై కూడా ఇరువురూ చర్చించారు.

## ఓటుహక్కు హరించే పద్ధతి
(మొదటి పేజీ తరువాయి)

అవుతున్న ఓటర్ల జాబితాలో దివంగత ఆర్థికవేత్త బిబెక్ దేబ్రాయ్ పేరు కనిపించడంపై వచ్చిన ఒక విమర్శనాత్మక పోస్టుకు స్పందిస్తూ, 'నిజానికి ఇక్కడ జరుగుతున్నది భారతీయుల ఓటు హక్కును హరించే పద్ధతే' అని రమేశ్ అన్నారు. 'భారతీయుల ఓటు హక్కును హరించే పద్ధతి' అనే పదాలను నిలువుగా పోస్ట్ చేశారు, దానివల్ల ప్రతి పదం మొదటి అక్షరం కలిపి 'మోదీ' అని చదవగలిగేలా ఉంది. కాగా, ఎక్స్‌లో తన వివరణాత్మక ప్రకటనలో ఖర్గే 'సర్ అనేది ఓట్ల దొంగతనానికి, ప్రజాస్వామ్యాన్ని కూల్చివేయడానికి బిజెపి ఉపయోగించే ఒక సాధనం మాత్రమే కాదు— ఇది ఒక లోపభూయిష్టమైన ప్రక్రియ, ఇది ఫ్రాంకెన్‌స్టీన్ రాక్షసుడిగా మారి, ఇప్పుడు తన సొంత ప్రజలనే బంధిస్తోంది. బిహార్ నుంచి సర్‌గా ప్రారంభమైనది ఇప్పుడు ఢిల్లీ తలుపు తట్టింది. బహుశా ఇప్పుడు అధికారంలో ఉన్నవారు కాంగ్రెస్ మొదటి రోజు నుండే ఈ మొత్తం ప్రక్రియను ఎందుకు లోపభూయిష్టమైనదిగా పిలుస్తోందో గ్రహించి ఉంటారు' అని ఖర్గే తన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. బిజెపి అత్యంత సీనియర్ నాయకుడు లాల్ కృష్ణ అద్వానీజీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి), రాజ్యసభ ఎంపి, మాజీ కేంద్ర మంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఇతరులతో సహా పలువురు ప్రముఖ బిజెపి నాయకులకు ఇప్పుడు నోటీసులు జారీ చేయబడ్డాయి అని ఖర్గే తెలిపారు. 'బెంగాల్‌లో, ఓటు వేయకుండా నిరోధించడానికి పేర్లు తొలగించబడిన వారిలో, ఇప్పటివరకు తీర్పు వెలువడిన కేసులలో 93 శాతం మంది తమ అప్పీళ్లను గెలుచుకున్నారు. అంటే, 1,13,943 మందిని ఓటర్ల జాబితాలో తిరిగి చేర్చనున్నారు' అని ఆయన అన్నారు. ఏ ప్రాతిపదికన వారి ఓటు హక్కును హరించారు అని కాంగ్రెస్ అధినేత ప్రశ్నించారు. భారతదేశంలోని సార్వత్రిక వయోజన ఓటు హక్కు విధానంలో ఇప్పుడు విఐపి ఓటర్లు, సాధారణ ఓటర్లు అనే ప్రత్యేక వర్గాలు ఉన్నాయా? ఇది 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే రాజ్యాంగ సూత్రానికి ఉల్లంఘన కాదా? అని ఖర్గే ప్రశ్నించారు. సర్ మొదటి మూడు దశల్లో, 31 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో 13.8 కోట్ల మంది ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించబడ్డాయని, అంటే మొత్తం 94.78 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 14.61 శాతం మందిని తొలగించారని ఆయన పేర్కొన్నారు. కాగా సర్ 'షా ప్రేరేపిత తొలగింపు' అని, 'రాజ్యాంగంపై దాడి' అని కాంగ్రెస్ ఆరోపించింది.

## నిధులు విడుదల (మొదటి పేజీ తరువాయి)

సమకూర్చినట్టు మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఆయా గ్రామ పంచాయతీలకు తన వాటాను విడుదల చేయాలని మంత్రి సీతక్క ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగులు (మొదటి పేజీ తరువాయి)

కాలనీ, రాజరాజేంద్ర చౌరస్తా వద్ద ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారిని అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్ నాంపల్లిలోని ఎసిబి స్పెషల్ కోర్టు ముందు ప్రవేశపెడుతున్నామని కేసు దర్యాప్తులో ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.

## మళ్లీ బ్యాంకుల సమ్మె (మొదటి పేజీ తరువాయి)

యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. పనితీరు ఆధారిత ప్రోత్సాహకంలో మార్పులు చేయాలని కూడా వారు కోరుతున్నారు. దీనిని ఏకపక్షంగా, వివక్షాపూరితంగా సవరించారని వారు ఆరోపిస్తున్నారు. మెరుగైన పెన్షన్లు, పదవీ విరమణ చేసిన వారికి ఏకరీతి కరువు భత్యం ఫార్ములా, జాతీయ పెన్షన్ వ్యవస్థ స్థానంలో పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించడం, పెండింగ్‌లో ఉన్న సేవ. వేతన సంబంధిత సమస్యల పరిష్కారం వంటివి ఇతర డిమాండ్లలో ఉన్నాయి. సమ్మెకు ముందు, సెప్టెంబర్ 28 లోపు బ్రాంచ్‌లకు సంబంధించిన బ్యాంకింగ్ పనులను పూర్తి చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారులకు సూచించింది. సమ్మె కాలంలో అత్యవసర బ్యాంకింగ్ సేవలు సజావుగా సాగేలా చూసేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్‌బిఐ తెలిపింది.

## రూ.813 కోట్లు చెల్లించాలి
(మొదటి పేజీ తరువాయి)

చెల్లింపులపై జిల్లా కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రూ.813 కోట్లు చెల్లింపులకు పెండింగ్‌లో ఉండగా, ఇందులో రూ.502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, రూ.311 కోట్లు కలెక్టర్ల వద్ద ఉన్నట్లు వివరించారు.నిధులు విడుదలైన వెంటనే రైతులకు చెల్లింపులు జరగాలని మంత్రి ఆదేశించారు. వాస్తవ కారణాలతో చెల్లింపు సాధ్యం కాకపోతే ఆ వివరాలను స్పష్టంగా నమోదు చేసి నిధులను ప్రభుత్వానికి తిరిగి పంపాలని, నెలల తరబడి ఖాతాల్లో ఉంచవద్దని సూచించారు. కలెక్టర్లు స్వయంగా జోక్యం చేసుకుని రైతులతో సంప్రదింపులు జరపడంతో పాటు అవార్డుల ప్రక్రియను పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలి :** భూములు కోల్పోతున్న రైతులకు చట్టపరమైన నిబంధనలకు లోబడి సాధ్యమైనంత వరకు మార్కెట్ ధరలకు దగ్గరగా పరిహారం అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అవార్డు అనంతరం పరిహారం చెల్లింపులో జాప్యం జరిగితే నిబంధనల ప్రకారం రైతులకు వడ్డీ చెల్లించాలని ఆదేశించారు.కోర్టు కేసులు, యాజమాన్య వివాదాలతో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ కేసులను ప్రత్యేకంగా నమోదు చేసి, అడ్వొకేట్ జనరల్‌తో చర్చించి త్వరగా పరిష్కరించాలని సూచించారు.సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతుల కోసం 2026లో రూ.6 వేల కోట్లు అందిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులు నిధుల కొరతతో ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ నిధులను అదనంగా సమకూరుస్తున్నట్లు చెప్పారు.నల్గొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ తదితర జిల్లాల్లో భూసేకరణ పురోగతిని మంత్రి సమీక్షించారు. చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగం పూర్తయిన నేపథ్యంలో పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ చెల్లింపులకు సంబంధించిన కేసులు పూర్తిగా సిద్ధమైన తర్వాతే నిధులు కోరాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఖాతాల్లో నిరుపయోగంగా ఉండకుండా ఆర్థిక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించాలని ఆదేశించారు.

# ఎర్రవల్లిలో నాలుగో రోజూ సర్వే కొనసాగింపు

- భూ ఆధారాలతో సర్వేకు హాజరైన రైతులు
- సర్వేను పరిశీలించిన రీజినల్ డైరెక్టర్ సమీరా బేగం
- మళ్లీ 50 మంది రైతులకు నోటీసులు జారీ





**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో నాలుగో రోజు సర్వే కొనసాగింది. మాజీ సిఎం చంద్రశేఖర్‌రావు ఫామ్‌హౌస్‌కు ఆనుకుని ఉన్న ఈ వివాదాస్పద సర్వే నంబర్‌లోని 388.05 ఎకరాలలో సోమవారం సర్వే అధికారులు కొలతలు వేస్తుండగా, రీజినల్ డిస్ట్రిక్ డైరెక్టర్ సమీరా బేగం స్వయంగా సర్వేను పరిశీలించారు. సోమవారం సాయంత్రం మళ్లీ 50 మంది రైతులకు తహసీల్దార్ సరిత నోటీసులు జారీ చేశారు. గత మూడు రోజులుగా ఎర్రవల్లి, వర్దరాజ్‌పూర్, శివారువెంకటాపూర్ గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న 325 సర్వే నంబర్‌లో అసైన్డ్ భూమితో పాటు పాండురంగ చెరువు శిఖం, కట్టుకాలువలు, సాగుకు యోగ్యం కాని భూమికి హద్దులు గుర్తించారు. అందులో అసైన్డ్ పట్టాలు పొందిన భూములకు క్షేత్రస్థాయిలో హద్దులు ఏర్పాటు చేసిన అధికారులు ఆ భూమిలో యాజమాన్య పత్రాలు కలిగి ఉన్న ఎర్రవల్లి గ్రామానికి చెందిన 225 మంది రైతులకు గాను 100 రైతులకు శనివారం సాయంత్రం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద సాయంత్రం నోటీసులు జారి చేశారు. నోటీసులు అందుకున్న రైతులు సోమవారం వారు సాగు చేసుకున్న పోలాల వద్దకు వారి వద్ద ఉన్న భూ ఆధారిత పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పది గంటల వరకు రైతులు తమ వద్ద ఉన్న భూ పత్రాలతో వారు సాగు చేసుకున్న భూమి వద్దకు చేరుకున్నారు. నాలుగు బృందాలుగా ఏర్పడిన సర్వే బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో సర్వేనిర్వహిస్తూ ఏ రైతు ఆధీనంలో ఎంత భూమి ఉంది అన్న కోణంలో సర్వే చేస్తూ హద్దులు నిర్ణయిస్తూ, రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. అనంతరం రైతుల వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అయితే సర్వేలో ఏ రైతు ఆదీనంలో ఎంత అసైన్డ్ భూమి ఉందన్న సమాచారం మాత్రం అధికారులు ఇప్పుడే బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచుతున్నారు.

# పెరుగుతున్న భూ కమతాలు

(మొదటి పేజీ తరువాయి)

మొదలైంది. ఎవరు ఎంత భూమి కొన్నారో అన్నది ఇప్పుడు రాజకీయ నిబద్ధతకు, భవిష్యత్తు రాజకీయాలకు ఒక కొలబద్దగా మారింది. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని భూమి వ్యాపార వస్తువుగా మారింది. కేవలం సాగు చేసే రైతులు మాత్రమే భూమి కొనుగోలు చేసేవారు. తమకు అనుకూలమైన వ్యవసాయ భూమిని కొనుగోలు చేసేందుకు ఉత్సుకత చూపేవారు. అప్పో సప్పో చేసి భూమిని కొనుగోలు చేసుకుంటే కుటుంబం దానిపై ఆధారపడి బతకవచ్చునన్న అభిప్రాయం రైతుల్లో ఉండేది. ఇప్పుడు భూమి వ్యాపార వస్తువుగా మారింది. కొనుగోళ్లు, విక్రయాలు పెరిగాయి. ఒకప్పుడు రైతులు మాత్రమే కొనుగోలు చేసే భూమి ఇప్పుడు రైతులు కొనే పరిస్థితి లేదు. భూమి ధర పెరిగిందని రైతులు సంతోష పడే లోపే రైతుల నుంచి భూమి దూరమవుతుంది. ఎవరు భూమిపై ఆధారపడి జీవిస్తారో వారి చేతుల్లో నుంచి భూమి సంపన్న వర్గాల చేతుల్లోకి జారిపోతుంది. ఏ రైతు సాగు చేయడం ద్వారా ఒక ఎకరం కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఒక చోట అమ్ముకుని మరో చోట కొనడం తప్ప సంపాదనపై అధిక ధరల నేపథ్యంలో భూములు కొనుగోలు చేయలేకపోతున్నారు. ఇతరత్రా రాజకీయంగా, వ్యాపారపరంగా సంపాదించుకున్న వారు భూమిని కొనుగోలు చేసి తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. స్వాతంత్ర్యానికి ముందు తెలంగాణలో భూస్వాములు, జమీందార్లు, జాగీర్‌దార్ల చేతుల్లో వందల వేల ఎకరాల భూములు ఉండేవి. వారి పరిధిలోని ప్రజలు ఆ భూముల్లో పనిచేస్తూ కూలీలుగా, బానిసలుగా ఉండేవారు. ఇప్పుడు కూడా సగర్వంగా సాగు చేసిన రైతు ఈ భూ కమతాల్లో కాపాలదారుని గానో, పాలేరుగానో బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో భూ కమతాలకు వ్యతిరేకంగానే తెలంగాణలో సాయుధ పోరాటం సాగింది. ఇప్పుడు మళ్లీ గ్రామాల్లో భూ కమతాలు పెరగడం ద్వారా గ్రామాల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలను తమ గుప్పెట్లో పెట్టుకుని తమ భూమిని పరిరక్షించుకునేందుకు కొందరు గ్రామ రాజకీయాల్లో తలదూర్చి పెత్తందారి తనానికి తెర లేపుతున్నారు. భూ సీలింగ్ చట్టం ఏమైందో కానీ భూ కమతాలు మాత్రం పెద్ద సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. స్వయనా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక మంది ఇటీవల సంపాదించిన భూ వివరాలను వెల్లడించారు. అక్రమా, సక్రమమా అన్నది పక్కన పెడితే భూ చట్టాలను పాలకులు ఎందుకు అమలు చేయడం లేదన్నది ప్రజల ప్రశ్న. వ్యవసాయ రంగంపై ఇప్పటికీ 50 శాతానికి పైబడి ప్రజలు జీవిస్తున్న ఈ దేశంలో వ్యవసాయ భూమి సంపన్నుల చేతుల్లోకి వెళితే ఈ 50 శాతం మంది భవితవ్యం ఏమిటన్న దానికి పాలకులే సమాధానం చెప్పాల్సి ఉంది. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అన్న తేడా తప్ప రెండు దశాబ్దాలుగా భూమిని కొనుగోలు చేయడంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోటీపడుతున్నారు. వామపక్ష నేతలను పక్కన పెడితే తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులకు సంబంధించి కనీసం 50 ఎకరాల భూమి లేని ప్రజాప్రతినిధి లేరంటే అతిశయోక్తి కాదు. గడిచిన మూడేళ్ల కాలంలోనే పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు భూమిని కొనుగోలు చేసి భూ కమతాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు నేరుగా తమ పేరుతోనే భూములు కొనుగోలు చేస్తుంటే మరికొందరు బీనామీల చుట్టూ తిప్పుతున్నారు. ఇటీవల కాలంలో ఓ ఎంఎల్‌ఎ 50 ఎకరాలు కొనుగోలు చేశాడని దీనికి సంబంధించి సమాధానం చెప్పాలంటూ మరో మాజీ శాసన సభ్యుడే డిమాండ్ చేశారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఆలోచించుకోవచ్చు. ఇటీవల తొలిసారి గెలిచిన మరో ఎంఎల్‌ఎ మరో అడుగు ముందుకేసి 100 ఎకరాలు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు ఖర్చు చేయడం ద్వారా సంపన్నులు మాత్రమే మనగలుగుతున్న పరిస్థితుల్లో భూమిని తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ భూ కమతాల ద్వారా పేద, మధ్యతరగతి ముఖ్యంగా వ్యవసాయ రంగానికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉంది. భూ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు పరిమితికి మించి భూములు కొనుగోలు చేసిన వారిపైన చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ భూముల్లో వ్యవసాయేతర పనులు నిర్వహించే వారిని నిలువరించాలి. ఇప్పటికే వ్యవసాయ భూమి వివిధ కారణాలతో తగ్గిపోతుంది. పట్టణాలు, నగరాలకు చుట్టూ సుమారు 20 నుంచి 25 కిలో మీటర్ల మేర వ్యవసాయ భూమి లేదు. మండల కేంద్రాల్లో కూడా చుట్టూ కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం కారణంగా వ్యవసాయ భూమి కరువవుతుంది. పరిశ్రమలు, ఇతర అభివృద్ధి పనుల కారణంగా వ్యవసాయ భూమి తక్కువవుతున్న నేపథ్యంలో భూ కమతాలు వ్యవసాయ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఎక్కువో తక్కువో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే దాని కంటే భూ చట్టాల అమలుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

## స్పష్టతనివ్వండి
(మొదటి పేజీ తరువాయి)

జెఎసి ఛైర్మన్ మారం మారం జగదీశ్వర్, సెక్రెటజరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు తెలిపారు.

**ఈనెలాఖరు నాటికి పిఆర్‌సి నివేదిక..?** సిపిఎస్ రద్దు విషయంలో 8 మందితో కమిటీ వేయనున్నారు. మరో రెండు,మూడు రోజుల్లో పిఆర్‌సి నివేదిక ప్రభుత్వానికి అందనున్న నేపథ్యంలో ఈనెలాఖరు నాటికి పిఆర్‌సి వియంలో ప్రభుత్వం స్పష్టతనిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసినట్టు తెలిసింది. అలాగే పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని, డిఎల చెల్లింపు విషయంలో రెండా? లేదా మూడు డిఎలను చెల్లించాలా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

## ఫామ్‌హౌస్ కల్చర్
(మొదటి పేజీ తరువాయి)

చామల ఆరోపించారు.తెలంగాణలో ఫామ్‌హౌస్‌ల అంశంపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వరుసగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నారని, భూముల హక్కులు, నిర్మాణ అనుమతులు,అసైన్డ్,ఇనాం భూముల వినియోగం వంటి అంశాలపై వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ ఉద్దేశమని తెలిపారు. నిజాం నవాబుల కాలంలో సర్ఫెఖాస్ భూముల్లో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నట్లే బిఆర్‌ఎస్ నేతలు ఫామ్‌హౌస్‌ల సంస్కృతిని పెంచారని చామల విమర్శించారు.ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన నాయకులకు ఇలాంటి భారీ సంఖ్యలో ఫామ్‌హౌస్‌లు ఉన్నాయా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంమిగులు బడ్జెట్‌తో ఏర్పడితే బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టారని చామల ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.మరోవైపు కొందరు బిఆర్‌ఎస్ నేతలు మాత్రం భారీగా భూములు,ఫామ్‌హౌస్‌లు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారులు తమ జీవితాలను,ఆస్తులను త్యాగం చేశారని చామల అన్నారు.గద్దర్, ప్రొఫసర్ జయశంకర్,కోదండరాం వంటి ఉద్యమ నేతలు ఏం సంపాదించుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి తల్లి ఇప్పటికీ సాధారణ జీవితమే గడుపుతున్నారని,సూర్యాపేటలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఉప్పల మల్సూర్ కుటుంబం ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకునే పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన కొందరు మాత్రం భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారని విమర్శించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. హరీశ్‌రావు,కెటిఆర్,పైలట్ రోహిత్‌రెడ్డి తదితరుల ఫామ్‌హౌస్‌లతో పాటు జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల హక్కులు,భూ రికార్డులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. జగదీశ్‌రెడ్డి ఆధీనంలో ఉన్నట్లు చెబుతున్న సుమారు 50 ఎకరాల్లో పేదలకు చెందాల్సిన 12 ఎకరాల ఇనాం,మాఫీ ఇనాం భూములు ఉన్నాయని ఆయన ఆరోపించారు.అవి నిజంగా ఇనాం భూములేనని విచారణలో తేలితే వాటిని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**భూ వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయి: వీర్లపల్లి శంకర్**

అనంతరం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ పాలనలో అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, కవులు,కళాకారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు.తెలంగాణ ఉద్యమంలో జేఏసీ ఛైర్మన్‌గా పనిచేసిన ప్రొఫసర్ కోదండరాంను అర్ధరాత్రి అరెస్టు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వాలు అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు అందించేందుకు చట్టాలు తీసుకొచ్చాయని,బిఆర్‌ఎస్ పాలనలో భూ వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు.

కెసిఆర్ కుటుంబం సంపాదించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్తులను పేదలకు అందిస్తే ప్రజలు కెసిఆర్‌ను తెలంగాణ జాతిపితగా కొలుస్తారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి లు సురేష్ షెట్కార్,అనిల్‌కుమార్ యాదవ్,ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, శాసన మండలి ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి,మందుల సామేల్, వీర్లపల్లి శంకర్,బాలు నాయక్,నవీన్ యాదవ్,కార్పొరేషన్ ఛైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్,రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏసియన్ గేమ్స్ చరిత్రలో కొత్త రికార్డు..

# ఎంఎంఎలో భారత్‌కు తొలి పతకం

ఏసియన్ గేమ్స్ మిక్సడ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో భారత క్రీడాకారిణి సుచికా తారియాల్ కొత్త చరిత్ర సృష్టించింది. సోమవారం జరిగిన మహిళల ట్రెడిషనల్ 60కేజీల విభాగంలో సుచికా కాంస్య పతకం సాధించింది. దాంతో ఎంఎంఎ విభాగంలో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన క్రీడాకారిణిగా సుచిత నిలిచింది. ఏషియన్ గేమ్స్‌లో గతంలో ఎంఎంఎకు చోటులేదు. ఈసారే ఈ క్రీడ తొలిసారి చోటు దక్కించుకుంది. ఈ క్రీడలో మూడోస్థానంలో నిలిచిన సుచిత భారత్‌కు తొలి పతకాన్ని అందించింది. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో సుచికా తలపడింది. హోరాహోరీగా సాగిన ఈ పోరు అదనపు సమయంలోకి వెళ్లింది. చివరకు స్వల్ప తేడాతో సుచిక ఓటమి పాలైంది. దాంతో ఫైనల్‌కు చేరే అవకాశం కోల్పోయినా.. అప్పటికే కాంస్య పతకం ఖాయమైంది. అంతకుముందు క్వార్టర్స్‌లో మంగోలియాకు చెందిన అల్టాన్చిమెగ్ బైగల్మాను 2–0తో సుచికా ఓడించింది. దాంతో ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఎలో భారత్‌కు పతకం ఖాయం చేసిన తొలి క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. 36 ఏళ్ల సుచికా ప్రయాణం ఒక్క ఎంఎంఎకే పరిమితం కాలేదు. జాతీయస్థాయి జూడో క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె 2022 బర్మింగ్హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొన్నది. 2023 ఏషియన్ గేమ్స్‌లో కురాష్లోనూ పోటీపడింది. ఆ తర్వాత జియూజిట్సులో సత్తా చాటి 2024లో ఫైటింగ్ జియూజిట్సు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. 2017లో ఎంఎంఎలో ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన సుచికా.. జూడో, జియూజిట్స్‌పై దృష్టి పెట్టడంతో కొన్నేళ్లు ఈ క్రీడకు దూరంగా ఉన్నది. 2024లో మళ్లీ ఎంఎంఎలోకి వచ్చి 'బ్రేవ్ కంబాట్ ఫెడరేషన్'తో ఒప్పందం చేసుకుంది. గాయం వంటి అడ్డంకులను అధిగమించి తిరిగి వచ్చిన ఆమె.. ఇప్పుడు ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు చారిత్రక పతకం అందించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఎను తొలిసారి ప్రవేశపెట్టగా.. వెంటనే భారత్‌కు పతకం రావడం విశేషం. ఈ ఘనత భారత ఎంఎంఎ చరిత్రలో సుచికా తారియాల్‌కు ప్రత్యేక స్థానం కల్పించింది.



# మహిళల టేబుల్ టెన్నిస్ క్వార్టర్ ఫైనల్‌కు భారత్

ఆసియా గేమ్స్ 2026 టోర్నీలో భారత మహిళల టెన్నిస్ టీమ్ దుమ్మురేపుతోంది. దాయాదీ పాకిస్థాన్‌ను చిత్తుచేసిన భారత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన గ్రూప్–ఎఫ్ రెండో మ్యాచ్‌లో భారత్ 3–0 తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. భారత ఆటగాళ్ల అద్వితీయ ప్రదర్శన ముందు పాకిస్థాన్ తేలిపోయింది. సుతీర్థ ముఖర్జీ 11–3, 11–3, 11–4 తేడాతో అలీనా ఖాన్‌ను ఓడించగా.. సిండ్రెలా దాస్ 11–6, 11–7, 11–5తేడాతో కల్సూమ్‌ఖాన్‌ను చిత్తు చేసింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్థాన్ తేలిపోయింది. తెలంగాణ బిడ్డ ఆకుల శ్రీజ 11–4, 11–4, 11–5 తేడాతో ఫాతిమాఖాన్‌ను ఓడించి భారత్ విజయాన్ని లాంఛనం చేసింది. ఈ గెలుపుతో గ్రూప్‌ఎఫ్‌లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది.

**షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్న భారత్, పాక్ ఆటగాళ్లు..** అయితే ఈ మ్యాచ్ సందర్భంగా భారత్, పాకిస్థాన్ ఆటగాళ్లు కరచాలనం చేసుకోవడం చర్చనీయాంశమైంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య క్రీడా సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. భారత క్రికెట్ టీమ్.. పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయడం లేదు. ఇతర క్రీడల ఆటగాళ్లు కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించారు. కానీ టెన్నిస్ ప్లేయర్లు మాత్రం కరచాలనం చేసుకోని క్రీడాస్ఫూర్తిని కనబర్చారు.

**సింగపూర్‌పై ఘన విజయం..** భారత మహిళల టిటి టీమ్ తొలి మ్యాచ్‌లో 3–2 తేడాతో సింగపూర్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో భారత్ 1–2 తేడాతో వెనుకంజలో నిలిచి మరీ పుంజుకుంది. తొలి మ్యాచ్‌లో యశస్విని విజయం సాధించగా.. శ్రీజ, దివ్య చితాలె ఓడిపోయారు. తప్పక గెలవాల్సిన మ్యాచ్లో శ్రీజ 6–11, 11–3, 11–7, 11–4 తేడాతో జెంగ్ జియాను ఓడించి భారత్‌ను రేసులో నిలబట్టింది. నిర్ణయాత్మక పోరులో యశస్విని విజయం సాధించడంతో భారత్ పైచేయి సాధించింది.

**షూటింగ్‌లో రజతం..** రెండో రోజు పోటీల్లో భారత్ రజత పకతాన్ని అందుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్లో భారత్ రెండో స్థానం నిలిచింది. రుద్రాంక్ష్ పాటిల్, పార్థ్ మానే, హిమాన్షు థిల్లాన్ త్రయం 1890.1 పాయిట్లతో రెండో స్థానంలో నిలిచి స్వర్ణాన్ని చేజార్చుకుంది. చైనా 1899 పాయింట్లతో పసిడి సాధించింది. రుద్రాంక్ష్, హిమాన్షు వ్యక్తిగత ఈవెంట్లో రజతం,కాంస్యం సాధించారు.







## యువతరంగం


# కొత్త ఉపాధి రంగాలు నేటి అవసరం

ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం ఒకే రంగంలో దొరకదు. తయారీ, సేవా రంగాలు రెండూ విస్తరించాలి. పర్యాటక రంగంలో భారత్‌కు ఇంకా పూర్తిగా వినియోగించని అవకాశాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ పర్యాటకం కొవిడ్‌కు ముందు స్థాయిని మించి పెరిగినప్పటికీ, భారత్‌కు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య ఇంకా పాత స్థాయికి పూర్తిగా చేరలేదు. మౌలిక సదుపాయాలు, నియంత్రణపరమైన అడ్డంకులు తొలగిస్తే పెద్దసంఖ్యలో ఉద్యోగాలు సృష్టించగలదు. వేగంగాపెరుగుతున్న నగరీకరణ కూడా ఉపాధికి అవకాశం కల్పిస్తుంది. భారత నగరాల్లో మునిసిపల్ సిబ్బంది, పౌర సేవల స్థాయి ఇతర దేశాల సమాన నగరాలతో పోలిస్తే తక్కువగా ఉంది. మెరుగైన పట్టణ పాలన, ప్రజా రవాణా, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి సేవలను విస్తరించడం ద్వారా ఉపాధితోపాటు జీవన ప్రమాణాలను కూడా మెరుగుపరచవచ్చు. సూక్ష్మ,చిన్న,మధ్యతరహా సంస్థలు ఉపాధి సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే రుణ లభ్యత, నియంత్రణల భారం, సంక్లిష్టమైన అనుమతి వ్యవస్థలు వాటి విస్తరణకు అడ్డంకులుగా ఉన్నాయి. ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు విధానపరమైన స్థిరత్వం, సులభమైన వ్యాపార వాతావరణం అవసరం. హోటళ్లు, పరిశ్రమలు వంటి రంగాల్లో అనుమతుల సంఖ్య తగ్గించడం, భూమి వినియోగం, నిర్మాణ నిబంధనలను సరళీకరించడం వంటి సంస్కరణలను నిరంతరం కొనసాగించాలి. శక్తి భద్రత కూడా కీలకమే. అంతర్జాతీయ ఇంధన ధరల మార్పులకు భారత్ ఇంకా ఎక్కువగా గురవుతోంది. చివరికి సమస్య కేవలం ఉద్యోగాల సంఖ్యకు సంబంధించినది కాదు. ఎలాంటి ఉద్యోగాలు సృష్టిస్తున్నాం? వాటికి యువత విద్య ఎంతవరకు సరిపోతున్నది? ఆ విద్యను పొందేందుకు కుటుంబాలు ఎంత ఖర్చు చేస్తున్నాయి అనే ప్రశ్నలు కూడా అంతే ముఖ్యమైనవి. జీవితాంతం ఒక ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూసే సంస్కృతి క్రమంగా మారుతోంది. విద్యా వ్యవస్థ యువతలో నేర్చుకోవడం, నేర్చుకున్నదాన్ని అవసరానికి అనుగుణంగా మార్చుకోవడం, కొత్త నైపుణ్యాలను తిరిగి నేర్చుకోవడం వంటి సామర్థ్యాలను పెంచాలి. 8.7 కోట్ల మంది 'నీట్' యువత భారత్‌కు ఒకవైపు అవకాశంగా, మరోవైపు సారి ప్రమాదంగా మారుతున్నారు. వారి ప్రతిభను ఉత్పాదక ఆర్థిక కార్యకలాపాల్లోకి తీసుకురాగలిగితే జనాభా భారత్‌కు బలంగా మారుతుంది. లేకపోతే అదే జనాభా నిరుద్యోగం, ఆలస్యమైన ఆర్థిక స్వాతంత్ర్యం, కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి, సామాజిక అసంతృప్తికి దారితీస్తుంది. 7–8 శాతం ఆర్థిక వృద్ధి గణనీయమైన ఉద్యోగాలను సృష్టించగలదు. అయితే ప్రతి సంవత్సరం ఉద్యోగ మార్కెట్లోకి వచ్చే కొత్త తరంతో పాటు ఇప్పటికే వ్యవస్థకు వెలుపల ఉన్నవారిని కూడా పూర్తిస్థాయిలో ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడానికి దీర్ఘకాలికంగా మరింత వేగవంతమైన, స్థిరమైన వృద్ధి అవసరం. విద్యామంత్రిత్వ శాఖ ఇటీవల ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఐఎస్‌హెచ్‌ఇ) గణాంకాల ఆధారంగా 2014–15 నుంచి 2023–24 వరకు ఉన్నత విద్యలో వచ్చిన మార్పులపై దశాబ్దపు సమీక్షను ఇటీవల విడుదల చేసింది. ఈ గణాంకాలు గత పదేళ్లలో భారత్ ఉన్నత విద్యావ్యవస్థను గణనీయంగా విస్తరించిందని చూపిస్తున్నాయి. అయితే, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థగా కొనసాగుతున్న భారత్‌లో జాతీయ విద్యా విధానం 2020 (ఎన్‌ఇపి) ద్వారా ఉన్నత విద్యను మరింత మందికి అందుబాటులోకి తీసుకురావడం, బహుళశాఖల విద్యను ప్రోత్సహించ డం, పరిశోధనను విస్తరించడం, సామాజిక–లింగ సమానత్వాన్ని పెంచడం లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించుకుంది. ఉన్నత విద్యలో మహిళల భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగింది. మహిళా విద్యార్థుల సంఖ్య 1.57 కోట్ల నుంచి 2.24 కోట్లకు చేరింది. ఈ మార్పుల్లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు మినహాయింపులు, పోస్ట్‌మెట్రిక్ ఆర్థిక సహాయం, రిజర్వేషన్ విధానాలు కీలకంగా పనిచేశాయి. విద్యా మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడ్డాయి. ఉన్నత విద్యా సంస్థల్లో 98 శాతానికి పైగా గ్రంథాలయాలు ఉన్నాయి. 94 శాతానికి పైగా సంస్థల్లో ఆటస్థలాలు, 85 శాతానికి పైగా సంస్థల్లో ప్రత్యేక ప్రయోగశాలలు ఉన్నాయి. అధ్యాపకుల సంఖ్య 17.32 లక్షలకు పెరిగింది. మహిళా అధ్యాపకుల సంఖ్య 36.7 శాతం పెరిగి మొత్తం బోధనా సిబ్బందిలో 44.9 శాతానికి చేరింది.




## విస్తరణతో పాటు కొనసాగుతున్న సమస్యలు

గణాంకాల్లో సానుకూల పరిస్థితులు ఉన్నాయని సూచించే సంఖ్యల పెరుగుదల మాత్రమే ఉన్నత విద్య నాణ్యతకు హామీ ఇవ్వదు. ప్రతి ఏడాది 1.09 కోట్లకు పైగా విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తిచేస్తున్నప్పటికీ, వారి నైపుణ్యాలు పరిశ్రమ అవసరాలకు సరిపోవడం లేదనే సమస్య కొనసాగుతోంది. ఉన్నత విద్య పొందిన యువతలో 29 శాతానికి పైగా ఉద్యోగం కోసం ఎక్కువకాలం వెతకాల్సి వస్తున్నట్లు సమీక్ష పేర్కొంటోంది. దివ్యాంగ విద్యార్థుల విషయంలో లింగ అసమానత ఇంకా కొనసాగుతునే ఉంది. 2023–24లో బెంచ్‌మార్క్ డిజెబిలిటీస్ ఉన్న విద్యార్థుల నమోదులో 34,080 మంది పురుషులు ఉండగా, మహిళల సంఖ్య సుమారు 20,000గా ఉంది. మహిళా దివ్యాంగ విద్యార్థులకు విద్య అందుబాటులోకి రావడంలో ప్రత్యేక అడ్డంకులు ఉన్నాయని ఇది సూచిస్తోంది. అధ్యాపకుల కొరత మరో ప్రధాన సమస్య. ముఖ్యంగా రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, గ్రామీణ కాలేజీల్లో మంజూరైన పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తి, బోధన నాణ్యత దెబ్బతింటున్నాయి. పరిశోధన నిధులు కూడా కొన్ని ప్రముఖ కేంద్ర సంస్థలకే ఎక్కువగా కేంద్రీకృతమవుతున్నాయి. ఐఐటిలు, ఐఐఎస్‌సి వంటి సంస్థలకు అధునాతన పరిశోధనా సదుపాయాలు అందుతున్నప్పటికీ, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, అనుబంధ కాలేజీలకు నిధులు పరిమితంగా ఉన్నాయి. అందువల్ల రాబోయే దశలో ఉన్నత విద్యా విధానం కేవలం కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, విద్యార్థుల సంఖ్య పెంచడంపై దృష్టి పెట్టకూడదు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో పాఠ్యాంశాలను అనుసంధానించడం, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు–అప్రెంటిస్‌షిప్‌లు అందించడం, ఎఐ, డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడం అవసరం. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక నియామకాలను వేగవంతం చేయాలి. ఎన్‌ఆర్‌ఎఫ్ ద్వారా పరిశోధనా నిధులను మరింత విస్తృతంగా అందించాలి. విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు 'స్టడీ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలి. 2035 నాటికి 50 శాతం జిఇఆర్ లక్ష్యాన్ని సాధించాలంటే ఉపాధికి ఉపయోగపడే విద్య, నాణ్యమైన అధ్యాపకులు, సమాన పరిశోధనా అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలపై మరింత దృష్టి పెట్టాల్సి ఉంటుంది.




## చిరస్మరణీయుడు నర్సయ్య

ఎఐటియుసి, సిపిఐ నాయకుల నివాళి



**ప్రజాపక్షం /శ్రీరాంపూర్ :** సింగరేణి కార్మికుల హృదయాల్లో కార్మిక నేత పుచ్చకాయల నర్సయ్య చిరస్మరణీయుడిగా నిలిచిపోతారని ఎఐటియుసి, సిపిఐ నాయకులు కొనియాడారు. నర్సయ్య 32వ వర్ధంతి సందర్భంగా శ్రీరాంపూర్‌లో నవీకరించిన ఆయన స్మారక స్తూపాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీ వర్కర్లకు డిపెండెంట్ ఉద్యోగ హక్కు కల్పించేందుకు నర్సయ్య చేసిన న్యాయపోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 1990లో ఎస్‌ఆర్‌పి 1 గని ప్రమాదంలో చనిపోయిన బదిలీ కార్మికుడి కుటుంబానికి ఉద్యోగం కోసం సమ్మె చేసి, హైకోర్టు ద్వారా డిపెండెంట్ హక్కు సాధించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. తాళ్లపల్లి సర్పంచ్‌గా కార్మికులకు ఆవాసాలు ఏర్పాటు చేసి తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించారన్నారు. కార్మికుల హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడిన నర్సయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, జోగుల మల్లయ్య, రాచర్ల చంద్రమోహన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సాదా బైనామా, 22ఎ భూములపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలివ్వాలి

సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ :** సాదా బైనామా, 22ఎ భూములపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలివ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సభ్యులు జువారి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. సాదా బైనామాల ద్వారా ఖరీదు చేసి ఖాస్తు, కబ్జాలో ఉన్న రైతులకు నేటికి హక్కులు పొందలేక పోతున్నారన్నారు. 22ఎ కింద జరిగిన అవకతవకలు అన్నింటిని సరిదిద్ది రైతులకు లబ్ధిచేకూరే విధంగా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకొని కింది స్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. అసైన్మెంట్, ప్రభుత్వ భూముల విషయంలో కొన్నిచోట్ల కొందరికే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అందిరికీ వర్తించే విధంగా విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేసి నిర్మాణం చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎండి నూర్నిషా, ఎండి యూనస్, తోట రమేష్, ఎండి రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# లో, హై లెవెల్ బ్రిడ్జిల సాధనకు పోరాటాలు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం) :** ప్రభుత్వాలు మారినా ప్రజాసమస్యలు పరిష్కారం కావడం లేదని, సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. లో లెవెల్, హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకు పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో లో లెవెల్, హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకు సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం ఆధ్వర్యంలో రెండురోజుల పాదయాత్ర ముగింపు, తహసీల్దార్‌కు వినతి పత్రం అందించే కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారి నాయకులు మారిన గ్రామీణ ప్రాంతాలు కనీస సౌకర్యాల సమకూరడం లేదన్నారు. బంగారు తెలంగాణ, ఇందిరమ్మ రాజ్యం పేర్లతో పాలన జరిగిన గ్రామీణ ప్రాంతాలు కనీస సౌకర్యాలను పొందలేకపోతున్నాయన్నారు. లో లెవెల్ బ్రిడ్జిలతో రైతులకు, రవాణాకు, వైద్యానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుకు ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కమిషన్ల కోసమే హైవేలకు కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన ప్రజలు చైతన్యవంతులై పోరాటాలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలలో సిపిఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం మండలంలోని లో లెవెల్ బ్రిడ్జిలు రాయిపల్లి కాలువపల్లి మధ్య, ఆత్మకూరు మొరిపిరాల గ్రామాల మధ్య,ఆత్మకూరు కొరటికల్ గ్రామాల మధ్య, రహీంఖాన్ పేట పోతిరెడ్డిపల్లి మధ్య, సారగండ్ల గూడెం పారుపల్లి, రాఘవాపురం కూరెళ్ళ గ్రామాల మధ్యలో, కూరెళ్ళ పల్లెర్ల మధ్యలో, లింగరాజుపల్లి వలిగొండ హైవే రోడ్డు మధ్య లో ఉన్న లో లెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకు సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పాదయాత్రలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, గుర్రం రాజమణి, జక్క దయాకర్‌రెడ్డి, బొబ్బల లాల్‌రెడ్డి, అంబోజు రాములు, జల్ది రాములు, మజ్జిగ నరసయ్య, గవ్వల నరసయ్య, మారుపాక నరసయ్య, సోలిపురం లింగారెడ్డి, గాజుల సిద్ధులు, ఎండి.నయీమ్ పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సహాయకార్యదర్శిలు బలగాని సత్యనారాయణ, చేడ చంద్రయ్య, నాయకులు ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేశ్వర్లు, కళ్లెం కృష్ణ, కుసుమాని హరిచంద్ర, దూసపాక నరసింహ, సంజీవ, గని, అన్నం వెంకటేష్, గాదగాని మాణిక్యం తదితరులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.






### ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికులకు

# వేతనాలు వెంటనే చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట ఎఐటియుసి ధర్నా

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు, పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల పరిశుభ్రత మూత్రశాలలు చెట్ల పచ్చదనం నీళ్ల ఏర్పాటు కోసం స్వీపర్లు, పారిశుధ్య కార్మికుల నియామకం చేయడం జరిగిందని, వీరి వేతనాలను పాఠశాల విద్యార్థుల సంఖ్య ఆధారంగా కార్మికుల సంఖ్యను, వేతనాలను నిర్ణయించడం జరిగిందన్నారు. వీరికి వేతనాలు చెల్లించే బాధ్యతలను ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మదర్స్ కమిటీల ఖాతాల ద్వారా చెల్లించాలని నిర్ణయించారు. కానీ ప్రభుత్వం నిర్ణయించిన పద్దతిలో వేతనాలు అమలు కావడం లేదని, కొంతమంది వీరికి వేతనాలు ఇచ్చే సమయంలో ఖర్చు పేరుతో కొంత డబ్బును తగ్గించి ఇస్తున్నారన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని కార్మికులకు చెల్లించే వేతనాలను వారి అకౌంట్లోనే జమ చేయాలని స్వీపర్లకు డ్రెస్‌కోడ్ అమలు చేయాలని, పనిముట్లు ఇవ్వాలని, ప్రమాద నష్టపరిహార చట్టాన్ని అమలు చేయడంతోపాటు పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డిఇఒను పిలిపించి మూడునెలలకు సంబంధించిన వేతనాల ఫైల్‌పై సంతకం చేయడం జరిగిందన్నారు. డబ్బులు జమ చేస్తామని హామీ ఇవ్వడం పట్ల కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు యూనియన్ అధ్యక్షులు తోపునూరి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి వసంత, నాయకులు రాధా, లక్ష్మి , సాయన్న, వనిత తదితరులు పాల్గొన్నారు.




### స్థానిక సమస్యల పరిష్కారంలో

# అధికారులు నిర్లక్ష్యం తగదు




సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్

**ప్రజాపక్షం/జవహర్ నగర్/యాప్రాల్ :** స్థానిక సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పేర్కొన్నారు. అల్వాల్ మండల పరిధిలోని యాప్రాల్ ఎఆర్ దేవరాజు భవన్‌లో సోమవారం సిపిఐ అల్వాల్ మండల కౌన్సిల్ కార్యవర్గ సమావేశం జరిగింది. బి.నరేంద్ర చారి అధ్యక్షతన, సిపిఐ అల్వాల్ మండల కార్యదర్శి ఏ.అమరావతి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కే.రవిచంద్రన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ మండలంలో పేరుకుపోయిన స్థానిక సమస్యలను పరిష్కరించడంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, తాగునీటి ఎద్దడి తీర్చడం, అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించడం, వీధి దీపాలు వేయడం విరివిగా ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించడం వంటి ప్రధాన సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు డి.జంగయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వెంకటాచారి, ఎఐటియుసి జిల్లా కోశాధికారి సిహెచ్. తులసి, కె.రమేష్ సింగ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వై.వెంకటేష్,నాయకులు పి.చంద్రయ్య, ఎన్.పద్మ, ఏ.స్వామి, టి.కృష్ణ, సదానంద్, ఆర్.కోమల, కె.లక్ష్మి, ఎండి.అక్రమ్, గడ్డం కృష్ణ, చిరంజీవి, జి.గణేష్, సురేష్, పి.మహేష్, నరసమ్మ, లక్ష్మి ఎన్.సంతోష తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గేతో మంత్రి వివేక్ భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖర్గే ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై జరిగిన అనుచిత వ్యాఖ్యల అంశంపై ఖర్గే ఆరా తీశారు. అసెంబ్లీ సమావేశాల తీరు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, 22ఎ అంశం, ప్రజా సంక్షేమ పథకాల అమలు తదితర విషయాలపై వివేక్ వెంకటస్వామితో చర్చించారు. అలాగే ఎల్‌నినోకు సంబంధించిన అంశాలతోపాటు రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక విషయాలపై ఖర్గేతో చర్చించినట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజల కోసం నిరంతరం పోరాడారని పలువురు నాయకులు గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ జలదృశ్యంలో ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి దనసరి అనసూయ సీతక్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ పద్మశాలి కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, హ్యాండ్లూమ్, లూమ్ కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, తుడా చైర్మన్ గుండు సుధారాణి, వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. బిసిలు, చేనేత కార్మికులు, పద్మశాలీల అభ్యున్నతికి బాపూజీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీభవన్‌లోనూ నివాళులు: బాపూజీ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించాయి. సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి నాయకులు, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి సాధనలో కవులు, రచయితల పాత్ర కీలకం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ శాంతి సాధనలో కవులు, రచయితల పాత్ర కీలకమని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ నేత, మాజీ ఎమ్మెల్సీ కే. యాదవ్‌రెడ్డి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలకు వ్యతిరేకంగా, ప్రపంచ శాంతి సాధన కోసం కవులు, రచయితలు, మేధావులు మరింత విస్తృతంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సామాజిక, రాజకీయ మార్పులు, స్వాతంత్ర్య ఉద్యమాల్లో కవులు, రచయితలు చైతన్యపూరిత పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమరయ్య హాల్‌లో అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో 'ప్రపంచ శాంతి'పై కవి సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి యాదవ్‌రెడ్డితో పాటు జాతీయ అధ్యక్షవర్గ సభ్యుడు డా. డి. సుధాకర్, ప్రధాన కార్యదర్శులు జి. నాగేశ్వరరావు, డా.కాచం సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు తక్షణమే నిలిపివేయాలని కోరారు. రక్షణ రంగానికి వెచ్చిస్తున్న భారీ నిధులను విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయించాలని సూచించారు. దేశాల మధ్య స్నేహ సంబంధాలు, పరస్పర సహకారం పెంపొందించాలని, ఆక్రమణవాదం, యుద్ధోన్మాదం, సామ్రాజ్యవాద విధానాలను విడనాడాలని అన్నారు. డా. డి. సుధాకర్ మాట్లాడుతూ పాలస్తీనా–ఇజ్రాయెల్, ఇరాన్‌పై జరుగుతున్న ఘర్షణల కారణంగా పసిపిల్లలు, విద్యాలయాలు, ఆసుపత్రులు తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని కోరారు. కెవిఎల్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ శాంతి దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి ప్రతి ఒక్కరు ప్రతి చోట ప్రతి రోజు శాంతి పరిరక్షణకు కృషి చేయాలనే అనే థీమ్‌తో నిర్వహిస్తోందని తెలిపారు. జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ కవులు, రచయితలు తమ కలాలకు మరింత పదును పెట్టాలని అన్నారు. డా. కాచం సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో కవుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సీనియర్ ఉద్యమ నాయకుడు నరహరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి గురించి ఆలోచించినప్పుడే శాంతి బలపడుతుందని అన్నారు. కవి సమ్మేళనంలో కవులు యుద్ధ వ్యతిరేకత, అహింస, జాతీయ సమైక్యత, మహిళలపై హింసకు వ్యతిరేకత, మానవ సంక్షేమం, సమాజ ప్రగతి, ప్రపంచ శాంతి తదితర అంశాలపై తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో సలీమా, కమలా రెడ్డి, బొమ్మగాని నాగభూషణం, కడారి శ్రీనివాస్, రాపోలు సుదర్శన్, రామడుగు రాంబాబు, కోటి బాబు, హర్షత్, మహేష్, పోలగాని రవికిషోర్, వెంకట్, అనూష, రామనారాయణ, జె.కె శ్రీనివాస్, సుధావన్, శివయ్య, నాగేశ్వర్, సాంబశివరావు, రామచంద్రారెడ్డి, పి. వెంకటేశ్వర్లు, ఇరుగు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి గురుకులాలకు మహర్దశ

సొంత భవనాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
4.06 లక్షల కుట్టు మిషన్ల దరఖాస్తులు..
30తో గడువు ముగింపు
హాస్టళ్లలో నాణ్యమైన విద్య, పౌష్టికాహారానికి ప్రాధాన్యం: మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిసి గురుకులాలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, క్రీడలు, డిజిటల్ విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో సోమవారం జరిగిన సమావేశంలో 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం అమలు, బిసి గురుకులాలు, హాస్టళ్ల పనితీరు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**కుట్టు మిషన్లకు 4.06 లక్షల దరఖాస్తులు..**

'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం కింద ఇప్పటివరకు 4 లక్షల 6 వేల దరఖాస్తులు అందినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 30తో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన బిసి మహిళలందరికీ పథకం ప్రయోజనం అందేలా ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.రాష్ట్రంలో మొత్తం 327 బిసి గురుకుల పాఠశాలలు ఉండగా, ప్రస్తుతం కేవలం 21 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో సొంత భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి సేకరించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే స్థలం అందుబాటులో ఉన్న గురుకులాలకు భవనాల నిర్మాణం చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

**బిసిల ఆర్థికాభివృద్ధికి చర్యలు..**

బిసిల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిసి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోపాలు, మ్యాపింగ్ సమస్యల పరిష్కారం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఓటర్ల జాబితాలోని సాంకేతిక లోపాలను,నోమ్యాపింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి (సిఈఒ) సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలు, ఏఈఆర్ఓలకు నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను పాటిస్తూ, నిర్ణీత గడువు లోపు పనులను పూర్తి చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులు, విచారణ లాంటిపెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని, ఆధారాలు సమర్పించేందుకు ఓటర్లకు తగిన సమయం కల్పించాలని ఆదేశించారు.'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ' (సర్) 2026పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా ఎన్నికల అధికారులతో సుదర్శన్ రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.ఎస్. చారి, జిహెచ్ఎంసి,హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు , సహాయ ఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్లకు సరైన సమాచారం అందించేందుకు వీలుగా అధికారులు, బిఎల్ఓలకు ఆమోదిత పత్రాల జాబితా పట్ల పూర్తి అవగాహన ఉండాలని, బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏ) పాత్ర కేవలం ఇళ్లను గుర్తించడమేనని, ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియలో పాల్గొనకూడదని సూచించారు. ఈఆర్ఓ స్థాయిలో పేరుకుపోయిన దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని, అవసరమైతే కంప్యూటర్ ఆపరేటర్ల సంఖ్యను పెంచి, వారి పనితీరును ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఫారమ్ 6, 7, 8 వివరాలు, ఇతర ముఖ్య సమాచారాన్ని నోటీస్ బోర్డులపై బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యుల తరఫున ఎవరైనా ఒకరు అవసరమైన పత్రాలను సమర్పించే వెసులుబాటు కల్పించాలని సూచించారు. దివ్యాంగులు,వయోవృద్ధులను విచారణ కోసం వ్యక్తిగతంగా హాజరుకావాలని ఒత్తిడి చేయకూడదని, విదేశాల్లో ఉండే ఎన్నారైలు తమ ప్రతినిధి ద్వారా ధ్రువీకరణ పత్రాలు సమర్పించవచ్చని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.అనర్హులుగా గుర్తించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, తగిన నిబంధనలు పాటించిన తర్వాత మాత్రమే సహేతుకమైన ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

## ఆయకట్టు పంటలకు సాగునీరు విడుదల చేయకపోవడం దుర్మార్గం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: జూరాల రిజర్వాయర్‌లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, ఆయకట్టు పంటలకు సాగునీరు విడుదల చేయకపోవడం దుర్మార్గమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఒక్క ఎకరం పంట ఎండినా అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని,పంటలను కాపాడాల్సి న ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎపి ప్రభుత్వం నీళ్లు తీసుకెళ్తుంటే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని, ఎల్‌నినో కంటే ఎల్‌కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రానికి ఈ దుస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ మోటర్లను, కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి మోటర్లను వెంటనే ఆన్ చేసి రైతులకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో తనను కలిసిన మీడియాతో కెటిఆర్ మాట్లాడారు. వరద జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీళ్లు తీసుకెళ్తుంటే, తెలంగాణలో నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద ఉన్న రైతాంగానికి సాగునీరు అందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఏడాది కృష్ణా నదిలో తెలంగాణకు అందుబాటులోకి వచ్చిన 248 టీఎంసీల నీటిలో కేవలం 28 టీఎంసీలను మాత్రమే వినియోగించుకోవడం అన్యాయమని, తెలంగాణకు రావాల్సిన నీటిని వినియోగించుకోకుండా రైతుల పంటలను ఎండబెట్టడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సిఎం సొంత జిల్లా పాలమూరులో సాగునీటి కోసం రైతులు అరిగోస పడుతుంటే వారి సమస్యలను పరిష్కరించకుండా ముఖ్యమంత్రి చిల్లర రాజకీయాలతో పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. నీళ్ల కోసం ఆందోళనకు దిగిన జూరాల ఆయకట్టు రైతాంగానికి సంఘీభావంగా నిరసన వ్యక్తం చేసిన మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,మాజీ ఎమ్మెల్యేలు, బిఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ తన వైఖరిని మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు.

కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి 10 టీఎంసీల నీటిని తీసుకొచ్చి పంటలను కాపాడాలని కోరారు. భూముల విషయంలో బీఆర్‌ఎస్ నేతలు ఎవరైనా తప్పు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చట్టప్రకారం ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చని, కానీ కాంగ్రెస్ నాయకులు భూముల వద్దకు వెళ్లి ఎందుకు డ్రామాలు చేస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించినట్టుగా సిరిసిల్లలో 8 వేల ఎకరాలు కబ్జా చేసిన వారి వివరాలను బయటపెట్టాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. ఆ వివరాలు బయటపెట్టలేకపోతే తప్పుడు ఆరోపణలు చేసినట్టు సిఎం అంగీకరించి సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

- రాయదుర్గంలో 480 ఫ్లాట్ల నిర్మాణానికి శంకుస్థాపన
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.హైదరాబాద్ నగరంలోని విలువైన ప్రాంతాల్లో పేద కుటుంబాలకు గౌరవప్రదమైన, సురక్షితమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో నాలుగు టవర్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. రాయదుర్గంలో నిర్మించనున్న నాలుగు టవర్లలో ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్ల చొప్పున మొత్తం 480 ఫ్లాట్లు నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు.పేద కుటుంబాల కష్టాలు, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి భద్రత, భరోసా కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. నగరానికి దూరంగా కాకుండా హైదరాబాద్‌లోని విలువైన ప్రాంతాల్లోనే పేదలు గౌరవప్రదంగా జీవించే అవకాశం కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. హైదరాబాద్ కోర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద తొలి విడతగా ప్రతి నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో టెండర్లు,అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**పారదర్శక లాటరీతో లబ్ధిదారుల ఎంపిక**

ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికను ఎలాంటి సిఫార్సులు, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో లాటరీ విధానంలో చేపట్టినట్లు మంత్రి స్పష్టం చేశారు. లాటరీలో ఎంపికైన లబ్ధిదారులకు శాంక్షన్ లెటర్లను వారి మొబైల్ ఫోన్లకు వాట్సాప్ ద్వారా పంపించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.రాయదుర్గం వంటి అత్యంత విలువైన ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్‌తో పాటు అన్‌డివైడెడ్ షేర్ కింద భూమి వాటా కూడా లబ్ధిదారులకు ఉంటుందని మంత్రి తెలిపారు. లబ్ధిదారులకు ఫ్లాట్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి సేల్ డీడ్ అందజేస్తామని, రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వం భరిస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని మంత్రి తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని లబ్ధిదారులు పరిశీలించే అవకాశం కల్పిస్తామని, నాణ్యతకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

**అర్హత,పేదరికమే ప్రధాన ప్రమాణాలు**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కులం, మతం, రాజకీయ పార్టీ వంటి అంశాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదని, అర్హత మరియు పేదరికమే ప్రధాన ప్రమాణాలు అని మంత్రి స్పష్టం చేశారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు.దసరా నాటికి గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 2.10 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ కోర్ ప్రాంతంలోని ఇతర నియోజకవర్గాల్లోనూ దశలవారీగా ఇందిరమ్మ టవర్స్ నిర్మించి అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు అందిస్తామని చెప్పారు. ఇల్లు కేవలం నాలుగు గోడలు, పైకప్పు మాత్రమే కాదని.. పేద కుటుంబాల ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ,ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేషన్ చైర్మన్,రఘునాథ్ యాదవ్,హౌసింగ్ ఎండీ గౌతమ్ కుమార్,రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి,రంగారెడ్డి జిల్లా హౌసింగ్ పిడి చంప్లా నాయక్,ప్రజాప్రతినిధులు,అధికారులు,లబ్ధిదారులు,ప్రజలు పాల్గొన్నారు.

## రెవెన్యూ చట్టాలను పటిష్టంగా అమలు చేయండి

'ట్రెసా' కు మంత్రి పొంగులేటి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షులు కె. గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్. రమన్ రెడ్డితో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిని మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. రెవెన్యూ చట్టాలను పటిష్టంగా అమలు చేసి, ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత సత్వరంగా అందించేందుకు కృషి చేయాలని రెవెన్యూ అసోసియేషన్ సభ్యులకు మంత్రి పొంగులేటి సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెసా గౌరవాధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. నిరంజన్ రావు, కల్చరల్ సెక్రెటరీ జి.దేశ్యా, ఆర్గనైసింగ్ సెక్రటరీలు బొమ్మ రాములు,బోయిని కృష్ణయ్య, సంయుక్త కార్యదర్శులు వాణి రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి, ఎ.ఆర్ విక్రమ్, శ్రీనివాస్ రెడ్డి,సంగారెడ్డి జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్, తహసీల్దార్లు బాల్ రెడ్డి,ట్రెసా సభ్యులు జంగయ్య, ప్రియాంక,పాండు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎల్3,ఎల్1 కేసులకు ఒకేసారి నిధులు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్: 'ఇందిరమ్మ ఇండ్ల పోర్టల్' ఇప్పటికే మంజూరై బేస్‌మెంట్ లేదా అంతకంటే పై స్థాయికి చేరుకున్న ఇళ్లకు ఎల్3, ఎల్1 కేసులకు ఒకేసారి ప్రత్యేక అనుమతినిస్తూ (వన్ టైమ్ క్లీయరెన్స్) నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఈ ప్రత్యేక సడలింపు ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని, భవిష్యత్తులో ఎల్3 మంజూరులకు దీనిని ప్రాతిపదికగా పరిగణించరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఏర్పడే మొత్తం ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తులను సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ నిబంధనలను సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## హక్కుల పరిరక్షణకు నిరంతరం ఉద్యమించాలి

- రేషన్ డీలర్ లకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలి
- ఐఎన్‌టియుసి జాతీయ ఉపాధ్యక్షులు జి.సత్యజిత్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: కార్మికవర్గం, ప్రజలు తమ న్యాయమైన హక్కుల సాధన, పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమించవలసిందేనని ఐఎన్‌టియుసి జాతీయ ఉపాధ్యక్షులు, ఐఎల్ఓ పాలక మండలి సభ్యులు జి.సత్యజిత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం సోమవారం హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సత్యజిత్ రెడ్డి మాట్లాడుతూ కార్మికవర్గ సంక్షేమానికి, హక్కుల కోసం పోరాడటంలో ఐఎన్‌టియుసి అగ్రభాగాన నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సానుకూలంగా ఉందని, రేషన్ డీలర్ల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరలో పరిష్కరించడానికి కృషి చేయాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకత్వానికి సూచించారు. వై. నాగన్న గౌడ్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న రేషన్ డీలర్లకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని, క్వింటాల్‌కు రూ.300ల కమీషన్ ఇవ్వాలని, సామాజిక భద్రత కోసం రూ.10 లక్షల ఆరోగ్య బీమా, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా సదుపాయం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు రేషన్ డీలర్లకు అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భాస్కర్ రెడ్డి, ముఖ్య ఉపాధ్యక్షులు బి.విజయ్ కుమార్ యాదవ్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. శాఖ పరిధిలోని ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేపట్టాలని ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణా, తవ్వకాలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతో పాటు ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని సిఎస్ ఆదేశించారు. తద్వారా సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి డి.ఎస్. చౌహాన్, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ మైన్స్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేటలో గణేష్ నిమజ్జనం నిర్వహించే చెరువు జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐ.ఏ.ఎస్. పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన వేడుకలకు వచ్చే ప్రజల కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ కార్యక్రమం సజావుగా సాగేలా చూడాలని అధికారులను వారు ఆదేశించారు. భక్తుల భద్రత మరియు సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. బౌరంపేట్ నుండి ఔటర్ రింగ్ రోడ్ వరకు జరుగుతున్న సిసి, బిటి రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని జోనల్ కమిషనర్ పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. బౌరంపేట్ జి.పి.ఆర్. లేఔట్ కాలనీవాసులు తమ కాలనీకి అవసరమైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్లు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజల వినతికి స్పందించిన పింకేష్ కుమార్ వెంటనే ఆ లేఔట్‌ను పరిశీలించి, కనీస సౌకర్యాల కల్పన కోసం అవసరమైన ప్రతిపాదనలు తక్షణమే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణి కరణ్, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్, ఏఎంసీ లక్ష్మయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.



## సాయిసుధీర్ కాలేజీలో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** సాయిసుధీర్ కళాశాలలో ఇసిఐఎల్ కంపెనీ వ్యవస్థాపకులు ఏఎస్ రావు 112వ జయంతిని పురస్కరించుకుని ఆరోగ్య, రక్తదాన శిబిరాలను సాయిసుధీర్ కాలేజ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మల్కాజ్‌గిరి కమిషనరేట్ సిపి సుమతి, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కళాశాల చైర్మన్ ఉషారాణిలు హాజరై ఏఎస్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన విద్యార్థులను వారు అభినందించారు. 300 మంది విద్యార్థులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాజిరెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సాయిలు, ప్రిన్సిపల్స్ మీరానాయుడు, ప్రొఫెసర్ పద్మ, మోహన్‌బాబు, మహేందర్, శ్రీహరి,కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ తీరును ఖండిస్తున్నాం : యుఎస్‌ఎఫ్‌ఐ

**ప్రజాపక్షం/దుండిగల్ :** సూరారం మల్లారెడ్డి హాస్పిటల్‌లో రోగి తండ్రి మధ్యాహ్నమే చనిపోతే సాయంత్రం వరకు ట్రీట్మెంట్ పేరుతో 5 లక్షలు వసూలు చేసి, మరో 80 వేలు కడితేనే శవాన్ని ఇస్తామని బందీ చేయడం దారుణమని యూఎస్‌ఎఫ్ఐ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కుత్బుల్లాపూర్ కు చెందిన ఒక వ్యక్తి లివర్ సమస్యతో తండ్రిని హాస్పిటల్ కు తీసుకెళ్తే ఈ ఘటన చోటు చేసుకుందని, నవభూమి పత్రికలో వచ్చిన కథనం ప్రకారం మధ్యాహ్నమే చనిపోయిన వ్యక్తికి సాయంత్రం వరకు వైద్యం చేసారని కుమార్తె కన్నీటి పర్యంతం అవుతోందని అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఈ ఘటనపై విచారణ జరిపి మల్లారెడ్డి హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/నవాబుపేట:** నవాబుపేట మండలంలోని ఎల్లకొండ గ్రామంలో చేయూత పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఇపిఆర్ శశికుమార్ ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతకు సంబంధించిన అంశాలపై వెరిఫికేషన్ నిర్వహించారు. దరఖాస్తుదారుల కుటుంబ పరిస్థితులు, సంబంధిత వివరాలను పరిశీలిస్తూ అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా పారదర్శకంగా పరిశీలన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లకొండ గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్, ఉప సర్పంచ్ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు ఈ.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని సన్నిధిలో అన్నదానం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** గాంధీ నగర్‌లో స్టార్ యూత్ బ్రదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని సన్నిధిలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఉప్పల్ కోకన్వీనర్ రేగళ్ల సతీష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు మహేష్,కొప్పుల కుమార్,జి సత్యనారాయణ, గుండె కృష్ణ, గుడి శ్రీకాంత్,యూత్ బ్రదర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నా రు.

## హుక్కా సెంటర్‌పై దాడి...15 మంది అరెస్టు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్‌ఐ సాయిలు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పిఎస్ పరిధిలోని నేతాజీ నగర్ రోడ్డులోని ఎలైట్ కేఫ్ బిస్ట్రో అనే హుక్కా సెంటర్‌పై రైడ్ నిర్వహించారు. హుక్కా సెంటర్ యజమాని ఎస్‌వి రావు,మేనేజర్ దిలీప్‌లతో సహ 15 మందిని అదుపులోకి తీసుకుని 5 హుక్కా ఫ్లేవర్స్, 20 ఫిల్టర్స్,6 హుక్కా పాట్స్‌ను స్వాధీనం చేసుకుని సెంటర్ నిర్వహకులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# రైళ్ల రాకపోకల్లో భద్రతే తొలి ప్రాధాన్యం

### స్టేషన్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి
### జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైళ్ల రాకపోకల్లో ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా నిర్దేశిత నిబంధనలు, స్టేషన్ వర్కింగ్ రూల్స్‌ను కచ్చితంగా అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. రైల్వే కార్యకలాపాల్లో భద్రతను మరింత పటిష్టం చేయడంపై సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఆయన ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్లలో అమలవుతున్న వర్కింగ్ రూల్స్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాలని, వాటిపై సిబ్బందికి క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తూ సురక్షిత విధానాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని జిఎం సూచించారు. విధి నిర్వహణ లో ప్రతి ఉద్యోగి నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షణ ఉండాలనిస్పష్టం చేశారు.

**పట్టాలపైకి పశువులు రాకుండా చర్యలు..**

రైల్వే స్టేషన్ల పరిసరాల్లో నివసించే గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి, పశువులు రైల్వే పట్టాలు దాటకుండా చర్యలు తీసుకోవాలని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. స్థానిక ప్రజలకు అవగాహన పెంచడం ద్వారా పశువుల ప్రాణాలను కాపాడటంతో పాటు, రైలు ఇంజిన్లకు నష్టం, రైళ్ల నిలిచిపోవడం వంటి అనుకోని ఘటనలను నివారించవచ్చని తెలిపారు. ఈ అంశంపై స్థానిక సిబ్బంది, పర్యవేక్షకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా రైళ్లను నడిపే సిబ్బంది, రైలు పాసింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులకు నిర్ణీత గడువు కంటే ముందుగానే కాలానుగుణ వైద్య పరీక్షలకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యవేక్షకులు, క్షేత్రస్థాయి సిబ్బందికి రిఫ్రెషర్ కోర్సులను ముందుగానే కేటాయించి, వారి సాంకేతిక పరిజ్ఞానం, పని నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచాలని సూచించారు. సమావేశంలో ఎస్‌సిఆర్ అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్‌తో పాటు వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్‌లు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ మూడు డివిజన్ల డిఆర్‌ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు.

**విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యం: జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ**

విద్య కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాదని, అకడమిక్స్‌తో పాటు కళలు, క్రీడలు, సృజనాత్మకతలో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యమని దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. లాలాగూడ రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యాలు, ప్రతిభాభివృద్ధి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన కిండర్ కార్ట్, తృప్తి కామన్ డైనింగ్ స్పేస్, దీపిక హౌస్ నృత్య వేదిక, జయశ్రీ హౌస్ వేదిక, సుశ్రుత స్కూల్ హెల్త్ యూనిట్‌తో పాటు ఆధునీకరించిన ఆడిటోరియంను సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం ప్రారంభించారు. 1907 లో స్థాపించబడిన ఈ పాఠశాలలో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, గ్రంథాలయం, కంప్యూటర్, సైన్స్, టింకరింగ్ ల్యాబ్‌లతో పాటు క్రీడలు, కళలకు సంబంధించిన సదుపాయాలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన వేదికలు కూచిపూడి, కర్ణాటక సంగీతం వంటి కళల్లో శిక్షణకు ఉపయోగపడనున్నాయి. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు 'సుశ్రుత' హెల్త్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ నూతన సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు జిఎం సత్య ప్రకాశ్, పిసిపిఓ సిద్ధార్థ్ కటి, హైదరాబాద్ డివిజన్ డిఆర్‌ఎం సంతోష్ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు ముందుకు వెళ్లాలి

### ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు ముందుకువెళ్లాలని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం డాగ్ బంగ్లాలోని కెఎం పాండు మెమోరియల్ ఒకేషనల్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరం ఒకేషనల్, ఇంటర్మీడియట్, డిగ్రీ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో విద్యార్థులను ప్రోత్సహించి, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తమ జ్ఞానాన్ని పంచిన గురువులను సన్మానించారు. కళాశాలలో జరిగిన గురుపూజోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద అధ్యాపకులను అభినందించి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్మాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మి విద్యాభివృద్ధికై నిత్యం పాటుపడిన మా నాన్న మాజీ మున్సిపల్ చైర్మన్, దివంగత నేత కెఎం పాండు పేరు మీద ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని, ఉత్తమ ఫలితాలను సాధించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నా రు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకై వారిని ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రధానోపాధ్యాయులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కళాశాలను మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షేక్ మైమూస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.రాజు, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనం



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానం చేయడం మహోన్నతమైన సేవ అని, వినాయక ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనమని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. వినాయక చవితి సందర్భంగా కూకట్‌పలిల నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో సోమవారం శేఖర్ గజానంద్, అశోక్ ముదిరాజ్, తూము కొండల్ రావు, శేఖర్‌గౌడ్, రాజశేఖర్ రెడ్డి వివిధ ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. అనంతరం ఆయా మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎదురయ్యే విఘ్నాలన్నీ తొలగిపోయి రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. సకల సంకల్పాలకు విఘ్నాలు తొలగించి, ప్రతి అడుగులో విజయాన్ని అందించాలని, ప్రజలకు జ్ఞానం, ధైర్యం, సత్‌ప్రవర్తన ప్రసాదించాలని విఘ్నేశ్వరుడిని వేడుకున్నట్లు చెప్పారు. వినాయక ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యత, సోదర భావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. యువత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. భక్తి భావంతో పాటు సామాజిక బాధ్యతను పాటిస్తూ అందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్, ఏ,బి బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, తూము వేణు, తూము సంతోష్, సాధు ప్రతాప్ రెడ్డి, సతీష్‌గౌడ్, మొయినుద్దీన్, సుంకన్న, ఎడ్ల ప్రభాకర్, రాముగౌడ్, విట్టల్‌రెడ్డి, సచిన్, మల్లేష్ యాదవ్, కర్క పెంటయ్య, కొండల్‌రెడ్డి, కుమార్ యాదవ్, కనకయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

### నూతన చైర్మన్‌గా మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయమని, సకాలంలో రైతులకు రుణాలను అందించెందుకు తన వంతు కృషి చేస్తానని తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ రైతు సహకారం సంఘం నూతన చైర్మన్ పి. మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం పెద్దేముల్ మండల పరిధి తట్టేపల్లి సహకార సంఘం కార్యాలయంలో నూతన పాలకవర్గ సభ్యులతో కలసి నూత చైర్మన్‌గా మహిపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బండమీదిపల్లి జగన్ లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు ప్రభుత్వ పరంగా వచ్చే అన్నింటి అందజేస్తామని అన్నారు. సహకారం సంఘం అభివృద్ధికి నూతన పాలకవర్గం సభ్యుల, పాత పాలకర్గం సభ్యులు సలహాలు సూచనలను తీసుకుని ముందుకు సాగుతామన్నారు. స్థానిక ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి సహకారంతో తట్టేపల్లి ప్రాంతంలో చెక్కర కర్మాగారం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. సహకారం సంఘంలో ప్రస్తుతం ఉన్న రూ.26కోట్ల టర్నోవర్‌ను రెట్టింపు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. దీర్ఘ కాలిక రుణాల కింద రూ.10 లక్షల వరకు అందజేసి రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అంజయ్య, ఉప్పరి మల్లేశం, సర్పంచ్ నారాయణగౌడ్, మాజీ ఎంపిటిసి శంకర్ నాయక్, నూతన సంఘ సభ్యులు వైస్ చైర్మన్ జగన్, రాయిగల్ల ఆనందం, రాములమ్మ, రాథోడ్ గోపాల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## రూ. 2.50 లక్షలు పలికిన శ్రీ సాయి యూత్ లడ్డు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట డివిజన్ బాబాగూడలోని శ్రీసాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో, ఆట పాటలతో నిమజ్జనానికి తరలించారు. కాగా అంతకు ముందు గణనాధుడిని చేతిలో నిత్య పూజలందుకున్న లడ్డూను బాబాగూడకు చెందిన దాసరి సాయినాథ్‌రెడ్డి రూ. 2.50 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. శ్రీసాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడిని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి కోలాటం ఆట పాటలతో ఘనం గా చెరువులో నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో ఫార్మెట్ కమిటి గణనాధుడి చేతిలో లడ్డూను సాదుల కరుణాకర్‌రెడ్డి రూ. 71 వేలకు వేళం పాట పాడి దక్కించుకున్నారు. ఈ సంధర్భంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, రామాలయం మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజి ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, స్థానికులు గణపతి లడ్డూను సాదు కరుణాకర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం భక్తు లు ఉత్సవ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించి వినాయకుడిని చెరువులో నిమజ్జనం చేశారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి వినాయక శోభాయాత్ర ఉత్సవాలను భక్తులు, ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, అన్నదానం, నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మేడ్చల్, కొంపల్లి, దేవరయాంజాల్, పోతాయి పల్లి, గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న టిపిసిసి మహిపాల్‌రెడ్డిని మంటప నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## గణపతి లడ్డూ వేలం రూ.2.65 లక్షలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాం పేట్ సర్కిల్ బాచుపల్లిలోని పోచమ్మ ఆలయ ఆవరణలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో భాగం గా గణపతి లడ్డూ వేలం నిర్వహించారు. నందిగామ లక్ష్మన్ ముదిరాజ్ రూ. 2.65 లక్షలకు గణపతి లడ్డూని దక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ కార్పొరేటర్‌లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని సిపిఐ నాయకుల వినతి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్టలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌ను గతంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని సిపిఐ నాయకులు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం సిపిఐ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పనిచేస్తుందని పేర్కొన్నారు. జగద్గిరి గుట్ట అభివృద్ధిలో అధికారులు కూడా భాగస్వాములై ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌ను సిపిఐ నాయకులు సన్మానించి, జగద్గిరిగుట్టలో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, యువజన సంఘం కార్యదర్శి కీర్తి, సిపిఐ నాయకులు సదానందం, సహదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/కీసర :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మేడ్చల్‌మల్కాజ్‌గిరి డిసిసి అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం ఘనంగా ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కీసర డివిజన్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, కార్యాలయం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అధ్యక్షురాలు స్వప్న విజయ్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి నాయకులు వేముల మహేష్‌గౌడ్, బక్కని నర్సింగ్‌రావు, పంగ హరి బాబు, ముప్ప రామారావు, కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రోటర్‌డామ్‌దే రోప్ స్కిప్పింగ్ కిరీటం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లిలోని రోటర్ డామ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈనెల 19,20 తేదీల్లో ఐదో రాష్ట్రస్థాయి తాడు దూకుడు క్రీడల పోటీలు ఉత్సాహంగా జరిగాయి.వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటగా,రోటర్ డామ్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు.దేవేంద్ర విద్యాలయ విద్యార్థులు ద్వితీయ,కేవీ2ఉప్పల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.పోటీలను తెలంగాణ రోప్ స్కిప్పింగ్ సంఘం అధ్యక్షుడు జక్కా వెంకట్ రెడ్డి ప్రారంభించారు.విజేతలకు పతకాలను కేవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఈవీ రమణ,రోటర్ డామ్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి అందజేశారు.క్రీడలు విద్యార్థులను శారీరకంగా,మానసికంగా దృఢంగా తీర్చిదిద్దుతాయని జక్కా వెంకట్ రెడ్డి తెలిపారు.విజయానికి క్రమశిక్షణ,సాధన,పట్టుదల అవసరమని రూపారెడ్డి సూచించారు.కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి,శ్వేతారెడ్డి,ఈవీ రమణ,సూర్యప్రకాష్,భాను ప్రకాష్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సు కింద పడి వలస కూలీ మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఆర్‌టిసి బస్సు చక్రాల కిందపడి వలస కూలీ మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సీతారాంశర్మ(35) షాపూర్ నగర్‌లో నివాసముంటు తుర్కపల్లి పరిధిలోని కంపెనీల్లో కూలీ పనులు చేసుకుంటు జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం బైక్‌పై సీతారాంశర్మ, మరో కూలీ నాగేశ్వర్‌రావులు తుర్కపల్లి వైపు వస్తుండగా శామీర్‌పేట రాజీవ్ రహదారి పెద్ద చెరువు సమీపంలోకి రాగానే సిద్దిపేట డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో సీతారాంశర్మ హెల్మెట్ పెట్టుకున్న హెల్మెట్ పగిలిపోయి తలపై నుంచి బస్సు టైర్ వెళ్లడంతో తల భాగం చితికిపోయి తీవ్ర రక్త గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. నాగేశ్వర్‌రావుకు స్వల్ప గాయాలు తగిలాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## ఇసి నగర్ అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఇసీ నగర్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఇసీ నగర్ సొసైటీ అధ్యక్షులు బూడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇసీ నగర్ బిల్డింగ్ సొసైటీ సభ్యుల సమావేశం కమ్యూనిటీ హాలులో నిర్వహించారు.ఇసీఐఎల్ కంపెనీ పితామహుడు పద్మభూషణ్ ఏఎస్ రావు 112వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ అభివృద్ధి పనులపై చర్చించి జమ ఖర్చుల వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జగ్గరాజు, బీమ గోని బాలయ్యగౌడ్, వర్మ, కాలనీవాసులు భానుకుమార్, మల్లేష్,బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
22-09-2026
www.prajapaksham.in

"నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో ప్రతిష్టాత్మక పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా. ఈ చిత్రంలో గోండ్ గిరిజన మహిళ పాత్ర పోషిస్తున్న రష్మిక , ఆ పాత్రలో ఒదిగిపోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు."



## చాలా హార్డ్ వర్క్ చేసిన సినిమా 'మైసా'

### టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రష్మిక మందన్న



నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా. ఈ చిత్రంలో గోండ్ గిరిజన మహిళ పాత్ర పోషిస్తున్న రష్మిక , ఆ పాత్రలో ఒదిగిపోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్ఫార్ములా ఫిలమ్స్ నిర్మిస్తున్న 'మైసా' ఆకట్టుకునే ఫస్ట్ గ్లింప్స్‌తో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తించింది. నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. అలసిపోయాను.. ఆగిపోయాను.. ఓడిపోయాను అంటూ రష్మిక చెప్పే డైలాగ్‌తోఆమె పాత్రలోని ఇంటెన్సిటీని పరిచయం చేశారు. భయపడని, వెనక్కి తగ్గని గిరిజన మహిళగా ఆమె పాత్ర అద్భుతంగా ఉంది. తాను ఎదుర్కొనే ఎన్నో సవాళ్లు, సామాజిక అడ్డంకులను అధిగమిస్తూ.. ప్రతి సమస్యను ఎదురించి పోరాడే ఒంటరి యోధురాలిగా మైసా కనిపిస్తుంది. గోండ్ గిరిజన మహిళ పాత్రలో రష్మిక ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌లో అదరగొట్టారు. టీజర్ రిలీజ్ సందర్భంగా హీరోయిన్ రష్మిక మాట్లాడుతూ ఇప్పటివరకు పెర్ఫార్మెన్స్ అంటే ఎమోషన్స్‌తో చేశాను. ఇది నాకు కొత్త టెరిటరీ. ఇంత యాక్షన్ ఎప్పుడూ చేయలేదు. ఫస్ట్ టైమ్ చేసినప్పుడు ఒక నెర్వస్నెస్ ఉంటుంది. ఎప్పుడైనా ఒక క్యారెక్టర్ చేస్తున్నప్పుడు అందులో కొత్తదనం ఉండాలని నేను ఫీల్ అవుతాను.'మైసా' కోసం నా లైఫ్‌ని ఇచ్చేశాను. డైరెక్టర్ నాతో చాలా చేయించారు. కథ అద్భుతంగా అనిపించింది. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ శ్రేయాస్ పి. కృష్ణ, డైరెక్టర్ రవీంద్ర, నిర్మాత అజయ్ పాల్గొన్నారు.



## 'సిగ్మా' ట్రైలర్ రిలీజ్

సందీప్ కిషన్ యాక్షన్‌అడ్వెంచర్ 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. తాజాగా దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ఈ సినిమా తెలుగు థియేట్రికల్ ట్రైలర్ను లాంచ్ చేశారు. మోసపోయిన హీరో, జరిగిన దాన్ని మర్చిపోయి ముందుకు వెళ్లకుండా.. తనకు జరిగిన నష్టాన్ని తిరిగి సాధించుకోవాలని పోరాటం మొదలుపెడతాడు. డ్రగ్స్, గ్యాంబ్లింగ్కు సంబంధించిన రూ.500 కోట్ల భారీ రాకెట్ ఈ కథలో కీలకంగా ఉంటుంది. దీంతో హీరో క్రైమ్, మోసం, ప్రమాదాలతో కూడిన ప్రపంచంలోకి అడుగుపెడతాడు.మరోవైపు ఓ అర్జేతో ప్రేమలో ఉన్న హీరో.. తన స్నేహితుల సహాయంతో భారీ హీస్ట్‌కు ప్లాన్ చేస్తాడు. అన్ని అడ్డంకులను అధిగమించి తన లక్ష్యాన్ని ఎలా సాధించాడనేది ఆసక్తికరంగా మారింది.సందీప్ కిషన్ కు జోడిగా ఫారియా అబ్దుల్లా హీరోయిన్ గా నటించింది. రాజు సుందరం, సంపత్,. శివ పండిట్, అన్బు తాసన్, యోగ్ జపీ కీలక పాత్రల్లో కనిపించారు.కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ఎస్. థమన్ సంగీతం అందించారు.

## ఆ క్యారెక్టర్ తెలుగు సినిమాలో రాలేదు

### డైరెక్టర్ శ్రీకాంత్ థియేటర్ ఊగిపోయే యాక్షన్ డిజైన్ చేశారు

### మీడియా చిట్ చాట్‌లో హీరో నాని

నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా న్యాచురల్ స్టార్ నాని మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నా కెరీర్ స్టార్ట్ అయిందే సెప్టెంబర్‌లో. 'అష్టా చమ్మా' సెప్టెంబర్లోనే రిలీజ్ అయింది. 'భలే భలే మగాడివోయ్' కూడా సెప్టెంబర్లోనే వచ్చింది. ఇప్పుడు ఆ హిట్ సెంటిమెంట్ 'ప్యారడైజ్'కి వర్క్ అవుట్ అవుతుందని నమ్ముతున్నాను.కథలో నుంచి వచ్చిన లుక్ అది. నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలు అన్నీ బాగా రిలేటబుల్‌గా, తెలిసిన ఒక పర్సన్ లాంటి ఫీలింగ్ వచ్చే రోల్స్. ఇందులో క్యారెక్టర్ మాత్రం జనరల్ సొసైటీలో పెరిగిన వ్యక్తి కాదు. అది ఏంటి అనేది మీరు సినిమా చూస్తున్నప్పుడు అర్థం అవుతుంది. శ్రీకాంత్ కథ చెప్పినప్పుడే మోహన్ బాబు అయితే బాగుంటుంది అని అన్నాడు. కాకపోతే ఆయన ఈ క్యారెక్టర్ చేస్తారా లేదా అనేది నాకు డౌట్. ఎందుకంటే చాలా నెగిటివ్, బ్రూటల్ క్యారెక్టర్. శ్రీకాంత్ కథ చెప్పడానికి మోహన్ బాబు దగ్గరికి వెళ్లాడు. ఆయన చాలా ఎక్సైట్మెంట్ ఫీల్ అయ్యారు. అది చూసి నేను షాక్ అయ్యాను. ఈ కథ విన్నప్పుడే ఇది చాలా పెద్ద సినిమా అవుతుందని నమ్మిన మొదటి వ్యక్తి మోహన్ బాబు. శ్రీకాంత్‌అనిరుధ్ కిల్లర్ కాంబినేషన్. వాళ్ల వల్లే 'ఆయా షేర్', 'ఏషు నాగుల కట్ట' లాంటి సాంగ్స్ సాధ్యమయ్యాయి.శ్రీకాంత్ దృష్టిలో నేను పెద్ద డ్యాన్సర్ని . నివ్వు డ్యాన్స్ చేస్తే మస్తు ఉంటది అన్న అని చెప్తుంటాడు. 'ప్యారడైజ్' అనే ప్లేస్లో సవారి అనే ఒక ట్రైబ్కు సంబంధించిన కథ ఇది. అక్కడ సవారీలకు గుర్తింపు లేదు. వాళ్ల ఉనికిని కూడా ఎవరు పట్టించుకోరు. వాళ్లని చంపేసినా సరే కేసు కూడా పెట్టరు. ఐడెంటిటీ కోసం చేసిన ఒక తిరుగుబాటు. 1984–85 టైమ్లైన్ మధ్య ఉంటుంది. 'సలార్', 'కేజీఎఫ్' సినిమాలు చూస్తున్నప్పుడు ఆ ప్రాంతాలు ఉన్నాయా లేదా అనేది పక్కన పెడితే అక్కడ చూపించిన వరలికు మనం రిలేట్ అవుతాం. ఇందులో ఉన్న 'ప్యారడైజ్' కూడా అలాంటి ఫీలింగ్ కలిగిస్తుంది.

## రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా 'డానీ'



రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, కళ్యాణ్జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్ల మీద రిజ్వాన్ నిర్మాణంలో కళ్యాణ్జీ గోగణ తెరకెక్కిస్తున్న చిత్రం 'డానీ'. ఈ సినిమాలో ఆశిష్ గాంధీ, సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా రానున్న ఈ మూవీ నుంచి ఫస్ట్ టీజర్ విడుదల చేశారు.'నువ్వు బీచ్కి ఎప్పుడూ ఒంటరిగా వస్తావా?'.. అని అమ్మాయి అడగడం.. 'నేను బీచ్కి రావాలంటే కచ్చితంగా అమ్మాయి ఉండాల్సిందే' అని హీరో చెప్పే డైలాగ్.. ఆ తర్వాత వచ్చే బోల్ డైలాగ్, బీచ్లో అమ్మాయి అందాలు ఇలా అన్నీ కూడా యూత్ ఆడియెన్ని ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇక ఈ టీజర్‌ను గమనిస్తే కావాల్సినంత యాక్షన్తో పాటు రొమాన్స్ కూడా ఉందని అర్థం అవుతోంది. బోల్డ్, రా అండ్ రస్టిక్‌గా 'డానీ' రానుందని ఈ ఫస్ట్ స్ట్రైక్ చెప్పకనే చెబుతోంది.డానీ ఫస్ట్ స్ట్రైక్ లోని విజువల్స్, కెమెరా వర్క్ టాప్ నాచ్‌లో ఉంది. సాయి కార్తీక్ బీజీఎం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ మూవీకి ఖుషి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఏకే ఆనంద్ కెమెరామెన్గా, మణికాంత్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఇతర అప్డేట్లను మేకర్స్ ప్రకటించనున్నారు. అక్టోబర్‌లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారు.

## యాక్షన్ చిత్రంగా 'ఆన్ డ్యూటీ'



పోలీస్ కంప్లెంట్ సినిమా తీసిన సంజీవ్ కుమార్ మేగోటి ఇప్పుడు కన్నడలో 'ఆన్ డ్యూటీ' పేరుతో ఓ సినిమా చేస్తున్నారు. ఈ మూవీలో కన్నడ కంఠీరవ డాక్టర్ రాజ్కుమార్ కుటుంబానికి చెందిన హీరో విజయ్ రాఘవేంద్ర కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఇప్పటికే క్రైమ్, సస్పెన్స్, యాక్షన్ జానర్లో పలు విభిన్న చిత్రాల్లో నటించిన విజయ్ రాఘవేంద్ర.. సంజీవ్ మేగోటి చెప్పిన ఈ సరికొత్త కథకు ఓకే చెప్పడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. విజయ్ రాఘవేంద్ర ఫిల్మోగ్రఫీలో కూడా క్రైమ్, థ్రిల్లర్, యాక్షన్ కథలు కనిపిస్తాయి. విజయ్ రాఘవేంద్ర ఇటీవల నటించిన 'సెకండ్ కేస్ ఆఫ్ సీతారాం' మూవీ ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్లో స్ట్రీమింగ్ అవుతూ సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

## మలయాళ సినిమాలోకి సూర్యతేజ



భారత సినీ రంగంలో మలయాళ చిత్ర పరిశ్రమ ఒక ప్రత్యేకమైన క్రేజ్ ను పుణికి పుచ్చుకుంటూ ముందుకు సాగుతూ ఉంటుంది . మలయాళ చిత్ర సీమ నుండి డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీస్ రూపుదిద్దుకుని ఇండియన్ ఫిలిం సర్కిల్ లో ఎప్పటికప్పుడు సెన్సేషన్ క్రియేట్ చేస్తూనే ఉంటాయి .అటువంటి వైవిధ్యమైన చిత్ర పరిశ్రమ లోకి తెలుగు డైరెక్టర్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. తెలుగులో 'ఫోకస్' కన్నడంలో 'కృష్ణ నీ బాగానే బారో ' తదితర చిత్రాలకు దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ సూర్య తేజ తాజాగా మలయాళ సినీ రంగంలో ఎంట్రి ఇవ్వ బోతున్నారు. ఒక స్టార్ హీరోతో సినిమాను తెరకెక్కించబోతున్నారు. అతి త్వరలో సెట్స్ మీదకి వెళ్లనున్న ఈ మూవీ పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## లింగాల కేదారి కుటుంబానికి
# రూ. 10 లక్షల ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన కీ.శే.లింగాల కేదారి, ఆయన భార్య కీ.శే. పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుంచి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలని సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. హనుమకొండలోని శాంతినగర్ పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మృతి చెందారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సిఎంఆర్ఎఫ్ నుంచి సిఎం ఓఎస్‌డి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ఆదేశించారు.

**అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షలు**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని సిఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 2013 జూన్ 20వ తేదీన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమయ్యాడు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విజ్ఞప్తి మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని, ఈ క్రమంలో ఆయన అరెస్ట్ అయి చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించబడ్డారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యాడని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

తెలంగాణ అమరవీరుల కోటా కింద మానవతా దృక్పథంతో ఆయన తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మి రెడ్డికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# రేపటి నుండి జిన్‌పింగ్ అమెరికా పర్యటన

### రెండు దేశాల మధ్య వ్యూహాత్మక స్థిరత్వం, ఎఐ భయాలు,వాణిజ్యంపై ప్రధాన దృష్టి



**బీజింగ్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అమెరికా పర్యటనను ఆ దేశ విదేశీమంత్రిత్వ శాఖ సోమవారం అధికారికంగా ఖరారు చేసింది.బుధవారం (సెప్టెంబరు 23–25) నుండి శుక్రవారం వరకూ జిన్‌పింగ్ అమెరికా పర్యటన ద్వారా ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగల దేశాలమధ్యా వ్యూహాత్మక స్థిరత్వం మరింత బలపడుతుందని చైనా ఆశాభావం వ్యక్తం చేసింది. వాణిజ్య వివాదాలు,కృత్రిమ మేధపై వదంతులు,ఆరోపణలు,పశ్చిమాసియాలో ట్రంప్ యుద్ధం వంటి అనేక విస్తారమైన విషయాలపై రెండు దేశాల నాయకులు ఉమ్మడి అభిప్రాయానికి రావడానికి ఈ సమావేశం ఉపయోగపడుతుందని చైనా అధికారులు పేర్కొన్నారు. ఎఐ టెక్నాలజీ పరిశ్రమలో ఆధిపత్యంకోసం చైనా–అమెరికా పోటీ పడుతున్నాయి. మానవాళిని ఎఐ తుడిచిపెడుతుందని,దాని వేగాన్ని తగ్గించాలని ఇటీవలికాలంలో అమెరికాపై తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. ఐతే చైనా ఆధిపత్యం నేపథ్యంలో తాము వెనక్కు తగ్గేదే లేదని, ఇవన్నీ బూటకపు ప్రచారాలని ట్రంప్ కొట్టిపారేశారు. ఐతే జిన్‌పింగ్ పర్యటనలో ఎఐ భయాలపై ప్రధానంగా నాయకులు చర్చిస్తారు.

చైనా విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి గ్వో జియాకున్ మాట్లాడుతూ, ప్రపంచశాంతి, ఆర్థిక అభివృద్ధి, చైనా–అమెరికా సంబంధాలు,ఇతర ప్రధాన అంశాలపై నాయకులు ఇద్దరూ లోతైన అభిప్రాయాలను పంచుకుంటారని చెప్పారు. రెండు దేశాల మధ్యా నిర్మాణాత్మక,వ్యూహాత్మక సంబంధాలను సుసంపన్నం చేయడానికి,విభేదాలను పరిష్కరించడానికి అమెరికాతో కలిసి చైనా పనిచేస్తుందని చెప్పారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో బుధవారం జిన్‌పింగ్‌కు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఎదురువెళ్ళి స్వాగతం పలుకుతారు.అదేరోజు వారిద్దరి మధ్యా సమావేశాలు జరుగుతాయి. గడచిన మే నెలలో ట్రంప్ చైనాలో పర్యటించినప్పుడు చైనా ఉపాధ్యక్షుడు ఆయనకు స్వాగతం పలికారు.''నేను ఆయనతో దాదాపు అన్ని విషయాలూ చర్చిస్తాను'' అని ట్రంప్ ఆదివారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో వెళుతూ పాత్రికేయులకు చెప్పారు. రెండు దేశాలమధ్యా వాణిజ్య యుద్ధం ట్రంప్ చర్యల కారణంగా రాజుకుంటోంది. ఇరు దేశాలూ సుంకాలకు సంబంధించి ఏడాదిపాటు విరామం ప్రకటించినప్పటికీ ఒక శాశ్వత ఒప్పందానికి రాలేదు.ఈ రెండు అగ్రదేశాల సుంకాల యుద్ధంలో తాత్కాలిక విరామం నవంబరు 10వ తేదీతో ముగిసిపోతుంది.ఇరుపక్షాలు కీలక ఆర్థిక,వాణిజ్య సమస్యలపై నిష్కపటంగా,లోతైన చర్చలు జరిపాయని చైనా అధికార వార్తాసంస్థ జిన్హువా ప్రకటించింది. అమెరికా ఆర్థిక ప్రయోజనాలు కాపాడటానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని 'ఎక్స్ ఆన్ సండే'లో స్కాట్ బెస్సెంట్ పేర్కొన్నారు.

## ఢిల్లీ కోర్టు

(మొదటి పేజీ తరువాయి)

చేశారని, దీనిపై విచారణ జరపాలని అడ్వకేట్ వికాస్ త్రిపాఠి గత ఏడాది మెజిస్టీరియల్ కోర్టులో ఫిర్యాదు చేశారు. త్రిపాఠి సెంట్రల్ ఢిల్లీ కోర్టు బార్ అసోసియేషన్ ఆఫ్ రౌస్ ఎవెన్యూ కోర్ట్స్‌కు ఉపాధ్యక్ష పదవిలో కూడా ఉన్నారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత( బిఎన్ఎస్ఎస్)లోని 175(3) సెక్షన్‌ను పరిగణనలోకి తీసుకోలేదని, మెజిస్ట్రేట్ పోలీసు అధికారి విజ్ఞప్తిని పట్టించుకోలేదని, సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి ఎఫ్ఐఆర్ నివేదికను తెప్పించుకుని పరిశీలించడం వంటి చర్యలు తీసుకోలేదని అందువల్ల ఆయన ఉత్తర్వులో చట్టపరమైన లోపాలు ఉన్నాయని ఢిల్లీ కోర్టు పేర్కొంది.

## 'యునైటెడ్ రష్యా'కు మెజారిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఉక్రేన్‌లో ఉన్న రష్యా అధీనంలోకి వచ్చిన డోనెట్స్క్,లుగాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్,ఖెర్సన్,జపోరిఝియే ప్రాంతాలు పూర్తిస్థాయిలో పోలింగ్‌లో పాల్గొని రష్యా డ్యూమా అధీనంలోకి,రష్యా చట్టపరిధిలోకి వచ్చాయి. ఈ ప్రాంతాలు రష్యా ఎన్నికల వ్యవస్థలో పూర్తిగా కలిసిపోయాయి.

## అంతిమ వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)



డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శులు, పల్లా వెంకట రెడ్డి, కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, పి.ప్రేమ్ పావని, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.జ్యోతి, ఆర్.అంజయ్యనాయక్, సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు, డైరెక్టర్ డాక్టర్ రజని, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవిఎల్, బొమ్మగాని నాగభూషణం, కె.ధర్మేంద్ర, నళిని తదితరులు పుష్పగుచ్ఛాలతో నివాళుఉల అర్పించారు. అనంతరం మగ్ధూంభవన్ నుంచి భౌతికకాయాన్ని జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానానికి తరలించారు. అక్కడ ఆయన కుమారుడు ఏటుకూరి శ్రీనివాస మూర్తి తన తండ్రి కృష్ణమూర్తి అంత్యక్రియాలను పూర్తి చేశారు.

**104 ఏళ్ల వయస్సులోనూ ఉద్యమ ఉత్సాహాన్ని వీడలేదు : నారాయణ**

డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ 104 ఏళ్ల వయసులోనూ ఉద్యమ ఉత్సాహాన్ని వీడలేదని, పదవీ విరమణ అనంతరం రిటైర్డ్ ఉద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధుల సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి వారి హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. ఆయన మరణాన్ని కేవలం విషాదంగా చూడకుండా, ఆయన ఆశయాలు, నిబద్ధతను చూసి గర్వపడాలని అన్నారు. గుంటూరులో తాను విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే కృష్ణమూర్తితో పరిచయమని, ఎన్‌జిఓ నాయకుడిగా, సిపిఐతో పాటు పార్టీయేతర ప్రజల్లోనూ ఆయనకు ఎంతో గౌరవం ఉండేదని చెప్పారు.

**కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం : పల్లా వెంకట రెడ్డి**

పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ కృష్ణమూర్తి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, స్వాతంత్ర్య సమరయోధుల ఉద్యమానికి లోటని అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చివరి వరకు చురుగ్గా పాల్గొన్న ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. సైన్యంలో, రెవెన్యూ శాఖలో పనిచేయడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల సంఘం కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

**కమ్యూనిస్టు పార్టీలు ఐక్య కావాలనేది ఏటుకూరి కృష్ణ మూర్తి ప్రధాన ఆకాంక్ష : చాడ వెంకట రెడ్డి**

చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు ఐక్య కావాలనేది ఏటుకూరి కృష్ణ మూర్తి ప్రధాన ఆకాంక్షగా ఉండేదని, అదే నేరవేరక పోవడం బాధాకరమన్నారు. ఏటకూరి కుటుంబం కమ్యూనిస్టు ఉద్యమం, త్యాగం, మానవతావాదానికి నిలయమని ఆయన కొనియాడారు. కృష్ణమూర్తి 104 ఏళ్లు పూర్తి చేసుకుని 105వ ఏట అడుగుపెడుతున్న సమయంలో తుదిశ్వాస విడడం, ఇంత సుదీర్ఘకాలం సేవలందించడం ఆయన మనోబలానికి నిదర్శనమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావాలని, భావితరాలకు ఉద్యమ బాటలు వేయాలనే ఆకాంక్షతో ఆయన ప్రతి సందర్భంలోనూ మాట్లాడేవారని చెప్పారు. ఏటుకూరి కృష్ణమూర్తి తన వద్ద ఉన్న ఆర్థిక వనరులను విశాలాంధ్ర, నవచేతన ప్రచురణలతో పాటు సిపిఐ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ శాఖలకు సమానంగా విరాళాలుగా అందించేవారని తెలిపారు.

**సంపూర్ణ జీవితం ప్రజాసేవకు అంకితం : రామకృష్ణ**

కె.రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణమూర్తి తన సంపూర్ణ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారని అన్నారు. గత ఏడాది వరకు కూడా పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమాల్లో, మగ్ధూంభవన్‌లో నిర్వహించిన తన పుట్టినరోజు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. దేశ రక్షణలో సైన్యంలో పనిచేసిన అనంతరం రెవెన్యూ శాఖలో సేవలందించారని, ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంఘ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహించిన ఆయన అందరి ప్రశంసలను అందుకున్నారని తెలిపారు.

**కృష్ణమూర్తి ఆశయాలు నిబద్ధత భావితరాలకు ఆదర్శప్రాయం : నెల్లికంటి సత్యం**

నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కృష్ణమూర్తి ఆశయాలు, నిబద్ధత, ప్రజాసేవా స్ఫూరి భావితరాలకు ఆదర్శప్రాయమని అన్నారు. 104 ఏళ్ల వయస్సులోనూ ఆయన ఆరోగ్యం, జీవనశైలి గురించి వచ్చిన కథనాన్ని చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు.

ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కడారి ప్రభాకర్ మాట్లాడుతూ ఏటుకూరి కృష్ణమూర్తి తన జీవితాంతం తాను నమ్మిన ఆదర్శాలు, విలువలు, సమగ్రత కోసం రాజీపడకుండా నిలిచారని కొనియాడారు. ప్రేమ్ పావని మాట్లాడుతూ వందేళ్ల పెద్ద కమ్యూనిస్టు యోధుడు ఉన్నాడనే విశ్వాసాన్ని కలిగించిన కృష్ణమూర్తి భౌతికంగా మనకు దూరం కావడం బాధాకరమన్నారు. వామపక్ష ఉద్యమ ఐక్యత కోసం కృషి చేయాలనే సంకల్పంతో ఆయన ఉండేవారని, రానున్న రోజుల్లో వామపక్ష ఐక్యత కోసం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.

డాక్టర్ రజని మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్‌ను సందర్శించిన కృష్ణమూర్తి అక్కడ అందిస్తున్న సేవలను కొనియాడడమేకాకుడా విరాళాలను అందజేశారని మేనల్లుడు పూర్ణచందర్ మూర్తి మాట్లాడుతూ కృష్ణమూర్తి కమ్యూనిస్టు పార్టీలో భాగమై, కమ్యూనిజాన్ని జీర్ణించుకున్న వ్యక్తి అని కొనియాడారు. కృష్ణమూర్తి ఎన్నో పుస్తకాలు రచించారని, తన భావాలను ఆ పుస్తకాల ద్వారా వ్యక్తపరిచారని గుర్తు చేశారు.

## తొలి ఛార్జిషీట్

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఎదుట వాదనల నిమిత్తం తుషార్ మెహతా హాజరైన సందర్భంగా నిందితుల బెయిలు విషయాన్ని ప్రస్తావించారు. తాము అనివార్యంగా 90 రోజుల గడువులోపు ఛార్జిషీటు దాఖలు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

కాగా ఇప్పటివరకూ ఈ కేసులో సాధించిన పురోగతి,తీసుకున్న చర్యలు,పరిణామాల పూర్తి వివరాల నివేదికను ఒక సీల్డ్ కవరులో సమర్పించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది.సిఆర్‌పిసి సెక్షన్ 167(2) కింద దర్యాప్తు సంస్థ గనుక 60 నుండి 90 రోజుల లోపు ఛార్జిషీటు నమోదు చేయడంలో విఫలమైతే,చట్టబద్ధంగా నిందితులకు ట్రయల్ కోర్టు ద్వారా బెయిలు లభిస్తుంది. గతంలో సిఆర్‌సిపి 167 (2) సెక్షన్‌కు బదులుగా ఈ స్థానంలో కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) చట్టంలోని సెక్షన్ 187 అమలులోకి వచ్చింది. ఈ కేసులో దర్యాప్తు వేగంగా పూర్తిచేయాలని,తార్కికంగా చెల్లుబాటయ్యే ముగింపు ఈ కేసుకు ఉండాలని సుప్రీంకోర్టు ధర్మాసనం దర్యాప్తు సంస్థను ఆదేశించింది. నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని జులై 27న సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. దానికి గుర్తింపు ఇచ్చింది. అందులో మార్పులను కూడా సూచించింది. ఒక ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా ఈ దర్యాప్తు బృందంలో సభ్యుడుగా నియమించాలని సూచించిది. ఈ దర్యాప్తు బృందాన్ని ఐజిపి కిరణ్ సారథ్యంలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com